www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 337
గురువారం | 6-3-2025
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి ఉ.10.51 తదుపరి అష్టమి; నక్షత్రం: రోహిణి రా.12.05 తదుపరి మృగశిర; వర్జ్యం: సా.4.26-5.57, తె.5.33 మొ; అమృతఘడియలు: రా.9.01-10.33; దుర్ముహూర్తం: ఉ.10.28-11.15, మ.3.11-3.58; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.33; సూర్యాస్తమయం: 6.19
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



700 కోట్ల డాలర్ల ఎగుమతులకు దెబ్బ

అమెరికా ప్రతీకార సుంకాల వల్ల ఏటా భారత్‌కు కలిగే నష్టం 2

మన ఐటీ సేవలు, ఫార్మా ఉత్పత్తులపై సుంకాలు విధిస్తే.. భారీగా ప్రభావం

ఆక్వా, ఆభరణాల పరిశ్రమలకూ నష్టం!

అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి భారత్ ప్రయత్నాలు

అందుకే ఆ దేశానికి పీయూష్ గోయల్

2 నుంచి భారత్‌పై ప్రతీకార సుంకాలు

దక్షిణ కొరియా, యూరప్ దేశాలపై కూడా పన్నులు విధిస్తాం

- అమెరికా కాంగ్రెస్ సమావేశంలో ట్రంప్
- ఆటో ఉత్పత్తులపై ఇండియా 100% కన్నా ఎక్కువ సుంకాలు వేస్తోందని ఆగ్రహం
- శత్రుదేశాలే కాక మిత్రదేశాలూ అమెరికాను దశాబ్దాలుగా దోచుకుంటున్నాయని ధ్వజం
- వేరే మార్గాల్లో తమ ఉత్పత్తుల్ని నియంత్రిస్తే తామూ అలాగే చేస్తామని తేల్చిచెప్పిన ట్రంప్

న్యూయార్క్/వాషింగ్టన్, మార్చి 5: భారత్ సహా పలు దేశాలపై ఏప్రిల్ 2 నుంచి పరస్పర (ప్రతీకార) సుంకాలు విధించనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆయన మంగళవారం అమెరికన్ కాంగ్రెస్ ఉభయసభల సంయుక్త సమావేశంలో ప్రసంగించారు. అందులో పలు అంశాల గురించి ప్రస్తావించిన ట్రంప్.. శత్రు దేశాలే కాక మిత్ర దేశాలు సైతం అమెరికాపై అన్యాయంగా సుంకాలు విధిస్తున్నాయంటూ మండిపడ్డారు. "పలు దేశాలు కొన్ని దశాబ్దాలుగా మనపై అత్యధిక సుంకాలు విధిస్తున్నాయి. ఇప్పుడిక మనవంతు. యూరోపియన్ దేశాలు, చైనా, బ్రెజిల్, ఇండియా, మెక్సికో, కెనడా, ఇంకా బోలెడన్ని దేశాలు మనం వారిపై

మిగతా 2వ పేజీలో...



అమెరికా కాంగ్రెస్‌లో ప్రసంగిస్తున్న ట్రంప్

ట్రంప్‌కు సెగ!

ఏ యుద్ధానికైనా మేం సిద్ధం 2

- తుది వరకు పోరాడతాం
- అమెరికా సుంకాలపై చైనా ఆగ్రహం
- కరెంటు కోతలు విధిస్తాం
- 25% సర్‌చార్జీలు కూడా..: కెనడా
- మస్క్ స్టార్‌లింక్‌తో ఒప్పందం రద్దు

బీజేపీదే గెలుపు

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కైవసం

రెండో ప్రాధాన్య ఓట్లతో గెలిచిన అంజిరెడ్డి



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన అనంతరం బీజేపీ సంబరాల్లో విజయ సంకేతం చూపుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, చిన్నమైల్ అంజిరెడ్డి

- కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌పై 5,500 ఓట్ల ఆధిక్యం
- మూడో స్థానంతో నిష్క్రమించిన ప్రసన్న హరికృష్ణ
- 54 మందిని ఎలిమినేట్ చేసినా రాని కోటా ఓటు
- ఆధిక్యంలో ఉన్న అంజిరెడ్డిని విజేతగా ప్రకటన
- రెండు స్థానాల్లో గెలుపుతో పెరిగిన కమలం పట్టు
- సిటింగ్ స్థానం చేజారడంతో కాంగ్రెస్‌కు నిరాశ
- రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగాం
- మా బాధ్యత మరింత పెరిగింది: కిషన్‌రెడ్డి

కరీంనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. ఆ పార్టీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి రెండో ప్రాధాన్య ఓట్లతో విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డిపై 5,106 ఓట్ల ఆధిక్యం పొందారు. ఇదే జిల్లాలకు చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్నీ గెలుచుకున్న బీజేపీ.. పట్టభద్రుల ఎమ్మెల్సీని కూడా దక్కించుకోవడం ద్వారా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మరోసారి పట్టు నిరూపించుకుంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఈ ఓటమితో తన సిటింగ్ స్థానాన్ని కోల్పోయింది. 56 మంది అభ్యర్థులు పోటీ చేసిన కరీంనగర్ పట్టభద్రుల స్థానంలో బీజేపీ అభ్యర్థి సి.అంజిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి

మిగతా 12వ పేజీలో...



తన నివాసానికి విచ్చేసిన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షికి సీఎం రేవంత్ స్వాగతం. చిత్రంలో భట్టి, ఉత్తమ్, మహేశ్‌గౌడ్

ఎస్సీ వర్గీకరణ..

బీసీ రిజర్వేషన్ల పెంపు!

నేడు క్యాబినెట్ భేటీలో చర్చ

- అసెంబ్లీలో బిల్లులు.. ఢిల్లీకి అఖిలపక్షం
- 42 శాతం కోటా కోసం
- రాజ్యాంగ సవరణ అవకాశాలు
- రేషన్‌కార్డులు, ఫ్యూచర్ సిటీ అథారిటీ, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపైనా చర్చ
- కొత్త మద్యం బ్రాండ్ల ధరల పెంపుపైనా!
- యాదగిరిగుట్టకు ప్రత్యేక పాలక మండలి ఏర్పాటు అంశంపైనా నిర్ణయం

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్లపై గురువారం మధ్యాహ్నం సచివాలయంలో జరగనున్న క్యాబినెట్ సమావేశంలో చర్చించనున్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలు, విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఇందుకు సంబంధించిన రెండు బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టంగా చేయాలని భావిస్తోంది. అదే విధంగా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఈ రెండు అంశాలపైనా చర్చించి, వాటిని ఆమోదించనున్నారు. అదే విధంగా బీసీ రిజర్వేషన్ల అమలు కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లడం, 42% రిజర్వేషన్ అమలు అంశాన్ని రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో చేర్చేందుకు ఉన్న అవకాశాలు, కేంద్రంతో చర్చలు మొదలైన వాటిని క్యాబినెట్ భేటీలో చర్చకు తీసుకోనున్నట్లు తెలిసింది. వీటితో పాటు కొత్త రేషన్‌కార్డులు, హెచ్ఎండీఏ తరహాలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు, భూభారతి విధివిధానాలు, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణ తదితర అంశాలపైనా

మిగతా 13వ పేజీలో...

వర్గానికో ఎమ్మెల్సీ సీటు!

- ఓసీ, బీసీ, ఎస్సీలకు ఒక్కొక్కటి..
- సీపీఐకి ఒక సీటు ఇచ్చే యోచన
- రేవంత్, మీనాక్షి, భట్టి, మహేశ్, ఉత్తమ్‌ల భేటీలో ప్రాథమిక చర్చ
- రేపు ఢిల్లీకి వెళ్లనున్న సీఎం! 12
- ఐదుగురినీ సంప్రదించి అభ్యర్థుల్ని ఖరారు చేయనున్న అధిష్ఠానం

రూ.15 వేల కోట్ల పెట్టుబడులు

3 లక్షల ఉద్యోగాలు

- రాష్ట్ర నూతన పర్యాటక విధానం 2025-30 సిద్ధం
- ఆధ్యాత్మికం, ప్రకృతి, ఆరోగ్య పర్యాటకానికి ప్రాధాన్యం
- ప్రత్యేకంగా బుద్ధిస్టు సర్క్యూట్
- 'ప్రభుత్వ- ప్రైవేటు'లో ప్రాజెక్టులు
- ఇన్వెస్టర్లకు 10-25% రాయితీ
- ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రోత్సాహక మండలి! 13

ఆధార్ ఇప్పిస్తే ఈ చిన్నారి

చదువుకుంటుంది!



చెత్తలో దొరికిన పుస్తకంలో అక్షరాలు దిద్దుతున్న శ్రీవిద్య

- జనన ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో పాఠశాలలో పేరు తొలగింపు
- ఆ పత్రం కోసం వెళితే ఆస్పత్రి నుంచి సర్టిఫికెట్ తేవాలంటున్నారు
- పాప ఇంట్లో పుట్టింది.. వివరాలేమీ లేవంటున్న తల్లిదండ్రులు 3
- హైదరాబాద్ సనత్‌నగర్‌లోని బస్తీలో నిరుపేద చదువుల తల్లికి పెద్ద కష్టం



5 రోజులు.. 4 వేల దరఖాస్తుల

ఆమోదం

- ఎల్ఆర్ఎ‌స్‌కు స్పందన అంతంతే.. నెలాఖరు దాకా రాయితీ
- 'ఆటోమేటిక్ ఫీజు' కింద పెండింగ్‌లో 19 లక్షల దరఖాస్తులు
- 111 జీవో ఫామ్‌ల్యాండ్‌కు వర్తించని క్రమబద్ధీకరణ పథకం

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం) పెండింగ్ దరఖాస్తులను వేగంగా క్లియర్ చేయటానికి ప్రభుత్వం 25 శాతం రాయితీ ఇచ్చినా.. దరఖాస్తుదారుల నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉంది. గత అయిదు రోజుల్లో నాలుగు వేల మంది దరఖాస్తుదారులు మాత్రమే నిర్ణీత ఫీజు చెల్లించి తమ దరఖాస్తులకు ఆమోదం పొందారు. అంటే రోజుకు సగటున 800 మంది. మార్చి 31వ తేదీ వరకు గడువు ఉంది. కాగా, 4 వేల దరఖాస్తుల్లో రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ఎల్ఆర్ఎస్ ఆమోదం పొందినవి 235. మిగిలినవి పంచాయతీ, మున్సిపాలిటీల ద్వారా ఆమోదం పొందాయి. రాయితీ పథకం అమల్లోకి రాకముందు 14 వేల దరఖాస్తులు ఆమోదం పొందగా.. పథకం అమలైన తర్వాత

మిగతా 3వ పేజీలో...

రిజిస్ట్రేషన్ల ఆదాయంలో

భారీ లోటు!

- గత ఏడాది ఫిబ్రవరితో పోలిస్తే 3.04% తక్కువ
- ఏకంగా 5.98 శాతం మేర తగ్గిన రిజిస్ట్రేషన్లు
- 2023-24 నాటి ఆదాయాన్ని చేరుకోవాలన్నా నెలాఖరులోగా 1,720 కోట్లు సమకూరాలి
- గత ఏడాది వచ్చిన రాబడి రూ.14,588 కోట్లు
- ఈ ఏడాది ఫిబ్రవరి దాకా వచ్చింది 12,867 కోట్లే
- 'ఎల్ఆర్ఎస్'పైనే అధికారుల ఆశలు



హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గడం రిజిస్ట్రేషన్ల శాఖపై తీవ్ర ప్రభావం చూపిందా? గత ఏడాది వచ్చిన ఆదాయమూ ఈ ఏడాది వచ్చే పరిస్థితీ కనిపించడం లేదా? అంటే అవుననే చెబుతున్నాయి గణాంకాలు. ఆదాయ లక్ష్యం సంగతి పక్కన పెడితే.. గత ఏడాది వచ్చినంత ఆదాయమూ ఈసారి వచ్చే పరిస్థితి లేకపోవడంపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ

మిగతా 13వ పేజీలో...



హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో కిక్కిరిసిన రోడ్డు

96.63% హాజరు

- ఇంటర్ ఫస్టియర్ పేపర్-1కి 17,010 మంది విద్యార్థుల గైర్హాజరు
- హైదరాబాద్‌లో ట్రాఫిక్ జామ్ కష్టాలు
- వందలాది మంది ఆలస్యంగా కేంద్రాలకు
- పలుచోట్ల పరీక్ష రాయకుండానే వెనక్కి
- నేటి నుంచి సెకండియర్ పరీక్షలు

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు రాష్ట్రవ్యాప్తంగా 1,532 కేంద్రాల్లో నిర్వహించిన ద్వితీయ భాష (పేపర్-1)పరీక్షకు 96.63 శాతం హాజరయ్యారు. మొత్తం 5,14,184 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 4,96,899 మంది

మిగతా 3వ పేజీలో...

ఆత్మహత్యాయత్నం కాదు



14

- నిద్ర పట్టక ఎక్కువ మాత్రలు వేసుకున్నా..
- పోలీసులకు చెప్పిన గాయని కల్పన
- మందుల ఓవర్ డోస్ వల్లే
- అమ్మ అపస్మారక స్థితికి: కల్పన కుమార్తె దయ



13

ఆవు పాల ధర తగ్గింపు..

గేదె పాల ధర పెంపు!

- ధరను సవరించే యోచనలో విజయ డెయిరీ
- 50కోట్ల పెండింగ్ బకాయిలు చెల్లించాకే ప్రకటన

నియోజకవర్గాల పునర్విభజనను

30 ఏళ్లు వాయిదా వేయాలి

- లేదా 1971 జనాభా ప్రాతిపదికనే చేయాలి 2
- తమిళనాడు అఖిలపక్ష భేటీ ఏకగ్రీవ తీర్మానం
- దక్షిణాది ఎంపీలతో ఉమ్మడి కార్యాచరణ కమిటీ
- పునర్విభజనతో 'దక్షిణాది'కి పెను ముప్పు: స్టాలిన్
- దేశాన్ని 'హిందియా'గా మార్చే కుట్ర: కమల్‌హాసన్

నా పెళ్లాన్ని చంపేశా సార్!

- అలిగి ఇల్లు వదిలిన భార్యను పోలీసులు కనిపెట్టాలని ఓ మందుబాబు నాటకం
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ రాణాలో హల్‌చల్
- ఆమె క్షేమం.. మందుబాబును హెచ్చరించి వదిలేసిన పోలీసులు

14

అమెరికాలో కాల్పులు..

తెలంగాణ విద్యార్థి మృతి

- 3 నెలల్లో ఎంఎస్ పూర్తి చేసుకుని రావాల్సి ఉండగా ప్రవీణ్ దుర్మరణం 14
- మృతుడిది రంగారెడ్డి జిల్లా కేశంపేట

2 నుంచి భారత్‌పై ప్రతీకార సుంకాలు

(మొదటి పేజీ తరువాయి)

విధిస్తున్న సుంకాల కన్నా మనపై ఎక్కువగా వేస్తున్నాయి. ఇది అన్యాయం. భారతదేశం మన ఆటో ఉత్పత్తులపై 100 శాతం కన్నా ఎక్కువ సుంకాలు వేస్తోంది" అని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "మన ఉత్పత్తులపై చైనా సగటు సుంకాలు.. మనం వారిపై విధిస్తున్న దానికన్నా రెట్టింపుస్థాయిలో ఉన్నాయి. దక్షిణ కొరియా సుంకాలైతే ఏకంగా నాలుగు రెట్లు అధికంగా ఉంటున్నాయి. ఒక్కసారి ఆలోచించండి.. నాలుగు రెట్లు అధికం. మనమేమో అదే దక్షిణ కొరియాకు సైనిక సాయం చేయడంతోపాటు రకరకాలుగా అండగా ఉంటున్నాం. కానీ, జరుగుతోంది ఏమిటి?.. వారు మనపై అధిక సుంకాలు విధిస్తున్నారు. మన మిత్రులు, శత్రువులు అందరూ ఇదే చేస్తున్నారు. ఈ భూమ్మీద దాదాపు ప్రతిదేశమూ దశాబ్దాలుగా అధిక సుంకాలతో మనల్ని దోచుకుతింటోంది" అని ఆగ్రహం వెలిబుచ్చారు. ఇకపై అలా జరగనివ్వబోమని తేల్చిచెప్పారు. "మీరు మీ ఉత్పత్తులను అమెరికాలో తయారుచేయకపోతే.. ట్రంప్ పాలనలో మీరు సుంకాలను, కొన్ని సందర్భాల్లో అధిక సుంకాలను చెల్లించాల్సి ఉంటుంది" అని ఆయా దేశాలను హెచ్చరించారు. "ఇతర దేశాలు మాపై ఏస్థాయిలో సుంకాలు విధిస్తే.. మేమూ అలాగే విధిస్తాం. వారు మనల్ని తమ మార్కెట్లకు దూరంగా ఉంచే ఉద్దేశంతో నాన్-మానెటరీ టారిఫ్స్ (డబ్బు రూపంలో కాకుండా.. విధానపరమైన నిర్ణయాల ద్వారా నియంత్రించడం) విధిస్తే మనం కూడా వారిని మన మార్కెట్లకు దూరంగా ఉంచడానికి అలాగే చేస్తాం" అని వ్యాఖ్యానించారు. తాను ఇదే పనిని చైనాతో, ఇతర దేశాలతో కూడా చేశానని.. ఇంతకుముందున్న బైడెన్ పాలనలో ఇలా చేయలేకపోయారని స్వీయ కితాబు ఇచ్చుకున్నారు. మెక్సికో, కెనడాల విషయానికి వస్తే.. వాణిజ్యపరంగా ఎంతో లోటు ఉందని, ఆయా దేశాలు అమెరికాకు అధికంగా ఉత్పత్తులను ఎగుమతి చేస్తూ, తాము మాత్రం తక్కువగా దిగుమతి చేసుకుంటున్నాయని విమర్శించారు. ఆ విషయాన్ని పక్కనపెడితే.. "ఆయా దేశాలు మన దేశంలోకి ఫెంటనిల్ రాకను మునుపెన్నడూ లేని విధంగా అనుమతిస్తున్నాయి. అది మన దేశానికి చెందిన యువతీయువకులను వేలు, లక్షల సంఖ్యలో చంపేస్తోంది. కుటుంబాలను ఛిద్రం చేస్తోంది. అందుకు బదులుగా ఆ రెండు దేశాలూ అమెరికా నుంచి వందల కోట్ల డాలర్లు రాయితీ రూపంలో పొందుతున్నాయి. ఇకపై అలా జరగనివ్వం" అని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజానికి తాను ఈ సుంకాల విధింపును ఏప్రిల్ 1 నుంచి అమలు చేద్దామనుకున్నప్పటికీ.. అంతా 'ఏప్రిల్ ఫూల్స్ డే' అని ఎగతాళి చేసే అవకాశం ఉంది కాబట్టి ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి తెస్తున్నానన్నారు.



గ్రీన్‌లాండ్‌ను కలిపేసుకుంటాం: ట్రంప్

అమెరికాలో కలిసిపోవాలని గ్రీన్‌లాండ్‌ను ట్రంప్ మళ్లీ కోరారు. అమెరికా కాంగ్రెస్‌ను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ట్రంప్ ఈ మేరకు పిలుపునిచ్చారు. ఆయన ప్రతిపాదనను డెన్మార్క్ వెంటనే తిరస్కరించింది. గ్రీన్‌లాండ్ అమెరికాలో కలవడం జరగదని డెన్మార్క్ రక్షణ మంత్రి ట్రూల్స్ లండ్ పౌల్సెన్ స్పష్టం చేశారు. గ్రీన్‌లాండ్ ఎలా ముందుకు వెళ్లాలనే విషయాన్ని అక్కడి ప్రజలే నిర్ణయిస్తారని తెలిపారు. గ్రీన్‌లాండ్‌లో సాధారణ ఎన్నికలు జరగడానికి వారం రోజుల ముందు.. ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తక్కువ జనాభా ఉన్న, భారీగా ఖనిజ సంపద ఉన్న గ్రీన్‌లాండ్ ద్వీపంలోని అత్యద్భుత ప్రజలకు ఒక సందేశం ఇస్తున్నానన్న ట్రంప్.. "మీ భవిష్యత్తును మీరే నిర్ణయించుకొనే హక్కుకు మేం మద్దతిస్తాం. మీరు యూఎస్‌ఏలో కలవాలనుకుంటే సాదరంగా ఆహ్వానిస్తున్నాం" అని పేర్కొన్నారు.

ఏటా 700 కోట్ల డాలర్ల ఎగుమతులకు దెబ్బ

ఐటీ సేవలు, ఫార్మాపై సుంకాలు విధిస్తే భారీగా ప్రభావం

(ఆంధ్రజ్యోతి - బిజినెస్ డెస్క్)

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రారంభించిన సుంకాల యుద్ధంతో ప్రపంచ దేశాలు బెంబేలెత్తి పోతున్నాయి. చైనా, మెక్సికో, కెనడా దేశాలపైన విధించిన సుంకాలు మంగళవారం నుంచే అమల్లోకి వచ్చాయి. ఏప్రిల్ 2 నుంచి భారత్ సహా ఇతర దేశాలపై ప్రతీకార సుంకాలు తప్పవని ట్రంప్ తాజాగా హెచ్చరించారు. దానివల్ల మనకు ఏటా 700 కోట్ల డాలర్ల మేర (దాదాపు రూ.61 వేల కోట్లు) నష్టం తప్పదని అంచనా! ఈ నేపథ్యంలోనే.. అమెరికాతో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందానికి (ఎఫ్‌టీఏ) మోదీ సర్కారు సిద్ధమవుతోంది. కెనడా, మెక్సికో వంటి దేశాలు పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శించినా అమెరికాతో ఒప్పందాలకు సిద్ధపడుతున్నాయి. ఆయా దేశాల అధికారులు తమతో చర్చలు జరుపుతున్నట్టు అమెరికా అధికారికంగానే వెల్లడించింది!

అధిక సుంకాల ప్రస్తావన తెచ్చినప్పుడల్లా ట్రంప్ ముఖ్యంగా ప్రస్తావించే పేరు భారత్‌దే. 'ఇండియా 'ఆటో' టారిఫ్‌లు 100 శాతానికి మించి ఉన్నాయ'ంటూ ట్రంప్ తాజాగా కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై అలా కుదరదని.. కంటికి కన్ను, పంటికి పన్ను తరహాలో పరస్పర సుంకాలు తప్పవన్నది ట్రంప్ ప్రతిన. అయితే.. ప్రతీకార/పరస్పర సుంకాలు అనగానే 'ఆటో మొబైల్' రంగంలో మనం విధిస్తున్నట్టే 100 శాతం సుంకాలు విధిస్తారని చెప్పలేం. ఎందుకంటే.. మన దేశం నుంచి అమెరికా నుంచి దిగుమతి చేసుకునే లగ్జరీ కార్లు, బైకులతో పోలిస్తే ఇక్కడి నుంచి అక్కడికి అయ్యే ఎగుమతుల విలువ చాలా తక్కువ. కాబట్టి ఆటో ఉత్పత్తులపై అధిక సుంకాలు విధించడం వల్ల అమెరికాకు ఏమీ లాభం ఉండదు. అందువల్ల అమెరికా ఆ మార్గం ఎంచుకోదని.. ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాటికి బదులుగా మన దేశం నుంచి తాను ఎక్కువగా దిగుమతి చేసుకునే ఫార్మా ఉత్పత్తులు, ఐటీ సేవల వంటివాటిపై దృష్టి సారించి, వాటిపై అత్యధిక సుంకాలు విధిస్తే మాత్రం మనదేశంలో ఆ రంగాల పరిశ్రమలపై పెను ప్రభావం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వీటిపై ఎక్కువ ప్రభావం..

ట్రంప్ రాగానే అమెరికాకు దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియంపై 25% సుంకం విధించారు. దీంతో మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతయ్యే ఈ రెండు ఉత్పత్తుల ఎగుమతులూ 5-10% మేర దెబ్బతినబోతున్నాయి. ఏప్రిల్ 2 నుంచి కొత్తగా అమల్లోకి వచ్చే సుంకాలతో ఇంజనీరింగ్, ఫార్మా, ఫోన్లు, ఆభరణాలు, రొయ్యల ఎగుమతులు దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. అందుకే.. వీలైనంత త్వరగా పరిమిత స్థాయిలోనైనా అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదుర్చుకునేందుకు మోదీ సర్కార్ తొందర పడుతోంది. అందులో భాగంగానే కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్ని పనులూ వాయిదా వేసుకుని మరీ అమెరికాకు వెళ్లి ఆ దేశ అధికారులతో చర్చలు జరుపుతున్నారు. ఈ ఒప్పందం సాకారమైతే మన దేశం నుంచి అమెరికాకు, అమెరికా నుంచి మన దేశానికి దిగుమతయ్యే వస్తువులపై దాదాపుగా సుంకాలు ఉండవు. ఒకవేళ ఉన్నా అవి కనిష్ఠ స్థాయిలోనే ఉంటాయి.

ట్రంప్‌కు తప్పుడు సమాచారం..

అమెరికా నుంచి మన మొత్తం దిగుమతుల విలువలో 75 శాతంపై.. మన దేశం విధించే దిగుమతి సుంకం సగటున 5 శాతం మించదు. లగ్జరీ కార్లు, హైఎండ్ బైకులు, బోర్బన్ విస్కీ వంటి విలాస వస్తువులపై మాత్రమే మనం అత్యధిక సుంకాలు విధిస్తున్నాం. భారత్ ఆటో టారిఫ్‌లు 100 శాతానికి పైగా ఉన్నాయని ట్రంప్ చెప్పారుగానీ.. ప్రస్తుతం భారత్ అత్యధికంగా విధిస్తున్న ఆటో టారిఫ్ 70%. దిగుమతి చేసుకునే విలాసవంతమైన కార్లపై 125 శాతంగా ఉన్న సుంకాన్ని 70 శాతానికి భారత్ తగ్గించింది. హై-ఎండ్ మోటార్‌సైకిళ్లపై సుంకాన్ని 50% నుంచి 40శాతానికి కుదించింది.

ఫార్మా, ఆక్వా, ఆభరణ పరిశ్రమలకు..

అమెరికా మన పాడి ఉత్పత్తులు, యాపిల్స్, బాదంపై ఉన్న 50 శాతం దిగుమతి సుంకాన్ని తగ్గించాలని కోరుతోంది. ట్రంప్ ప్రతీకార సుంకాలకు భయపడి దీన్ని తగ్గిస్తే.. మన వ్యవసాయ రంగం మరింత కుదేలయ్యే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే.. ఏప్రిల్ 2 నుంచి ఆభరణాలపైనా 5 నుంచి 20% సుంకాల భారం పడే ముప్పుంది. అదే జరిగితే ఈ పరిశ్రమపై ఆధారపడిన లక్ష నుంచి లక్షన్నర మంది రోడ్డున పడే ప్రమాదం ఉందని జెమ్స్ అండ్ జువెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇక.. అమెరికా నుంచి వచ్చే ఫార్మా ఉత్పత్తులపై భారత్ 10% దాకా సుంకం విధిస్తుండగా.. అమెరికా ఏమీ విధించట్లేదు. వీటిని తనలాగే జీరో స్థాయికి తగ్గించి, మరింత పక్కాగా పేటెంట్ హక్కులు కాపాడాలని ట్రంప్ సర్కారు కోరుతోంది. లేకపోతే భారత ఫార్మా ఎగుమతులపైనా పరస్పర సుంకాలు తప్పవని హెచ్చరిస్తోంది. దీంతో ఫార్మా కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. ఇక.. మన రొయ్యల ఎగుమతులకు అమెరికానే ప్రధాన మార్కెట్. జీరో సుంకంతో అమెరికా ఈ దిగుమతులను అనుమతిస్తోంది. మన దేశం మాత్రం అన్ని మత్స్య దిగుమతులపై 30% సుంకం విధిస్తోంది. ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాల వల్ల 'మేకిన్ ఇండియా' కార్యక్రమమూ ప్రమాదంలో పడింది. మన దేశంలో తయారయ్యే యాపిల్ ఐఫోన్లు, ఇతర వినియోగ ఎలక్ట్రానిక్ పరికరాలను అమెరికా ప్రస్తుతం జీరో డ్యూటీతో అనుమతిస్తోంది. మనం మాత్రం 20% వరకూ సుంకాలు విధిస్తున్నాం. ఇప్పుడు పరస్పర సుంకాల భయంతో యాపిల్ కంపెనీ మేకిన్ ఇండియాపై పునరాలోచనలో పడినట్టు సమాచారం. భారత్‌లో తన విస్తరణను పక్కన పెట్టి, 10% కంటే తక్కువ సుంకాలున్న దేశాలపై దృష్టి పెట్టే దిశగా యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం అమెరికాతో ఎఫ్‌టీఏ కుదుర్చుకోవడమేనని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

2023 గణాంకాల ప్రకారం.. దిగుమతులపై భారత్ విధిస్తున్న సుంకాలు (శాతాల్లో)..

ఉత్పత్తులు/వస్తువులు	సుంకం
పొగాకు, బేవరేజెస్	74.5
ఆయిల్ సీడ్స్, నూనెలు	60.1
చక్కెర, కన్ఫెక్షనరీ	51.5
కాఫీ, టీ	47.6
తృణధాన్యాలు, వాటి ఉత్పత్తులు	37.8
పాల ఉత్పత్తులు	35.2
పండ్లు, కూరగాయలు, మొక్కలు	34.6
జంతు ఉత్పత్తులు	32.5
చేపలు, చేపల ఉత్పత్తులు	30.0
రవాణా పరికరాలు	28.2
వస్త్రాలు	20.7
జౌళి ఉత్పత్తులు	16.0
తోలు, పాదరక్షలు	15.1
ఖనిజాలు, లోహాలు	11.9
ఎలక్ట్రిక్ యంత్రాలు	11.2
కాగితం, కలప	10.6
రసాయనాలు	10.3
పెట్రో ఉత్పత్తులు	9.2

మన ఫార్మా సుంకాలను తగ్గించక్కర్లేదు

ఫార్మా ఉత్పత్తులపై మనం 10% సుంకం విధిస్తుంటే, అమెరికా జీరో డ్యూటీతో అనుమతిస్తోంది. అయితే, ట్రంప్‌కు బెదిరి ఇప్పుడు మనం సుంకాలను తగ్గించాల్సిన పని లేదు. ఎందుకంటే ఏ దేశమూ అమెరికాకు మన కంటే చౌకగా, నాణ్యమైన జనరిక్ ఔషధాలు సరఫరా చేయలేదు. ఒకవేళ అమెరికానే వీటిని తయారు చేసుకోవాలనుకున్నా 30% అధికంగా ఖర్చవుతుంది. కాబట్టి ట్రంప్ హెచ్చరికలను పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు.

-ఆర్.ఉదయ్‌భాస్కర్, మాజీ డైరెక్టర్ జనరల్, ఫార్మాగ్జిల్

అమెరికాకే నష్టం

మన ఫార్మా ఎగుమతులపై సుంకాలతో అమెరికాకే నష్టం. ఇప్పటికే అక్కడ ఔషధాలు, వైద్య ఖర్చులు పెరిగిపోయాయి. అదనపు సుంకాలతో మరింత పెరుగుతాయి.

-ఏవీపీ చక్రవర్తి, ఛైర్మన్, ఫెడరేషన్ ఆఫ్ ఫార్మా ఆంత్రప్రెనర్స్ (ఏపీ అండ్ తెలంగాణ)

లోకం తీరు



ఉక్రెయిన్‌తో శాంతికి రష్యా సిద్ధం!

అమెరికా కాంగ్రెస్‌లో ట్రంప్ వెల్లడి

న్యూయార్క్, మార్చి 5: ఉక్రెయిన్‌తో శాంతియుత సంబంధాలను నెలకొల్పుకోవటానికి సిద్ధంగా ఉన్నట్లు రష్యా నుంచి బలమైన సంకేతాలు తనకు అందాయని ట్రంప్ తెలిపారు. ఉక్రెయిన్ కూడా చర్చలకు సిద్ధమని ప్రకటించిందని, ఈ మేరకు ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ తనకు లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేశారు. మంగళవారం రాత్రి అమెరికా చట్టసభల (కాంగ్రెస్) సంయుక్త సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. రెండోసారి అధ్యక్షుడైన తర్వాత కాంగ్రెస్‌లో ఇదే ఆయన తొలి ప్రసంగం. మూడేళ్లుగా జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో వారానికి సగటున 2 వేల మందికిపైగా మరణిస్తున్నారని ట్రంప్ చెప్పారు. 'ఈ యుద్ధంలో అమెరికన్లేమీ చనిపోవటం లేదు.. కానీ, నేను ఆపాలనుకుంటున్నా. ఈ ఉన్మాదాన్ని, ఆ హత్యాకాండను ఆపాలనుకుంటున్నా' అని తెలిపారు. యుద్ధంలో ఉక్రెయిన్‌కు మద్దతిస్తున్నామని చెబుతున్న యూరప్ దేశాల గురించి ప్రస్తావిస్తూ.. ఉక్రెయిన్ రక్షణకు ఖర్చు చేసిన దానికన్నా, రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేయటానికి యూరప్ దేశాలు ఎక్కువ ఖర్చు చేశాయని ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు, 2021లో కాబూల్‌లో ఆత్మాహుతి దాడి జరిపి 13 మంది అమెరికన్ సైనికులను చంపిన ఘటనకు బాధ్యుడైన ఉగ్రవాది షరీఫుల్లాను పట్టుకున్నామని, అఫ్ఘానిస్థాన్ నుంచి అమెరికాకు తరలిస్తున్నామని ట్రంప్ వెల్లడించారు. కాగా, రష్యాతో వీలైనంత త్వరగా శాంతి చర్చలు జరిపేందుకు జెలెన్‌స్కీ సంసిద్ధత వ్యక్తం చేయడం సానుకూల పరిణామమని రష్యా అధ్యక్ష భవనం పేర్కొంది. అయితే, రష్యాతో చర్చలను నిరోధిస్తూ 2022లో ఉక్రెయిన్ జారీ చేసిన ఉత్తర్వుల సంగతేంటని ప్రశ్నించింది.

45 రోజుల్లో రూ.30 కోట్లు

» కుంభమేళాలో 130 పడవలు నడిపిన ఓ కుటుంబ ఆదాయం



న్యూఢిల్లీ, మార్చి 5: యావత్తు దేశాన్ని 45 రోజుల పాటు భక్తి పారవశ్యంతో ఊపేసిన మహా కుంభమేళా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంపై కాసుల వర్షం కురిపించింది. మరీ ముఖ్యంగా కుంభమేళాలో పడవలు నడిపిన ఓ కుటుంబంపై ఏకంగా రూ.30 కోట్లు కుమ్మరించింది. యూపీ అసెంబ్లీ వేదికగా ఆ రాష్ట్ర సీఎం యోగి ఈ మేరకు ప్రకటన చేశారు. రూ.7,500 కోట్ల పెట్టుబడితో నిర్వహించిన మహా కుంభమేళా వల్ల రూ.3లక్షల కోట్ల విలువైన వ్యాపారం జరిగిందని పేర్కొన్నారు. మరీ ముఖ్యంగా 130 పడవలు కలిగిన ఓ కుటుంబం 45 రోజుల్లో రూ.30 కోట్లు సంపాదించిందని ప్రకటించారు. రోజుకు రూ.50,000 నుంచి రూ.52,000 చొప్పున 130 పడవల ద్వారా ఆ కుటుంబం రూ.30 కోట్లు సంపాదించిందని వివరించారు. కుంభమేళా వల్ల హోటల్స్ రంగంలో రూ.40వేల కోట్లు, ఆహారం, నిత్యావసరాల రంగంలో రూ.33వేల కోట్లు, రవాణా రంగంలో రూ.1.5 లక్షల కోట్ల వ్యాపారం జరిగిందని సీఎం యోగి తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా రూ.20వేల కోట్లు, విరాళాల రూపంలో రూ.660 కోట్లు, టోల్ ప్లాజాల ద్వారా రూ.300 కోట్లు, ఇతర మార్గాల ద్వారా రూ.66వేల కోట్ల ఆదాయం సమకూరిందన్నారు.

రాహుల్‌గాంధీకి రూ.200 జరిమానా

న్యూఢిల్లీ, మార్చి 5: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూ కోర్టు రూ.200 జరిమానా విధించింది. సావర్కర్‌పై గతంలో చేసిన అనుచిత వ్యాఖ్యల కేసులో విచారణకు రాహుల్ గైర్హాజరు కావడంతో న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. విచారణను ఏప్రిల్ 14కు వాయిదా వేస్తూ ఆ రోజు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించింది. 2022లో మహారాష్ట్రలో ఓ సమావేశంలో వీర సావర్కర్‌పై రాహుల్ చేసిన వ్యాఖ్యలపై నృపేంద్ర అనే వ్యక్తి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం విచారణ జరగగా.. రాహుల్ గైర్హాజరయ్యారు.

పరీక్ష తప్పిన రాజీవ్ ప్రధాని ఎలా అయ్యారో?!

» కాంగ్రెస్ వృద్ధ నేత మణిశంకర్ అయ్యర్ వ్యాఖ్య

న్యూఢిల్లీ, మార్చి 5: ఓ సాధారణ పైలెట్.. అంతేగాక రెండుసార్లు పరీక్షలు తప్పిన వ్యక్తి దేశానికి ప్రధాని ఎలా అయ్యారా... అని తాను అనుకొనేవాడినని దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీని ఉద్దేశించి కాంగ్రెస్ వృద్ధ నేత మణిశంకర్ అయ్యర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో రాజీవ్‌తో కలిసి తాను చదువుకున్నానని, అక్కడ ఆయన పరీక్ష తప్పారని పేర్కొన్నారు. తమ విద్యార్థులు ఎవరూ పరీక్ష తప్పకుండా ఆ విశ్వవిద్యాలయం సూచనలు ఇస్తుందని వివరించారు. అయినా రాజీవ్ తప్పారని వెల్లడించారు. తర్వాత ఆయన లండన్‌లోని ఇంపీరియల్ కళాశాలలో చదువుకొనేందుకు వెళ్లారని, అక్కడా పరీక్ష తప్పారని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి దేశానికి ప్రధాని అయ్యే అవకాశం లేదని అప్పుడు తాను భావించానని వివరించారు.

ఒకే కులంలో పెళ్లిళ్లతో జన్యు వ్యాధులు

న్యూఢిల్లీ, మార్చి 5: మేనరికం పెళ్లిళ్ల వల్ల పిల్లలకు జన్యుపరమైన వ్యాధులు వస్తాయని తెలిసిందే. అయితే మన కులపోళ్లు, దగ్గరి బంధువులు, చుట్టాలు అని పెళ్లిళ్లు చేయడం వల్ల కూడా పుట్టే పిల్లల్లో జన్యు సంబంధ వ్యాధులు వస్తాయని ఓ అధ్యయనంలో తేలింది. అందుకే కొన్ని కులాల్లో కొన్ని వ్యాధులు వారసత్వంగా వస్తున్నాయని ఈ అధ్యయనం గుర్తించింది. దక్షిణాది రాష్ట్రాల్లో దాదాపు 60% పెళ్లిళ్లు బంధువులతోనే జరుగుతున్నాయని, దాంతో పిల్లలకు జన్యుపరమైన వ్యాధులు సంక్రమిస్తున్నాయని అందులో వెల్లడైంది. అధ్యయనంలో భాగంగా హైదరాబాద్‌లోని సీసీఎంబీ శాస్త్రవేత్తలు.. ఆంధ్రప్రదేశ్‌లో కళింగ, రెడ్డి, పాండిచ్చేరిలో యాదవ్, తమిళనాడులో కల్లార్ సామాజిక వర్గాలకు చెందిన 281 మంది రక్త నమూనాలు సేకరించి జన్యుక్రమాలను పరిశీలించారు.

ఈ నెలాఖర్లో భూమ్మీదకు సునీతా విలియమ్స్



న్యూఢిల్లీ, మార్చి 5: తొమ్మిది నెలలుగా అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్ ఎట్టకేలకు 10నెలల తర్వాత భూవికి తిరిగిరానున్నారు. నాసా వర్గాల సమాచారం ప్రకారం సునీత, విల్మోర్ స్థానంలో అంతరిక్ష కేంద్రంలో పరిశోధనలు చేసేందుకు మరో ఇద్దరు వ్యోమగాములు వచ్చే వారమే అంతరిక్ష కేంద్రానికి బయలుదేరనున్నారు. ఆ వ్యోమగాములు వెళ్లాక, అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ నెలాఖరులో సునీత విల్మోర్ అంతరిక్ష కేంద్రం నుంచి బయలుదేరి భూమి మీదకు చేరుకుంటారు. మంగళవారం ఐఎస్ఎస్ నుంచి సునీత, విల్మోర్ మీడియాతో మాట్లాడారు. ఈ ప్రదేశం (అంతరిక్ష కేంద్రం) నిజంగా అద్భుతం అని, అత్యున్నత శిఖరమ్మీద ఉన్న భావన కలుగుతోందని సునీతా విలియమ్స్ పేర్కొన్నారు. అయితే తాము ఎప్పుడు తిరిగి వస్తామనే విషయంలో భూమ్మీదున్నవారికి కచ్చితమైన సమాచారం లేకపోవడం, ఫలితంగా నెలకొన్న తీవ్ర అనిశ్చితి బహుశా అత్యంత కఠినమైన అంశం అని విలియమ్స్ పేర్కొన్నారు. త్వరలోనే భూమ్మీదకు తిరిగి రానున్న నేపథ్యంలో తన పెంపుడు కుక్కలను మళ్లీ చూడబోతున్నానే విషయం తనను ఉద్విగ్నతకు గురిచేస్తోందని చెప్పారు. కాగా ప్రస్తుత ప్రణాళిక ప్రకారం 2030 వరకు కాకుండా వెంటనే అంతరిక్ష కేంద్రాన్ని మూసివేయాలంటూ ఎలాన్ మస్క్ చేసిన ప్రతిపాదనపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పేస్ స్టేషన్‌ను మూసేయాలని చెప్పడానికి ఇది సరైన సమయం కాదని ఆమె పేర్కొన్నారు.

ట్రంప్‌కు సెగ!

కెనడా, చైనా 'సుంకాల' ఫైర్



ఒంటారియో/బీజింగ్, మార్చి 5: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు పలు దేశాల నుంచి భారీ సెగ తగులుతోంది. సుంకాల విధింపులో ఆయన అనుసరిస్తున్న వైఖరిపై పలు దేశాలు నిప్పులు చెరుగుతున్నాయి. కెనడాలోని అత్యధిక జనాభా ఉన్న ఒంటారియో ప్రావిన్స్ ప్రధాని డగ్ ఫోర్డ్ అమెరికాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దిగుమతులపై 25% సుంకాలు విధించడం ద్వారా కెనడాను బలహీన పరిచేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను తాము బలంగా నిలువరిస్తామని పేర్కొన్నారు. తమవైపు నుంచి కూడా.. అంతేస్థాయిలో ప్రతిఘటన ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. విద్యుత్ కోతలు విధిస్తామని తెలిపారు. "అమెరికన్ల పట్ల విచారంగా ఉంది. ఒంటారియో నుంచి న్యూయార్క్, మిషిగన్, మిన్నెసోటా ప్రాంతాల్లోని 1.5 మిలియన్ల ఇళ్లకు విద్యుత్ సరఫరా అవుతోంది. దీనికి కోతలు విధించనున్నాం.అమెరికా ప్రజలను హృదయ పూర్వక క్షమాపణలు కోరుతున్నా. ఇది మీ అధ్యక్షుడు సృష్టించిన సమస్యే" అని వ్యాఖ్యానించారు. "ఒంటారియోను వారు నాశనం చేయాలని భావిస్తే.. మేం కూడా చేయాల్సింది చేస్తాం. వారికి కూడా నొప్పి తెలియాలి. మనపై వారు కఠినంగా వ్యవహరిస్తే.. దానికి రెండింతలు మనం కఠినంగా వ్యవహరిస్తాం" అని ఫోర్డ్ తేల్చి చెప్పారు. అదేవిధంగా టెస్లా అధినేత ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్‌తో ఉన్న 100 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్టు ప్రకటించారు. అంతేకాదు, సుంకాల యుద్ధం ప్రారంభిస్తే తమదే విజయమని ఫోర్డ్ పునరుద్ఘాటించారు. అయితే.. విద్యుత్ కోతల ప్రకటనపై కొంత సందిగ్ధం ఏర్పడింది. ఫోర్డ్ చెప్పినట్టు కేవలం ఒంటారియో నుంచి మాత్రమే అమెరికాకు కోతలు ఉంటాయా? లేక పూర్తిగా కెనడా నుంచి కూడా కోతలు ఉంటాయా? అనే విషయం స్పష్టత రాలేదు. కాగా, ట్రంప్ విధించిన సుంకాలపై కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో స్పందిస్తూ.. తాము కూడా అమెరికా దిగుమతులపై 25% సుంకాలు విధిస్తామన్నారు. అయితే.. ఇది 20.7 బిలియన్ డాలర్లకే పరిమితం చేస్తామన్నారు. మరో 21 రోజుల తర్వాత కూడా ట్రంప్‌తీరులో మార్పు రాకుంటే.. 125 బిలియన్ కెనడియన్ డాలర్ల వాణిజ్యంపైనా సుంకాలు పెంచుతామన్నారు.

ఏ తరహా యుద్ధం కావాలన్నా రెడీ: చైనా

అమెరికా ఏ తరహా యుద్ధం కావాలన్నా తాము సిద్ధమేనని, తుది వరకు పోరాడతామని చైనా తేల్చి చెప్పింది. ఈ మేరకు అమెరికాలోని చైనా రాయబార కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. "మీకు యుద్ధమే కావాలంటే మేం సిద్ధం. అది సుంకాల యుద్ధమైనా, వాణిజ్య యుద్ధమైనా.. ఏ తరహా యుద్ధమైనా మేం సిద్ధం. తుదివరకు పోరాడతాం" అని ఉభయ సభల సంయుక్త సమావేశంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ చైనా దౌత్యకార్యాలయం స్పష్టం చేసింది.

ఇద్దరు ప్రియురాళ్లతో కలిసి మాజీ ప్రియురాలి హత్య

» 'గాలి ఇంజెక్షన్' ఇచ్చి చంపిన నిందితుడు

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఓ యువతిని ఆమె మాజీ ప్రియుడు తన ఇద్దరు ప్రియురాళ్లతో కలిసి హత్య చేశాడు. వారు ఆమె రక్తనాళాల్లోకి ఖాళీ సిరంజీతో గాలిని ఇంజెక్ట్ చేసి చంపేశారు. మృతదేహాన్ని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఏర్కాడులో 20 అడుగుల లోతున్న లోయలో పడేశారు. ఈ కేసులో ముగ్గురినీ పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడులోని తిరుచ్చికి చెందిన అల్ఫియా, పెరంబూరు జిల్లా అరుణాచల గౌండర్ నగర్‌కు చెందిన హఫీజ్(32) 2023 నుంచి ప్రేమించుకున్నారు. మరోవైపు, హఫీజ్ చెన్నైలోని ఒక ఐటీ కంపెనీలో పనిచేసే కావ్య సుల్తానా (22) అనే యువతితోనూ సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ విషయం తెలిసిన అల్ఫియా.. హఫీజ్‌ను నిలదీసింది. తనను కాకుండా మరొకరిని పెళ్లి చేసుకుంటే అతడి కుటుంబాన్ని అంతం చేస్తానని హెచ్చరించింది. దీంతో హఫీజ్ తన ప్రియురాలు కావ్యతో కలిసి అల్ఫియాను హత్య చేయాలని ప్లాన్ చేశాడు. ఒకవైపు కావ్యతో ప్రేమాయణం కొనసాగిస్తూనే, హఫీజ్ మోనీషా అనే మరో యువతినీ ప్రేమించాడు. ఈమెకు కూడా తన తొలి ప్రియురాలి కథ చెప్పి, ఆమెను హత్య చేసేలా పురిగొల్పాడు. ముందస్తు ప్లాన్ ప్రకారం ఈ ముగ్గురూ కలిసి ఇటీవల సేలంకు వచ్చి, అద్దె కారులో అల్ఫియాను తీసుకుని ఏర్కాడుకు వెళ్లారు. అక్కడ 60 అడుగుల వంతెన వద్ద హఫీజ్ వాహనాన్ని ఆపాడు. ఆ తర్వాత కావ్య, హఫీజ్‌లు సుల్తానాను గట్టిగా పట్టుకోగా, మోనిషా ఖాళీ సిరంజీలతో పదేపదే సుల్తానా రక్తనాళాల్లోకి గాలిని ఎక్కించడంతో రక్తప్రసరణ ఆగిపోయి ప్రాణాలు విడిచింది. ఆ తర్వాత మృతదేహాన్ని ఓ లోయలోకి విసిరేసి ఏమీ తెలియనట్లు వెళ్లిపోయారు.

నియోజకవర్గాల పునర్విభజనను

30 ఏళ్లు వాయిదా వేయాలి

» లేదా 1971 జనాభా ప్రాతిపదికనే చేయాలి

» తమిళనాడు అఖిలపక్ష సమావేశం ఏకగ్రీవ తీర్మానం

» దేశాన్ని 'హిందియా'గా మార్చే కుట్ర: కమల్‌హాసన్



చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను మరో 30 ఏళ్ల వరకూ వాయిదా వేయాలని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని కోరుతూ తమిళనాడు సీఎం స్టాలిన్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. చెన్నైలోని సచివాలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన ఈ సమావేశానికి బీజేపీ, తమిళ మానిల కాంగ్రెస్, నామ్ తమిళర్‌కట్చి, అమ్మామక్కల్ మున్నేట్ర కళగం తప్ప ఎన్నికల సంఘం గుర్తింపు కలిగిన 56 రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఫెడరల్ రాజ్యాంగ విధానానికి, తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్య హక్కులకు పెను ముప్పు కలిగించేలా నియోజకవర్గాల పునర్విభజన జరపాలని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఈ అఖిలపక్ష సమావేశం ముక్తకంఠంతో తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్టాలిన్ ప్రకటించారు. కుటుంబ నియంత్రణ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాల ప్రాతినిధ్య హక్కులను హరించేలా పునర్విభజన ఉండకూడదన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఏ రకమైన ఆందోళనలు, ఉద్యమాలు నిర్వహించాలన్న విషయమై నిర్ణయం తీసుకునేందుకు, ఈ సమస్యపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసేందుకు దక్షిణాది రాష్ట్రాల ఎంపీలతో ఒక ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయాలని సమావేశం తీర్మానించింది. అన్ని రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను ప్రోత్సహించేందుకు వీలుగా 1971 నాటి జనాభా లెక్కల ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని 2000లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి హామీ ఇచ్చినట్టుగానే, ప్రస్తుత ప్రధాని మోదీ కూడా 2026 నుంచి మరో 30 ఏళ్ల దాకా 1971 జనాభా ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని పార్లమెంటులో హామీ ఇవ్వాలని సమావేశం డిమాండ్ చేసింది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాష్ట్రాలకు పెను ముప్పు కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. తమిళనాడు ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే, సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' పార్టీలు ఈ తీర్మానానికి గట్టి మద్దతు ఇవ్వడం విశేషం. కాగా, 'మక్కల్ నీది మయ్యం' పార్టీ అధినేత, సినీ నటుడు కమల్ హాసన్ మాట్లాడుతూ ఇండియాను 'హిందియా'గా మార్చేందుకు బీజేపీ కుట్రపన్నుతోందని ఆరోపించారు.

14.2 కిలోల బంగారం నడుముకు కట్టుకుని స్మగ్లింగ్

» బెంగళూరులో కన్నడ నటి రన్యా అరెస్టు



బెంగళూరు, మార్చి 5: రన్యా రావు.. ప్రముఖ కన్నడ నటి. అంతేకాదు.. పోలీసు ఉన్నతాధికారి కుమార్తె. ఏడాది కాలంలో 30 సార్లకు పైగా గల్ఫ్ దేశాలకు వెళ్లి వచ్చారు. బెంగళూరు కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో దిగినప్పుడల్లా ఓ ప్రొటోకాల్ అధికారి ఆమెకు ఎస్కార్ట్ కల్పించి సెక్యూరిటీ చెక్‌లు లేకుండా బయటకు తీసుకొచ్చేవారు. అక్కడి నుంచి ప్రభుత్వ వాహనంలో దర్జాగా వెళ్లిపోయే వారు. సోమవారం రాత్రి కూడా రన్యా రావు అలాగే ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వచ్చే క్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) బృందం అడ్డుకుంది. సోదాలు చేస్తే.. ఆమె నడుముకు కట్టుకొని అక్రమంగా తరలిస్తున్న 14.2 కిలోల బంగారం దొరికింది. దీని విలువ రూ. 12.56 కోట్లుగా అంచనా వేశారు. ఆ తర్వాత బెంగళూరులోని లావెల్లె రోడ్‌లో ఉన్న రన్యా రావు ఇంటిలో కూడా అధికారులు సోదాలు జరిపారు. అక్కడ రూ. 2.06 కోట్ల విలువైన స్వర్ణ ఆభరణాలు, రూ. 2.67 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. రన్యా రావును అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా.. జడ్జి 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. రన్యా రావు గత 15 రోజుల్లోనే నాలుగుసార్లు తిరిగారు. ఈ నాలుగు సార్లు కూడా ఆమె ఒకే రకమైన వస్త్రధారణలో ఉన్నట్లు డీఆర్ఐ అధికారులు గుర్తించి నిఘా పెట్టారు. సోమవారం దుబాయ్ నుంచి బెంగళూరుకు వచ్చిన ఆమె ఎప్పటిలాగే సులువుగా బయటకు వచ్చేస్తున్నప్పుడు సోదాలు చేశారు. స్మగ్లింగ్‌కు అనుకూలంగా మార్పులు చేసిన జాకెట్, బెల్ట్ ఆమె ధరించి వాటిల్లో బంగారం కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. అయితే, స్మగ్లర్లు తనను బ్లాక్ మెయిల్ చేసి, బంగారం స్మగ్లింగ్ చేయిస్తున్నారని రన్యారావు విచారణలో చెప్పినట్లు సమాచారం.

నాగబాబుకు ఎమ్మెల్సీ

» ఎమ్మెల్యే కోటా అభ్యర్థిగా ఖరారు

» పవన్ కల్యాణ్ ప్రకటన



అమరావతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ సోదరుడు కొణిదెల నాగబాబు పదవి విషయంలో ఆ పార్టీ స్పష్టత ఇచ్చింది. పవన్ స్వయంగా రంగంలోకి దిగి.. శాసనసభ్యుల కోటాలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి భాగస్వామి జనసేన అభ్యర్థిగా నాగబాబు పేరును ఖరారు చేసినట్లు ప్రకటించారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆయన సేవలందిస్తున్నారని చెప్పారు. ఈ మేరకు జనసేన కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయాలని నాగబాబుకు పార్టీ కార్యాలయం నుంచి సమాచారం ఇచ్చారు. త్వరలోనే నాగబాబు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆయనకు కేబినెట్‌లో చోటివ్వనున్నట్లు సీఎం చంద్రబాబు గతంలోనే ప్రకటించారు. ఎమ్మెల్సీ పదవి ఇచ్చాక మంత్రి పదవి కట్టబెడతారని జనసేన వర్గాలు అప్పట్లో తెలిపాయి. ఆ దిశగానే నాగబాబు ఎమ్మెల్సీ కానున్నారని తాజాగా పేర్కొన్నాయి. కాగా.. ఆయన్ను రాజ్యసభకు పంపిస్తారా.. ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిని చేస్తారా.. అన్న అంశంపై మూడు రోజులపాటు పెద్దఎత్తున చర్చ జరిగింది. పైగా సోమవారం పవన్ కల్యాణ్ అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రత్యేకంగా భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశం అనంతరం నాగబాబును రాజ్యసభకు పంపాలని నిర్ణయించారన్న ప్రచారం జోరందుకుంది. ఆ ప్రచారాన్ని తోసిపుచ్చుతూ.. ఆయన్ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు పవన్ వెల్లడించారు.


ఎడమను ఎండబెట్టి.. కుడి కాల్వతో నీళ్లా?

నాగార్జునసాగర్ నుంచి ఏపీకి నీటి తరలింపుపై హరీశ్‌రావు అభ్యంతరం

» తెలంగాణ, ఏపీ తనకు రెండు కళ్లు అన్న చంద్రబాబు వ్యాఖ్యలపై సీరియస్

» తెలంగాణపై అంత ప్రేమ ఉంటే ఇక్కడి ప్రాజెక్టులపై అభ్యంతరం లేదంటూ కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్

సిద్దిపేట టౌన్/హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబు ఒక్క కాళేశ్వరాన్ని మాత్రమే వ్యతిరేకించలేదని, గతంలో తాను దత్తత తీసుకున్న మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు, డిండి ఎత్తిపోతల పథకాలను కూడా వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి డజన్ల కొద్దీ లేఖలు రాశారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఉమ్మడి ఏపీలోనే ప్రారంభమైన ఈ ప్రాజెక్టులను చంద్రబాబు ఎలా వ్యతిరేకిస్తారని మండిపడ్డారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తాను కాళేశ్వరం ప్రాజెక్టును వ్యతిరేకించలేదని, సముద్రంలో కలిసే నీటినే బనకచర్ల ప్రాజెక్టు ద్వారా తీసుకువెళ్తున్నామని, తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు తనకు రెండు కళ్ల లాంటివని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు హరీశ్‌రావు చెప్పారు. చంద్రబాబుకు రెండు రాష్ట్రాలు రెండు కళ్లు అయితే నాగార్జునసాగర్ ఎడమ కాల్వను ఎండబెట్టి, కుడి కాల్వ ద్వారా నీళ్లను ఏపీకి తరలించుకొనిపోవడం సమన్యాయమా అని ప్రశ్నించారు. ఢిల్లీలో పలుకుబడిని ఉపయోగించి చంద్రబాబు తెలంగాణ నోరు కొడుతున్నారని హరీశ్ మండిపడ్డారు. నాగార్జునసాగర్, శ్రీశైలం నుంచి రోజుకు 2టీఎంసీల నీటిని తరలిస్తూ తెలంగాణకు సాగు నీరు, తాగు నీరు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. బనకచర్ల ద్వారా గోదావరి నుంచి 200టీఎంసీల నీటిని పెన్నా బేసిన్‌కు తరలించడానికి ఏపీ యత్నిస్తోందని, దీన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. ఏపీలో చంద్రబాబు సీఎం కాగానే తెలంగాణకు చెందిన ప్రాజెక్టుల డీపీఆర్‌లు వెనక్కు వస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఆపడానికి ప్రయత్నించలేదన్న చంద్రబాబు వ్యాఖ్యలను గుర్తు చేస్తూ.. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతిపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నానంటూ నాడు చంద్రబాబు కేంద్రానికి రాసినట్లు ఉన్న లేఖను హరీశ్‌రావు విడుదల చేశారు. తెలంగాణ ఒక కన్ను అయితే, తెలంగాణలో ప్రాజెక్టులపై అభ్యంతరం లేని చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, కేంద్రంలోని బీజేపీ పక్షపాత ధోరణితో తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, ప్రజలను చైతన్యం చేసి, బీజేపీ, చంద్రబాబు కుట్రలను తిప్పికొడుతూ రేవంత్‌రెడ్డి చేతగానితనాన్ని ఎండగడతామని అన్నారు. మరోవైపు, ఎస్సారెస్పీ స్టేజ్-2 కింద తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట, భూపాలపల్లిలో చాలా చోట్ల పంటలు ఎండిపోతున్నాయని హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎస్సారెస్పీలో నీరు తగ్గినా కూడా కాళేశ్వరం ద్వారా నీటిని విడుదల చేసి ఒక్క ఎకరా కూడా ఎండకుండా రెండు పంటలకు నీళ్లు ఇచ్చామని గుర్తు చేశారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను హరీశ్‌రావు బుధవారం సందర్శించి మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన మంచి పనులను తుడిచిపెట్టాలనో, ఆ పనులను పక్కకు పెట్టాలనే ప్రయత్నంతోనో ప్రభుత్వం ప్రజలకు నష్టం చేయవద్దన్నారు.



చంద్రబాబు రాసిన లేఖను చూపుతున్న హరీశ్

కేసీఆర్ కృషి ఫలితంగానే సీతారామ పూర్తి

తిట్టడం తప్ప.. కట్టడంరాని కాంగ్రెస్‌కు కేసీఆర్ గొప్పతనం ఇప్పటికైనా అర్థం కావాలని, ఆయన కృషి ఫలితంగానే సీతారామ ప్రాజెక్టు పూర్తైందని హరీశ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాడు ఈ ప్రాజెక్టుకు అనుమతులు రాకుండా కోర్టుల్లో కేసులు వేసి, ఇప్పుడు గోదావరి జలాల వద్ద ఫొటోలకు ఫోజులిస్తున్న కాంగ్రెస్ మంత్రులు, నాయకులు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. "2023 డిసెంబరు 7న రేవంత్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సీతారామ ప్రాజెక్టు మీద వారు విషం చిమ్మారు. వృథా ప్రాజెక్టు అని, ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదని అన్నారు. ఇప్పుడేమో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించి సిద్ధంగా ఉంచిన సీతారామ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోస్తూ ఫోటోలకు ఫోజులిస్తున్నారు" అని ఎద్దేవా చేశారు.

శ్రీవాణి టికెట్ల కోటా పెంచండి

» రూ.300 దర్శన టికెట్ల కౌంటర్ ఏర్పాటు చేయండి

» టీటీడీని కోరిన తిరుపతి విమానాశ్రయ అధికారులు

తిరుపతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో విక్రయించే శ్రీవాణి టికెట్ల కోటా పెంచాలని విమానాశ్రయం అధికారులు టీటీడీని కోరారు. ప్రస్తుతం ఇక్కడ రోజుకు 200 టికెట్లు మాత్రమే జారీ చేస్తున్నారు. మధ్యాహ్నం తర్వాత విమానాల్లో వచ్చే వారికి టికెట్లు లభించడం లేదు. ఈ సంఖ్యను వెయ్యికి పెంచాల్సిందిగా విమానాశ్రయ అధికారులు కోరినట్లు తెలిసింది. అలాగే రూ.300ల దర్శన టికెట్ల కౌంటర్‌ను కూడా ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేయాలని, రోజుకు 1000-1500 టికెట్లు కేటాయించాలని టీటీడీని కోరారు. ఇందువల్ల దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విమాన ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు, పాలకవర్గం ముఖ్యులు చెప్పినట్లు సమాచారం.

20 అడుగుల ఏక శిలా విగ్రహం

తిరుపతి విమానాశ్రయం లాంజ్‌లో 20 అడుగుల శ్రీవారి ఏక శిలా విగ్రహం ఏర్పాటు చేయాలని ఎయిర్‌పోర్టు అధికారులు నిర్ణయించారు. ఎయిర్‌పోర్టు వెలుపల కూడా రెండు చిన్న విగ్రహాలు ఏర్పాటు చేయాలనుకుంటున్నారు. శ్రీవారి శిలా విగ్రహాలను భక్తుల సహకారంతో అందించాలంటూ ఎయిర్‌పోర్టు అధికారులు టీటీడీని అభ్యర్థించారు. దీనికి టీటీడీ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.



తల్లి మమతతో చిన్నారి శ్రీవిద్య

ఆధార్ ఇప్పిస్తే ఈ చిన్నారి చదువుకుంటది!

» బర్త్ సర్టిఫికెట్ లేకపోవడంతో స్కూల్లో పేరు తొలగింపు

» సనత్‌నగర్ దాసారం బస్తీ నిరుపేద చదువుల తల్లికి పెద్ద కష్టం

హైదరాబాద్ సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆ బాలికకూ చదువుకోవాలని ఉంది. రోజూ బడికి వెళ్లాలని ఉంది. యూనిఫాం ధరించి.. పుస్తకాల సంచీ భుజానేసుకొని తమ గుడిసె ముందు నుంచి వెళ్లే తన ఈడు పిల్లల్ని చూస్తూ 'నేను కూడా ఇలా స్కూలుకు వెళితే బాగుండు' అనుకుంటుంది. అయినా వెళ్లలేకపోతోంది. నిబంధనల పేరుతో అధికారులు, టీచర్లే చదువుపై చిన్నారికి ఉన్న ఆసక్తిని చిదిమేస్తున్నారు. అయినా చదువుపై ఆ చిన్నారికి ఎంతో అనురక్తి ఉంది. చెత్తలో ఓ పుస్తకం దొరికితే.. అందులో అక్షరాలు దిద్దుతోంది! ఈ పాప పేరు మల్లెల శ్రీవిద్య. వయసు ఎనిమిదేళ్లు. సనత్‌నగర్ దాసారం బస్తీలో రెక్కల కష్టమ్మీద బతికే అశోక్, మమత దంపతుల బిడ్డ. ఏడాది క్రితం స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో శ్రీవిద్యను చేర్పించారు. ఆమెకు బర్త్ సర్టిఫికెట్, ఆధార్ లేదంటూ ఆ స్కూలు నిర్వాహకులు శ్రీవిద్యను బడికి పంపొద్దని తల్లిదండ్రులకు చెప్పారు. ఫలితంగా పాప ఇంటి వద్దే ఉంటోంది. పాపకు తాము బర్త్ సర్టిఫికెట్ తీసుకోలేదని తల్లి మమత చెప్పింది. బర్త్ సర్టిఫికెట్ కావాలని అధికారులను సంప్రదిస్తే.. పాప ఏ తారీఖున పుట్టిందనే వివరాలతో ఆస్పత్రి వారు ఇచ్చిన పత్రం తేవాలంటున్నారని.. పాప ఇంట్లోనే పుడితే ఆ పత్రం తామెక్కడి నుంచి తేవాలి? అని ఆవేదన వ్యక్తం చేసింది. జనన ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో పాపకు ఆధార్ కార్డు కూడా ఇవ్వడం లేదని చెప్పింది. రూ.10వేలు సర్దుబాటు చేస్తే అన్ని పత్రాలూ సిద్ధం చేస్తామని కొందరు చెబుతున్నారని.. అంతడబ్బు తమ దగ్గర లేదని మమత వాపోయింది. అధికారులు స్పందించి శ్రీవిద్యకు బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు ఇప్పించాలని చేతులు జోడిస్తోంది.

గ్రూప్-1 మీద తప్పుడు వార్తలపై కేసు!

హైదరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఉద్యోగాలను రూ. కోట్లకు అమ్ముకుంటున్నారని తెలుగు స్క్రైబ్ డిజిటల్ వెబ్‌సైట్ చేసిన ఆరోపణలపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) స్పందించింది. అసత్య, నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు ఆ వెబ్‌సైట్ నిర్వాహకులపై కమిషన్ ప్రతినిధి సుమతి బుధవారం బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే రాజ్యాంగబద్ధ సంస్థ ప్రతిష్ఠను దిగజార్చేందుకు ప్రయత్నించినందుకు ఆ సంస్థపై క్రిమినల్ పరువు నష్టం దావా వేస్తున్నట్టు సుమతి తెలిపారు. టీజీపీఎస్సీ పరీక్షలకు సంబంధించి తప్పుడు వార్తలను నమ్మవద్దని అభ్యర్థులకు టీజీపీఎస్సీ సూచించింది. ప్రతీ పోస్టుకు అభ్యర్థులను ప్రతిభ ఆధారంగా, అత్యంత పారదర్శకంగా ఎంపిక చేస్తామని తెలిపింది. గ్రూప్-1 పరీక్ష ఫలితాలు విడుదల చేసేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఫలితాలు ప్రకటించాలన్నదే కమిషన్ లక్ష్యమని పేర్కొంది. పేపర్‌ల వారీగా మార్కుల జాబితాను అభ్యర్థి లాగిన్‌లో, ప్రొవిజనల్ మార్కుల జాబితాను త్వరలో అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటిస్తామని వెల్లడించింది.

మొరాయించిన కన్వేయర్ బెల్ట్

» సొరంగంలో సహాయక చర్యలకు విఘాతం

» 12 రోజులు కావస్తున్నా దొరకని కార్మికుల జాడ

» ఢిల్లీ నుంచి వచ్చిన సిస్మాలజీ నిపుణుల బృందం

నాగర్‌కర్నూల్/దోమలపెంట/అల్వాల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరిగి.. 12 రోజులవుతున్నా కార్మికుల ఆచూకీ లభించడం లేదు. కార్మికుల జాడ కనుగొనేందుకు సహాయక బృందాలు నిరంతరం శ్రమిస్తున్నా.. అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నాయి. మంగళవారం కన్వేయర్ బెల్టు పునరుద్ధరణతో సహాయక చర్యలు వేగవంతమవుతాయని అందరూ ఆశించారు. అయితే, సాంకేతిక సమస్యలతో మంగళవారం రాత్రే కన్వేయర్ బెల్టు ఆగిపోయింది. దీంతో సహాయక చర్యలకు మళ్లీ విఘాతం ఏర్పడింది. టన్నెల్ బోరింగ్ మిషన్ తొలగింపు ప్రక్రియ పూర్తి కాలేదు. అధికంగా వస్తున్న ఊట నీరు, ఊడి పడుతున్న మట్టి దిబ్బల కారణంగా సిబ్బంది ముందుకు వెళ్లలేని పరిస్థితులున్నాయి. ప్రమాదం జరిగి 12 రోజులు అవుతున్న నేపథ్యంలో కార్మికుల సురక్షితంగా ఉన్నారా? లేదా? అనే అంశంలో ఆశలు క్రమంగా సన్నగిల్లుతున్నాయి. మరోవైపు.. బుధవారం ఢిల్లీ నుంచి వచ్చిన సిస్మాలజీ విభాగానికి చెందిన నిపుణులు ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పరిశీలించారు. సొరంగం పైభాగంలో మట్టి పొరలు, వాటి స్వభావం, మట్టి తొలగించడం వల్ల ఏమైనా ఇబ్బందులుంటాయా? పైకప్పు మళ్లీ కూలే పరిస్థితులున్నాయా? అనే అంశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఈ బృందం నివేదిక అందించనుంది. కాగా, సొరంగం వద్ద సహాయక చర్యల్లో ఆర్మీకి చెందిన ఇంజనీరింగ్ టాస్క్‌ఫోర్స్(ఈటీఎఫ్) నిపుణులు కీలక పాత్ర పోషిస్తున్నారని రక్షణశాఖ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మంగళవారం రాత్రి సొరంగంలోకి వెళ్లిన నిపుణులు బుధవారం మధ్యాహ్నం వరకూ అక్కడే ఉండి పనులను పర్యవేక్షించినట్లు తెలిపారు.



ఎస్ఎల్‌బీసీ సొరంగంలో నిలిచిపోయిన కన్వేయర్ బెల్ట్

96.63% హాజరు



ఆదిలాబాద్‌లోని పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

(మొదటి పేజీ తరువాయి)

హాజరయ్యారని, 17,010 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. హన్మకొండ, వరంగల్ జిల్లాలో రెండు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాలకు ప్రత్యేక పరిశీలకులను పంపామన్నారు. పరీక్షల ఏర్పాట్లను కృష్ణ ఆదిత్య స్వయంగా పరిశీలించారు. హైదరాబాద్‌లోని పలు పరీక్షా కేంద్రాలను ఆయన బుధవారం ఉదయం తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయగా, అన్ని చోట్లా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఇక, హైదరాబాద్‌లో ట్రాఫిక్ జామ్‌తో వందల సంఖ్యలో విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోలేకపోయారు. కొన్నిచోట్ల ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించగా, గేట్లు మూసేయడంతో ఆపై ఆలస్యంగా వచ్చిన వారు వెనుదిరగాల్సి వచ్చింది. కాగా, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. 4,40,788 రెగ్యులర్, 67,735 ప్రైవేటు విద్యార్థులు కలిపి మొత్తం 5,08,523 విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు.

కళాశాల నిర్వాకంతో పరీక్ష రాయలేకపోయిన విద్యార్థి

వికారాబాద్ జిల్లా పరిగిలో ఫీజు చెల్లించలేదంటూ ఓ విద్యార్థికి కళాశాల యాజమాన్యం హాల్ టికెట్ ఇవ్వలేదు. చివరికి బుధవారం ఉదయం ఫీజు చెల్లించిన తర్వాత హాల్ టికెట్ ఇచ్చినా.. విద్యార్థి పరీక్షా కేంద్రానికి చేరుకునే సరికి 20 నిమిషాలు ఆలస్యం కావడంతో నిర్వాహకులు లోపలికి అనుమతించలేదు.



తండ్రి సహకారంతో పరీక్షకు..

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడకు చెందిన దివ్యాంగురాలు శివానీని ఆమె తండ్రి సత్యనారాయణ మర్రిగూడలోని పరీక్షాకేంద్రానికి ఎత్తుకుని తీసుకురాగా పరీక్ష రాసింది. కుమార్తె అభ్యున్నతికి తండ్రి పడుతున్న తపనను పలువురు అభినందించారు.

పొరపాటున మరో కేంద్రానికి.. విద్యార్థికి ఎస్సై సాయం

నిర్మల్ జిల్లా ముథోల్‌లో ఓ ఇంటర్ విద్యార్థి తనకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి వెళ్లాల్సి ఉండగా.. పొరపాటున మరో కేంద్రానికి వెళ్లాడు. అసలు పరీక్షా కేంద్రం కిలోమీటర్ దూరం ఉండడంతో ఆందోళనతో పరుగు ప్రారంభించాడు. విద్యార్థి ఇబ్బందిని గమనించిన ముథోల్ ఎస్సై సంజీవ్ ఆ విద్యార్థిని పోలీసు వాహనంలో ఆ కేంద్రానికి సకాలంలో చేర్చడంతో పరీక్ష రాయగలిగాడు.

5 రోజులు... 4 వేల దరఖాస్తుల ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా మరో 4 వేలు ఆమోదం పొందాయి. మొత్తమ్మీద, 18 వేల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు ఆమోదం లభించింది. ఇప్పటి వరకూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.150 కోట్ల ఆదాయం లభించింది. కాగా, ప్రస్తుతం ఆటోమేటిక్ ఫీజు జనరేట్ అయిన దరఖాస్తులే సుమారు 19 లక్షల వరకు ఉన్నాయి. ఇందులో సగం పరిష్కారం కావాలన్నా రోజుకు కనీసం 30 వేల దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉంటుందని ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

కటాఫ్ తేదీలోపు 25.68 లక్షల దరఖాస్తులు

వాస్తవానికి ఎల్ఆర్ఎస్‌కు ప్రభుత్వం 2020 ఆగస్టు 26వ తేదీని కటాఫ్ తేదీగా నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆ గడువు లోగా వచ్చిన దరఖాస్తులు 25.68 లక్షలు. ఇప్పుడు సవరించిన మార్గదర్శకాల ప్రకారం.. కటాఫ్ తేదీలోపు లేఅవుట్‌లో ప్లాట్ కొనుగోలు చేసి నాడు ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేయనివారికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే రాయితీ వర్తించేలా వెసులబాటు ఇచ్చింది. అయినప్పటికీ పెద్దగా స్పందన లేదు. కాగా, 2020లో ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన 25.68 లక్షల దరఖాస్తుల్లో ప్రభుత్వ భూములు, నిషేధిత భూములకు సంబంధించినవి 2.50 లక్షలు. జలవనరులకు 200 మీటర్ల సమీపంలో ఉన్నవి సుమారు 4 లక్షలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం వీటిని ఆమోదించాలా లేదా అనే నిర్ణయం తీసుకుంటారు.

ఫామ్ ల్యాండ్స్ క్రమబద్ధీకరణ లేదు

111 జీవో పరిధిలో ఉండే ఫామ్ ల్యాండ్స్‌కు సంబంధించి ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ విషయంలో, 10 శాతం సేల్ డీడ్ కాగా మిగిలిపోయిన ప్లాట్లకు సంబంధించి ప్రస్తుతం అవకాశం ఉందని పేర్కొన్నారు. అంటే, 2020లో దరఖాస్తుచేసుకోని వారికి కూడా రిజిస్ట్రేషన్‌తో పాటు ఎల్ఆర్ఎస్‌కు అవకాశం ఇస్తున్నారు. ఎల్ఆర్ఎస్ చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు బుధవారం వచ్చిన దరఖాస్తులు కేవలం 95 మాత్రమే. అవగాహన సదస్సులు పెడుతున్నా దరఖాస్తుదారులు ఆసక్తి చూపడం లేదని అధికారులు చెబుతున్నారు.

గాలికుంటు వ్యాధి రహిత రాష్ట్రంగా తెలంగాణ

» కేంద్రం లక్ష్యం.. పశువులకు కూడా జనరిక్ ఔషధాలు

న్యూఢిల్లీ, మార్చి 5: పశువులకు కూడా తక్కువ ధరలకు దొరికే జనరిక్ మందులను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకొంది. పశుగణ ఆరోగ్యం, వ్యాధుల నివారణ పథకం అమలు కోసం 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాలకుగానూ రూ.3,880 కోట్లు కేటాయించింది. గాలికుంటు, నీలినాలుక వ్యాధి, ఇతర రుగ్మతల నివారణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు పేర్కొంది. తెలంగాణ, ఏపీ సహా తొమ్మిది రాష్ట్రాలను గాలికుంటు వ్యాధి రహిత రాష్ట్రాలుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకొంది.

మిర్చి ధర పెరిగిందోచ్..

» వరంగల్ మార్కెట్లో సింగిల్ పట్టి రకానికి రూ.41.000లు

వరంగల్ వ్యవసాయం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మిర్చి ధర పెరిగింది. బుధవారం సింగిల్‌పట్టి రకం మిర్చికి క్వింటాకు రూ.41.000ల ధర పలికింది. ఇది ఈ సీజన్‌లోనే అత్యధికం. అదేవిధంగా దేశీ రకం మిర్చికి రూ.28,500, దీపిక రకం మిర్చికి రూ.17,100, వండర్ హాట్ రూ.16,700, తేజా రకం రూ.14,000, యూఎస్ 341 రకానికి రూ.14,600లు ధర పలికింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ట్రంప్ మాటల మర్మం!

అమెరికా అధ్యక్షబాధ్యతలు రెండోసారి చేపట్టిన తరువాత, మొదటిసారి కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో డోనాల్డ్‌ట్రంప్ చేసిన ప్రసంగంలో ఆత్మస్తుతి, పరనిందలతో పాటుగా, ప్రమాద హెచ్చరికలు కూడా ప్రబలంగానే ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన ఈ నెలన్నరలోనూ తాను సృష్టించిన గందరగోళాన్నీ, చేపట్టిన విధ్వంసాన్ని మహా అద్భుతాలుగా, చారిత్రాత్మక పరిణామాలుగా అభివర్ణించుకోవడం అటుంచితే, ముందుముందు మరింత వినాశనం ఉన్నదని కూడా ఆయన హెచ్చరిస్తున్నారు. గత ఎనిమిదేళ్ళ కంటే ఈ ఆరువారాల్లోనే అధిక విజయాలు, అద్భుతాలు జరిగాయని ఆయన భుజాలు చరుచుకున్నారు. అమెరికా ఇక హాయినపడవచ్చునని చెప్పుకున్నారు. పాడుకాలం పోయి గత కాలపు ఘనమైన రోజులు తిరిగొచ్చాయని అంటూనే, అమెరికాను మళ్ళీ అగ్రస్థానాన నిలబెట్టే క్రమంలో ఇది ఆరంభం మాత్రమేనని హెచ్చరిక కూడా చేశారు. తన దేశాన్ని యావత్ ప్రపంచం దోచుకుంటూంటే, రక్షకుడిగా తాను అవతరించానన్నది ఆ ప్రసంగం అంతరార్థం.

ఇది ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఓ నాయకుడి ప్రసంగంలా కాక, ఓ చక్రవర్తిలాగా ఆయన మాట్లాడాడు. దూకుడు వ్యాఖ్యలు, అర్ధసత్యాలు, అపహాస్యాలు గుదిగుచ్చిన ప్రసంగం అది. డెమోక్రాట్లు అడ్డుతగులుతారని అనుకున్నదే కానీ, అదేమీ గట్టిగా జరగలేదు. నువ్వేమీ రాజువు కావు అంటూ కొందరు ఆక్షేపించారు, చిన్నచిన్న నిట్టూర్పులతో తమ అసమ్మతిని తెలియచేశారు. కాస్తంత గట్టిగా నిరసన తెలియచేసిన టెక్సాస్ డెమోక్రాట్ అల్ గ్రీన్‌ను సభనుంచి గెంటేయడంతో ఆయన ఇప్పుడు అధ్యక్షుడిని అభిశంసించే ఆలోచనలో ఉన్నాడు. రెండుసార్లు అభిశంసనకు గురై, ముప్పైనాలుగు అపరాధాలు రుజువైన ట్రంప్‌కు అదేమీ కొత్తకాదు కూడా. ఈ ప్రయత్నం గనుక తప్పిజారి పట్టాలెక్కితే, మలివిడతలో కూడా ఒక సుదీర్ఘమైన అభిశంసన ప్రక్రియను అమెరికాతో పాటు మిగతా ప్రపంచమూ భరించాల్సివస్తుంది.

అమెరికా అధ్యక్షుడు ఆరువారాల్లోనే తనకు శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరని తేల్చేశారు. ఆప్తమిత్రదేశాలను అదిలించి, అవమానించి దూరం నెట్టేశారు. అధికారులంతా దోపిడీదారులనీ, బద్ధకస్తులనీ, జనం సొమ్మును రాళ్ళపాల్జేశారనీ ఆరోపిస్తూ వారిని వెంటాడుతున్నారు, ఇంటికి పంపేస్తున్నారు. గత పాలకుల చేతకానితనం, బాధ్యతారాహిత్యం కారణంగా దేశం అప్పుల ఊబిలోకి జారిపోయిందనీ, మిగతా ప్రపంచం దోచుకుందనీ, తాను ఉద్ధరిస్తానన్న కథనాలకు అనుగుణంగానే ఆయన చర్యలన్నీ ఉన్నాయి. మిగతా దేశాలకు ఇచ్చేది ఆపేయడం, సాధ్యమైనంత దోచేయడం లక్ష్యంగా దాడి సాగుతోంది. మిత్రుడు, శత్రువు తేడాలేకుండా సుంకాలతో బాదేయడం, నమ్ముకున్న వారిని నట్టేటముంచేయడం, సుంకాలతో మొత్తి, ప్రాంతాలను లాక్కోవడం ఒక కొత్తవిలువగా కొనసాగుతోంది. ఆయన ప్రసంగంలో ప్రతిఫలించింది ఇదే.

ఆయన మస్క్‌ను మెచ్చుకున్నారు, మెలానియాను ప్రశంసించారు. స్వల్పకాలంలోనే వంద ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశానని, వందలాది చర్యలు తీసుకున్నానని చెప్పుకున్నారు. నినాదాలు చేసినా, నిరసనలు వెలిబుచ్చినా యూనివర్సిటీలనుంచి వెళ్ళగొడతానని హెచ్చరించిన ఈయనే, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ మళ్ళీ తిరిగొచ్చిందని గొప్పలకు పోయారు. ఇక ఏప్రిల్ ఫూల్ మీమ్స్ బారిన పడలేనంటూ ఆ మర్నాటి నుంచి అమలు చేయబోతున్న ప్రతీకార సుంకాలతో ఈ వికార యుద్ధానికి ఇప్పట్లో ముగింపు లేదని అర్థం. భారతదేశం సహా అన్ని దేశాలనూ ఆయన తన ప్రసంగంలో ఆడిపోసుకున్నారు. ఎవరు ఎంతగా తమను దోచేస్తున్నదీ, దాచేస్తున్నదీ చెప్పుకొచ్చారు. తన సుంకాల యుద్ధంతో దేశం మరింత సుసంపన్నమై, గొప్పదేశంగా అవతరిస్తుందని భరోసా ఇచ్చారు. మిగతా దేశాల సంగతి అటుంచితే, నలభైశాతానికి పైగా ఎగుమతులు దిగుమతులు జరిగే మెగ్జికో, కెనడా, చైనాతో ఈ యుద్ధం ఇదేరీతిలో కొనసాగితే ఆదాయాలు పడిపోయి, అమెరికా మధ్యతరగతికి పెద్ద దెబ్బ తగులుతుందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ అధ్యక్షుడి హయాంలో అమెరికా పరువుదిగజారిపోతోందని గట్టిగా చెప్పగలిగే బలం డెమోక్రాట్లకు కూడా లేదు. ఉభయసభల్లోనూ ఆయనే బలవంతుడు కనుక వ్యతిరేకించే వాతావరణం లేదు. పెరిగిన జీవన వ్యయం ప్రత్యక్షంగా అనుభవంలోకి వచ్చేవరకూ ట్రంప్ ఓటు బ్యాంకు తిరగబడే పరిస్థితీ ఉండదు. కానీ, స్టాక్ మార్కెట్లు ఎప్పటికప్పుడు ట్రంప్ చర్యలను గమనిస్తూ, తుళ్ళిపడుతూనే ఉన్నాయి. కనీసం పాతికేళ్ళుగా మనకు తెలిసిన, మనతో వ్యవహారాలు నడిపిన అమెరికా ఇది కాదన్నది వాస్తవం.

డిజిటల్ విప్లవంతో వికసిత భారతం

> ప్రపంచ ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ పాత్రను బలోపేతం చేస్తూ ఐదు సెమీకండక్టర్ ప్లాంట్లు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. నేడు మన ప్రధాన ఎగుమతుల్లో తొలి మూడూ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులే. ఈ ఏడాదే మొట్టమొదటి 'మేక్ ఇన్ ఇండియా' చిప్‌ను ఆవిష్కరించబోతున్నాం. సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ దన్నుగా, భారతదేశపు సాంకేతిక విప్లవాన్ని డీపీఐ ముందుకు తీసుకువెళుతోంది. భారత్ తనదైన ఏఐ వ్యవస్థ ద్వారా ఆ అధునాతన సాంకేతికతను ప్రజాస్వామ్యీకరిస్తూ దాన్ని అందరికీ అందుబాటులోకి తెస్తోంది.



మహారాష్ట్రలోని బారామతిలో, ఒక చిన్న రైతు కృత్రిమ మేధ (ఏఐ) ఉపయోగించి వ్యవసాయం రూపురేఖల్ని మార్చివేస్తున్నాడు. ఈ అసాధారణ ప్రయత్నం ఇపుడు మన కళ్ళ ఎదుట రూపుకడుతున్నది. ఎరువుల వాడకం తగ్గిపోయింది. నీటిని సమర్థంగా వినియోగిస్తున్నారు. అలాగే అధిక దిగుబడీ సుసాధ్యం అయింది. ఇదంతా ఏఐ వల్లనే!

భారతదేశంలో ఏఐ సృష్టిస్తున్న విప్లవంలో ఇది ఒక భాగం మాత్రమే. అధునాతన సాంకేతికతలు, ఆవిష్కరణలు ఇక ఎంతమాత్రం ప్రయోగశాలలకే పరిమితం కావు. సాధారణ పౌరుల జీవితాలను అవి సమూలంగా మార్చివేస్తున్నాయి. రేపటి రోజున జరగబోయే పెను మార్పులకు బారామతి రైతు కథ ఒక సూక్ష్మరూపం– అంటే.. 2047 వికసిత భారత్ దిశగా మనం వేస్తున్న తొలి అడుగులు.

డిజిటల్ గమ్యం దిశగా మన ప్రయాణం వేగవంతమవుతోంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ), ఏఐ, సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ తయారీపై ప్రధానంగా దృష్టి సారించిన భారత్ తన డిజిటల్ భవిష్యత్తును స్వయంగా రూపొందించుకుంటున్నది. దశాబ్దాలుగా సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రపంచ అగ్రగామిగా ఉన్న భారత్, ఇప్పుడు హార్డ్‌వేర్ తయారీలో కూడా పెద్ద అంగలు వేస్తూ ముందుకు సాగుతోంది.

ప్రపంచ ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ పాత్రను బలోపేతం చేస్తూ ఐదు సెమీకండక్టర్ ప్లాంట్లు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. నేడు భారతదేశం ప్రధాన ఎగుమతుల్లో తొలి మూడూ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులే. అలాగే ఈ సంవత్సరం మరో అద్భుతం జరగబోతున్నది. మొట్టమొదటి 'మేక్ ఇన్ ఇండియా' చిప్‌ను మనం ఆవిష్కరించబోతున్నాం.

ఏఐ రూపకల్పన: కంప్యూట్, డేటా, ఆవిష్కరణలు : సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ దన్నుగా, భారతదేశపు సాంకేతిక విప్లవాన్ని డీపీఐ ముందుకు తీసుకువెళుతోంది. భారత్ తనదైన ఏఐ సాంకేతికత వ్యవస్థ ద్వారా దానిని ప్రజాస్వామ్యీకరిస్తూ అందరికీ అందుబాటులోకి తెస్తోంది.

ఈ విషయంలో 18,000లకు పైగా గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్లు (జీపీయూలు) గల భారత కామన్ కంప్యూట్ సౌకర్యం కీలక మైలురాయిగా నిలుస్తుంది. గంటకు 100 రూపాయల కంటే తక్కువ ధరకు అందుబాటులో ఉండడం ద్వారా, పరిశోధకులు, అంకుర సంస్థలు, విద్యావేత్తలు, ఇతర సంబంధిత వ్యక్తులకు అత్యాధునిక పరిశోధనలను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమైన ప్రాథమిక నమూనాలు, అనువర్తనాలు సహా ఏఐ–ఆధారిత వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి జీపీయూలను సులభంగా వినియోగించేందుకు ఇది వీలు కల్పిస్తుంది.

వైవిధ్యమైన, అధిక–నాణ్యమైన డేటాతో ఏఐ నమూనాలకు శిక్షణ ఇవ్వడానికి భారత్ పెద్ద ఎత్తున వ్యక్తిగతేతర అనామక డేటాసెట్‌లను రూపొందిస్తోంది. పక్షపాతాన్ని తగ్గిస్తూ, ఖచ్చితత్వాన్ని మెరుగుపరచడానికి ఇది ఎంతగానో సహాయపడుతుంది, అలాగే ఇది ఏఐ వ్యవస్థలను మరింత విశ్వసనీయంగా, సమగ్రంగా అందరికీ చేరుస్తుంది. ఈ డేటాసెట్‌లు వ్యవసాయం, వాతావరణ అంచనాలు, ట్రాఫిక్ నిర్వహణ వంటి వివిధ రంగాల్లో ఏఐ–ఆధారిత పరిష్కారాలను రూపొందించేందుకు వీలు కల్పిస్తాయి.



ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద సామాజిక వేడుకల్లో మొదటిది అయిన మహాకుంభ్ మేళాను విజయవంతంగా నిర్వహించేందుకు భారత్ ఏఐ ఆధారిత పద్ధతులను సంపూర్ణంగా ఉపయోగించుకుంది. ఆ అధునాతన సాంకేతికత ఆధారిత నిర్వహణలో ప్రపంచస్థాయి ప్రమాణాలను మహాకుంభ్ నిర్దేశించింది.

భారత అవసరాలకు అనుగుణంగా లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎమ్‌లు), సమస్యకు సంబంధితమైన నిర్దిష్ట ఏఐ పరిష్కారాల వంటి సొంత ప్రాథమిక నమూనాల అభివృద్ధిని భారత ప్రభుత్వం అందిస్తుంది. ఏఐ పరిశోధనను ప్రోత్సహించడం కోసం అనేక ఎక్సలెన్స్ కేంద్రాలు కూడా ఏర్పాటయ్యాయి.

డిజిటల్ ఆవిష్కరణల కోసం భారత డీపీఐ ఒక బ్లూప్రింట్ : డీపీఐ కోసం భారత్ తొలిసారిగా చేసిన కృషి ప్రపంచ డిజిటల్ రంగాన్ని గణనీయంగా మార్చివేసింది. కార్పొరేట్ లేదా ప్రభుత్వ నియంత్రిత నమూనాల మాదిరిగా కాకుండా, భారత్‌లోని అద్భుతంగా చేపట్టిన ప్రభుత్వ–ప్రైవేట్ విధానం ద్వారా ఆధార్, యూపీఐ, డిజీలాకర్ వంటి ప్లాట్‌ఫారమ్‌లను నిర్మించడానికి ప్రభుత్వ నిధులను ఉపయోగిస్తున్నారు. ప్రైవేట్ రంగంలోని నిపుణులు డీపీఐ ఆధారంగా– వినియోగదారుల హితమైన, అప్లికేషన్ ఆధారిత పరిష్కారాలను రూపొందిస్తూ అద్భుతంగా ఆవిష్కరణలు చేస్తున్నారు.

యూపీఐ, డిజీలాకర్ వంటి ఆర్థిక, పాలనాపరమైన వేదికలను అద్భుతమైన పరిష్కారాలతో ఏకీకృతం చేస్తున్నారు. ఈ నమూనా ఇప్పుడు ఏఐ శక్తితో మరింత బలోపేతం అవుతున్నది. జీ20 సదస్సులో భారత డీపీఐ విధానం పట్ల ప్రపంచం అంతా ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ నమూనాను అనుసరించాలనే కోరికను వివిధ దేశాలు వ్యక్తం చేశాయి. భారత యూపీఐ చెల్లింపు వ్యవస్థకు జపాన్ పేటెంట్ మంజూరు చేసింది. దీనిని ఎంత వరకైనా విస్తరించడానికి అవకాశం ఉందని చెప్పడానికి ఇదే నిదర్శనం.

సంప్రదాయం, సాంకేతికతల సంగమంగా మహాకుంభ్: ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద సామాజిక వేడుకల్లో మొదటిది అయిన మహాకుంభ్ సజావుగా, విజయవంతంగా నిర్వహించడం కోసం భారత్ తన డీపీఐ, ఏఐ ఆధారిత నిర్వహణా విధానాన్ని ఉపయోగించుకుంది. ప్రయాగ్‌రాజ్‌లోని రైల్వే స్టేషన్లలో జనసమూహానికి ఇబ్బందులు లేకుండా చేయడానికి ఏఐ –ఆధారిత సాధనాలు రైల్వే ప్రయాణీకుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాయి.

కుంభ్ సహాయక్ చాట్‌బాట్‌లో ఏకీకృతం చేసిన భాషిణి, అందరికీ వాయిస్–ఆధారంగా తప్పిపోయిన వారిని కనుగొనే అవకాశం లభించింది. రియల్–టైమ్ అనువాదం అలాగే బహుభాషా సహాయాన్ని అందించింది. భారతీయ రైల్వేలు, ఉత్తరప్రదేశ్ పోలీసులు సహా వివిధ విభాగాలు పరస్పర సహకారంతో సమస్యలకు త్వరిత పరిష్కారం కోసం కమ్యూనికేషన్‌ను క్రమబద్ధీకరించారు.

డీపీఐని ఉపయోగించడం ద్వారా, మహాకుంభ్ సాంకేతికత ఆధారిత నిర్వహణలో ప్రపంచస్థాయి ప్రమాణాలను నిర్దేశించింది, దీనిని మరింత సమ్మిళితంగా, సమర్థంగా, సురక్షితంగా చేసింది.

భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామికశక్తిని రూపొందించడం : డిజిటల్ విప్లవానికి భారత శ్రామికశక్తి ప్రధాన కేంద్రంగా ఉంది. దేశంలో వారానికో కొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటవుతూ, ప్రపంచ పరిశోధన, అభివృద్ధి, సాంకేతిక అభివృద్ధికి ప్రధాన గమ్యస్థానంగా భారత్ స్థితిని బలోపేతం చేస్తుంది. అయితే, ఈ వృద్ధిని కొనసాగించడానికి విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో నిరంతర పెట్టుబడుల అవసరం ఎంతైనా ఉంది.

జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 ప్రకారం, ఏఐ, 5జీ, సెమీకండక్టర్ రూపకల్పన వంటి అంశాలను చేర్చుతూ విశ్వవిద్యాలయ పాఠ్యాంశాలను మెరుగుపరచడం ద్వారా ప్రభుత్వం ఈ సవాలును సమర్థంగా పరిష్కరిస్తోంది. పట్టభద్రులు ఉద్యోగానికి సిద్ధంగా ఉన్న నైపుణ్యాలతో ఉద్యోగాలను ప్రారంభించేలా చేసి, విద్య, ఉపాధి మధ్య అంతరాన్ని ఇది తగ్గిస్తోంది.

ఏఐ నియంత్రణ కోసం ఆచరణీయ విధానం : భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామికశక్తిని రూపొందిస్తున్న భారత్ తన ఏఐ నియంత్రణ విధానంతో బాధ్యతాయుతంగా విస్తరించే ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది. ఆవిష్కరణలను అణచివేసే 'హెవీ–హ్యాండెడ్' నియంత్రణ విధానం లేదా కొంతమంది చేతుల్లో అధికారాన్ని కేంద్రీకరించే 'మార్కెట్–ఆధారిత పాలన' వలె కాకుండా, భారత్ ఆచరణాత్మకమైన, సాంకేతిక–చట్టపరమైన విధానాన్ని అనుసరిస్తోంది.

ఏఐ సంబంధిత ఇబ్బందులను పరిష్కరించడానికి చట్టంపై మాత్రమే ఆధారపడకుండా, ప్రభుత్వం సాంకేతిక రక్షణ చర్యల్లోనూ పెట్టుబడులు పెడుతోంది. డీప్ ఫేక్స్, గోప్యతా సమస్యలు, సైబర్ భద్రతా ముప్పులను పరిష్కరించే సాధనాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలు, ఐఐటీల్లో ఏఐ–ఆధారిత ప్రాజెక్టులకు నిధులు సమకూరుస్తోంది.

ఏఐ ప్రపంచ పరిశ్రమల పునర్నిర్మాణాన్ని కొనసాగిస్తున్న నేపథ్యంలో, ఆవిష్కరణలను పెంపొందించే నియంత్రణ విధానాలను కొనసాగిస్తూనే సమ్మిళిత వృద్ధికి సాంకేతికతను ఉపయోగించుకోవాలనే స్పష్టమైన దార్శనికతతో భారత్ ముందుకు వెళ్తోంది. కానీ విధానాలు, మౌలిక సదుపాయాలకు అతీతంగా, ఈ పరివర్తన మన ప్రజల కోసమేననేది గమనించాల్సిన విషయం.

■ అశ్వినీ వైష్ణవ్
భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ, రైల్వే, సమాచార ప్రసార శాఖల మంత్రి

సవరణలు కోరితే చిక్కులే!

ఎస్సీ వర్గీకరణ అనేది ముప్పయ్యేండ్ల ఉద్యమమే కాదు, అంతకుముందు ఇరవై ఏళ్లుగా నానుతున్న సమస్య. ఇది ఎస్సీ కులాల్లోని అసమానతలను రాజ్యాంగబద్ధంగా సమానంగా పంచుకునేందుకు కృష్ణ మాదిగ, కృపాకర్ మాదిగ, బ్రహ్మయ్య మాదిగ, కనకారావు మాదిగ, ఇంకా కొద్దిమంది మాదిగ యువత కలిసి 1994లో 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి' (ఎంఆర్‌పిఎస్) ఒంగోలు ఈదుమూడి నుంచి ఉద్యమంగా మొదలైంది. 59 ఎస్సీ కులాల్లో రిజర్వేషన్లని మాలలు దాని అనుబంధ కులాలే తొంభై శాతం పొందుతున్నాయని, అవి మాదిగ అణగారిన ఎస్సీ కులాల అందరికీ సమానంగా పంపకం జరగాలని మాదిగలు గత ముప్పై ఏళ్లుగా పోరాడుతున్నారు. కానీ ఎస్సీ కులాల రిజర్వేషన్లను ఎక్కువగా అనుభవిస్తున్న ఆధిపత్య ఎస్సీలు "ఇది దళిత ఐక్యతకు దెబ్బ అని, రాజకీయ పార్టీలు మమ్మల్ని విడదీస్తున్నారని, రాజ్యాంగ విరుద్ధమని అంబేడ్కర్ సిద్ధాంతానికి వ్యతిరేకమ"ని కోర్టులకు పోయి వర్గీకరణ కాకుండా చేశారు.

ఈ పరిస్థితుల్లో 2024 ఆగస్టు ఒకటిన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాదిగ కులాలకు ఒక పెద్ద ఆశాదీపం. వర్గీకరణ రాజ్యాంగబద్ధమనీ, దేశమంతా సామాజిక, ఆర్థిక, విద్యా విషయాల్లో వ్యత్యాసం ఉందని, వర్గీకరణ రిజర్వేషన్ హక్కుల్లో భాగమనీ, ఆయా రాష్ట్రాలు వర్గీకరణను అమలు చేసుకోవచ్చనీ స్పష్టంగా తీర్పునిచ్చింది. సుప్రీంకోర్టు ఉత్తర్వు వచ్చిన వెంటనే దేశంలోనే అన్ని రాష్ట్రాల కన్నా ముందు తెలంగాణ సీఎం చేసిన అనుకూల ప్రకటన తెలంగాణ రాష్ట్ర మాదిగ, అనుబంధ కులాలు సామాజిక న్యాయ కాముకుల్లోనే కాక దేశవ్యాప్తంగా అనుకూల సందేశంగా వెళ్లింది. ఆ తర్వాత వర్గీకరణ అమలు కోసం జరగాల్సిన ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీ వేయడం, ఆ కమిటీ కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీ 1952 చట్టం ప్రకారం ఏకసభ్య కమిటీగా సీనియర్ జడ్జి షమీమ్ అక్తర్‌ని నియమించడం హర్షణీయం.



ఒకసారి కమిషన్ ఇచ్చిన రిపోర్టు, అసెంబ్లీ ఆమోదం పొందిన నివేదికను మళ్లీ కాలపరిమితి పొడిగించి, సవరణలు చేయమని డిమాండ్ చేయడం అంటే రాజ్యాంగపరమైన చిక్కుల్ని తెచ్చుకోవడమే. దానివల్ల మాదిగ, చర్మకార కులాల వర్గీకరణ హక్కు మళ్లీ వెనక్కుపోయే ముప్పు పొంచి ఉన్నది.

ఈ ఏడాది ఫిబ్రవరి 2న కమిషన్ విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజికంగా అత్యంత వెనుకబడిన ఎస్సీ కులాలని మొదటి గ్రూపుగా, మొదటి గ్రూప్ కంటే కొంత మెరుగైన కులాల్ని రెండవ గ్రూపుగా, విద్య–ఉద్యోగ–ఆర్థిక రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందిన కులాల్ని మూడవ గ్రూపులో చేర్చి నివేదిక సమర్పించింది. ఈ నివేదికను అసెంబ్లీ ఫిబ్రవరి 4న ఆమోదించి, ఆ తీర్మానాన్ని ఆర్టికల్ 338 ప్రకారం నేషనల్ ఎస్సీ కమిషన్‌కి పంపి, లీగల్ ప్రాబ్లమ్స్ రాకుండా జాగ్రత్తలు తీసుకుంది రాష్ట్ర ప్రభుత్వం. ఎందుకంటే 1997లో అసెంబ్లీలో చేసిన ఎస్సీ వర్గీకరణ తీర్మానాన్ని నేషనల్ ఎస్సీ కమిషన్‌కి పంపించ లేదనే కారణం చూపించి, ఇది రాజ్యాంగ విరుద్ధమని వర్గీకరణ వ్యతిరేకులు హైకోర్టులో పిటిషన్ వేసి కొట్టేయించారు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌ని, ఎస్సీ వర్గీకరణ నివేదికని అసెంబ్లీ ఆమోదించిన సమయాలను మాదిగ, దాని అనుబంధ కులాలు వేడుకలు చేసుకోవాల్సిన గొప్ప సందర్భం ఇది.


కానీ 30 ఏళ్ల నుంచి వర్గీకరణ ఉద్యమంగా ఉంటూ పంపక న్యాయాన్ని అన్ని రాజకీయ పార్టీలను ఆలోచింపజేసిన దండోరా నాయకుడు 'మాల అనుబంధ కులాలకు ఒక పర్సెంట్, మాలలకు నాలుగు పర్సెంట్ చేయాలనడం, మూడు గ్రూపులు కాకుండా నాలుగు గ్రూపులు చేయాలని డిమాండ్ చేయడం ఎవరి ప్రయోజనాల కోసం? ఇంకా ఎస్సీ కులాల్లో ఎవరికీ అసంతృప్తి, ఆవేదన ఉండకుండా అందరికీ న్యాయం జరగాలనే వాదన మాదిగ, సహ కులాల సమాజాలు ఎలా అర్థం చేసుకోవాలి? ఎస్సీల్లో రిజర్వేషన్ పంపకాలు సమానంగా లేవనీ మాల, మాల అనుబంధ కులాలు ఎస్సీ రిజర్వేషన్లను తొంభై శాతం పొందుతున్నారని, రిజర్వేషన్లను పొందని, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాలలో వెనకబడిన ఎస్సీ మాదిగ, మాదిగ సహ కులాలకు రాజ్యాంగబద్ధంగా పంపిణీ న్యాయం జరగాలని కదా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమం వచ్చింది.

ఇప్పుడు మాలలకు అదనంగా రాలేదనే అన్యాయ ఆవేదనకు, అసంతృప్తికి దండోరా నాయకుడు ఆసరా ఇవ్వడం వల్ల నష్టపోయేది ఎవరు? ఈ రోజు దాకా ఎస్సీ వర్గీకరణకు, ఎస్సీ సమానత్వాల వ్యతిరేక క్యాంపుగా ఉండి దశాబ్దాల తరబడి అడ్డుబడింది ఎస్సీల్లో ఎదిగిన మాల కులాలే కదా. 1997లో హైకోర్టులో, 1999 వర్గీకరణ అమలు చట్టాన్ని, 2004లో సుప్రీంకోర్టులో సాంకేతిక కారణాలు చూపించి అణగారిన ఎస్సీ కులాలకు రిజర్వేషన్లని దూరంబెట్టి అడ్డుకున్నవాళ్లు కూడా వీరే. ఆ అడ్డుపుల్లలు సరిపోలేదని ఈ మధ్య వర్గీకరణ అనుకూలమైన సుప్రీంకోర్టు జడ్జిమెంట్ మీద కూడా 32 రివ్యూ పిటిషన్లు వేసి క్యూరేటివ్ డిస్మిసల్స్‌తో వెనక్కి తగ్గారు. అర్ధ శతాబ్ద దండోరా పోరాటం, సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఎస్సీ వెనకబడిన కులాల కోసమే గాని అభివృద్ధి చెందిన కులాల కోసం కాదు. కమిషన్ చేసిన మూడు గ్రూపుల్లో మాదిగలకు జరిగిన నష్టం పెద్దగా ఏమీ లేదు.

ఎస్సీ కులాల్లో ఎవరికీ అసంతృప్తి, ఆవేదన ఉండొద్దు, అందరికీ న్యాయం జరగాలనడం, కమిషన్ గడువు పొడిగింపజేయడం వల్ల సమస్యను ఇంకా మానని పుండుగా జటిలం చేసే కథనే ఇది. ఒకసారి కమిషన్ ఇచ్చిన రిపోర్టు, అసెంబ్లీ ఆమోదం పొందిన నివేదికను మళ్లీ కాలపరిమితి పొడిగించి, సవరణలు చేయమని డిమాండ్ చేయడం అంటే రాజ్యాంగపరమైన చిక్కుల్ని తెచ్చుకోవడమే. దానివల్ల మాదిగ, చర్మకార కులాల వర్గీకరణ హక్కు మళ్లీ వెనక్కుపోయే ముప్పు పొంచి ఉన్నది. ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం రేపు వచ్చే లీగల్ సమస్యలన్నీ పక్కనపెట్టి కమిషన్‌ని పొడిగించడానికి అనుమతించింది. ఇది అవకాశంగా తీసుకుని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకులు సుప్రీంకోర్టు చెప్పిన 'రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టం వచ్చినట్లు వర్గీకరణ చేయరాదు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం వర్గీకరణ చేస్తే తిరిగి సమీక్షిస్తాం. అవసరం ఉంటే కొట్టేస్తాం' ఈ స్టేట్‌మెంట్‌ని అవకాశంగా తీసుకొని రేపు వర్గీకరణ వ్యతిరేకులు కోర్టుకెడితే సమస్య వెనక్కొచ్చి ఎప్పటి చిప్ప యెనుగులనే మిగుల్తది. తస్మాత్ జాగ్రత్త!

● జూపాక సుభద్ర

నెరవేరుతున్న దశాబ్దాల ఆకాంక్ష 'మామునూర్'



> తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ– దశాబ్దకాలంగా ఈ కృషి ఎందుకు జరగలేదని కేంద్రం అడిగిన ప్రశ్నకు నా దగ్గర జవాబు లేక.. మా అభ్యర్థనను సానుకూలంగా పరిశీలించాలని కోరడం ఒక్కటే చేయాల్సి రావడం కాస్త బాధ కలిగించింది.

హైదరాబాద్ మినహా తెలంగాణ నేల విమానాన్ని చేరుకోక దశాబ్దాలు దాటిపోయింది. విమానాశ్రయం ఇప్పుడొస్తుంది, అప్పుడొస్తుందని పేపర్లో, టీవీల్లో వార్తలు చూడటమే కానీ విమానం ఎగిరింది లేదు. ఈ లోటును పూడ్చేందుకు మా ప్రజాప్రభుత్వం చేస్తున్న విశేష కృషికి దైవ ఆశీర్వాదం తోడై ఎట్టకేలకు వరంగల్ జిల్లాలోని మామునూర్ విమానాశ్రయానికి అతిపెద్ద ముందడుగు పడింది. మామునూర్ విమానాశ్రయ ఏర్పాటుకు కేంద్ర పౌర విమానయాన సంస్థ అనుమతినిచ్చింది. ఈ మేరకు కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖ కార్యదర్శి అమిత్ కుమార్ ఝా, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్‌కు లేఖ ద్వారా తెలియజేసిన విషయం మీ అందరికి తెలిసిందే. మామునూర్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు మా ప్రభుత్వ ఆదేశాల మేరకు విమానాశ్రయ ప్రాధికార సంస్థ తన అభ్యర్థనను కేంద్రానికి పంపించింది. కేంద్ర ప్రభుత్వంతో మా ముఖ్యమంత్రి గారు, నేను ఈ అభ్యర్థనకు ఆమోదం లభించేలా నిరంతరం సంప్రదింపులు జరిపి, రాష్ట్రంలో ద్వితీయశ్రేణి నగరాల్లో విమానాశ్రయాల ఏర్పాటు స్థితిగతులను విపులంగా వివరించి మామునూర్ ఎయిర్‌పోర్ట్ మంజూరీ అయ్యేలా చూడటం జరిగింది. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ గారు, కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు గారి సహకారం మరిచిపోలేనిది. మామునూర్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి కావాల్సిన 253 ఎకరాల అదనపు భూమిని తెలంగాణ ప్రభుత్వం విమానాశ్రయ ప్రాధికార సంస్థ (ఏఏఐ)కి అప్పగించేందుకు ఇంతకు ముందే 205 కోట్ల రూపాయలను విడుదల చేసిన విషయాన్ని వారికి తెలియజేయడం, మా సత్వర స్పందనకు వారూ సానుకూలంగా ప్రతిస్పందించడం మామునూర్‌కు సానుకూలతను తీసుకువచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికి దశాబ్దకాలంగా ఈ కృషి ఎందుకు జరగలేదని కేంద్రం అడిగిన ప్రశ్నకు నా దగ్గర జవాబు లేక.. మా అభ్యర్థనను సానుకూలంగా పరిశీలించాలని కోరడం ఒక్కటే చేయాల్సి రావడం కాస్త బాధ కలిగించింది.

నేను మంత్రి పదవి చేపట్టిన వెంటనే జీఎంఆర్ సంస్థను చర్చలకు ఆహ్వానించి వరంగల్ జిల్లాలో విమానాశ్రయ ఆవశ్యకతను నొక్కి చెప్పాను. అయితే, తాము 2008లో అప్పటి ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం క్లాజ్ 5.2లో 25 సంవత్సరాల లోపల, 150 కిలోమీటర్ల పరిధిలో పాత ఎయిర్‌పోర్టుల అభివృద్ధి, కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మించరాదని చేసుకున్న ఒప్పందాన్ని గుర్తు చేయగా.. వరంగల్ ప్రజల చిరకాలవాంఛను, ద్వితీయశ్రేణి నగరాల్లో ఎయిర్ ట్రాన్సిట్ అభివృద్ధిని, ఆఫీషియల్ ఎయిర్ లైన్ గైడ్ (ఓఏజీ) విడుదల చేసిన నివేదికల్లో మన దేశ విమానయాన రంగ పురోగతిని ప్రజెంటేషన్ రూపంలో వివరించి సహకరించవలసిందిగా కోరడంతో వారుకూడా అంగీకారం తెలిపారు. తెలుపడమే కాదు, వారం రోజుల్లోనే హైదరాబాద్ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ బోర్డ్ మీటింగ్‌లో పెట్టి ఒక్క మామునూర్ ఎయిర్‌పోర్ట్‌కి 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' మంజూరు చేశారు.

తెలంగాణ రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన వెంటనే మన ద్వితీయ శ్రేణి నగరాలను విశాల ప్రపంచంతో అనుసంధానించాలనే కృతనిశ్చయంతో పనిచేయడం ప్రారంభించాం. ఇప్పుడు దాని ఫలితాన్ని మామునూర్ ఎయిర్‌పోర్ట్ అనుమతుల ద్వారా సాధించాం. ప్రజాస్వామ్యవ్యవస్థలో ప్రజల జీవన ప్రమాణాల పెంపులో రాజకీయాలకు, రాగద్వేషాలకు తావులేకుండా పనిచేయాలనే రాజ్యాంగస్ఫూర్తితో ఇవ్వాళ పనిచేసుకుంటూ వెళ్తున్న క్రమంలో దక్కిన విజయమే మామునూర్ విమానశ్రయ అనుమతులు.

> తెలంగాణ రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన వెంటనే మన ద్వితీయశ్రేణి నగరాలను విశాల ప్రపంచంతో అనుసంధానించాలనే కృతనిశ్చయంతో పనిచేయడం ప్రారంభించాం. ఇప్పుడు దాని ఫలితాన్ని మామునూర్ ఎయిర్‌పోర్ట్ అనుమతుల ద్వారా సాధించాం.




ఒక నగరంలో కొత్త విమానాశ్రయం నిర్మాణం జరిగినప్పుడు నగర అభివృద్ధి, ప్రజల జీవితాల్లో అనేక సానుకూల మార్పులు వస్తాయి. సుదీర్ఘవ్యూహం, నియమనిబంధనలకు లోబడి ప్రణాళికాబద్ధంగా ఒక విమానాశ్రయం నిర్మిస్తే.. ఆ నగరం అంతర్జాతీయ వాణిజ్య, సాంకేతిక, పర్యాటక కేంద్రంగా రూపాంతరం చెందుతుంది అనేందుకు అనేక ఉదాహరణలు మన కళ్లముందు సాక్షాత్కారమిస్తాయి. అందులో ప్రధానమైనది కేరళలోని కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం. కొచ్చిన్ విమానాశ్రయం అభివృద్ధి జరిగిన తరువాత పక్కనే ఉన్న అలెప్పి, మున్నార్, వర్కల, కోవలమ్ బీచ్ లాంటి పర్యాటక కేంద్రాల్లో హోటల్స్, షాపింగ్ మాల్స్, ఎంటర్టైన్‌మెంట్ కేంద్రాల ద్వారా దాదాపు 40 శాతం ఆదాయం పెరిగినట్టు అక్కడి నివేదికలు చెబుతున్నాయి. ముఖ్యంగా కొచ్చిన్ విమానాశ్రయం ఏర్పాటు తర్వాత.. కేరళకి యూరప్, పశ్చిమాసియా, తూర్పు ఆసియా దేశాల నుంచి పర్యాటకుల రాక విపరీతంగా పెరిగినట్టు ఆ రాష్ట్ర గణాంకశాఖ గతంలో ప్రకటించింది.

ఇదే కాదు, విమానాశ్రయం ఏర్పాటు నగర ఆర్థిక వ్యవస్థను వేగంగా మార్చివేస్తుందనేందుకు.. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, చెన్నై లాంటి నగరాలు ఉత్తమ ఉదాహరణలు. ఒక్క 2023 ఆర్థిక సంవత్సరంలోనే బెంగుళూరు కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో వేల కోట్ల కార్గో వ్యాపారం జరగడం విమానాశ్రయాల ప్రాధాన్యతను చెప్పకనే చెబుతుంది.

ఇక మన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని శంషాబాద్ ప్రాంతంలో 2008లో రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైన తర్వాత, హైదరాబాద్ రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. మనం చూస్తుండగానే అన్ని రంగాల్లో అనూహ్యమైన అభివృద్ధి జరిగింది. ముఖ్యంగా ఐటీలో టీసీఎస్, ఇన్ఫోసిస్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఒరాకిల్, డెలాయిట్, కాగ్నిజెంట్, ఐబీఎం వంటి అనేక ఐటీ దిగ్గజ కంపెనీలు తమ సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసుకున్నాయి. దీంతో రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తితో పాటు ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవకాశాలు గణనీయంగా పెరిగాయి. హైదరాబాద్ నగరానికి నోవటెల్, మ్యారియెట్, తాజ్ వంటి అనేక అంతర్జాతీయ హోటళ్లు క్యూ కట్టాయి. ఇవ్వాళ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం రాష్ట్ర ప్రగతిలో కీలకచోదకంగా మారింది. ఎయిర్‌పోర్ట్‌ను అనుసంధానించేలా నిర్మించిన అనేక ఫ్లైఓవర్లు, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్డు) వంటి నిర్మాణాల వల్ల నగరం నుండి ఎయిర్‌పోర్ట్ చేరుకునే సమయం తగ్గడమే కాదు, నగర పౌరుల జీవన ప్రమాణాలు పెరిగాయి. నగరంలో రియల్ ఎస్టేట్ రంగం అనూహ్యంగా పెరిగింది. పర్యాటకంగా చార్మినార్, గోల్కొండ కోట, రామోజీ ఫిల్మ్ సిటీ వంటి ప్రదేశాలకు అంతర్జాతీయ టూరిస్టుల రాక పెరిగింది. హైదరాబాద్ మెడికల్ టూరిజానికి అడ్డాగా ఎదిగింది. వీటన్నింటి వలన హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో అధునాతన మాల్స్, రెస్టారెంట్లు, ఎంటర్టైన్‌మెంట్ సెంటర్లు ఏర్పడ్డాయి. హైదరాబాద్ నుంచి నేరుగా అమెరికా, అరబ్ దేశాలు, బ్రిటన్ లాంటి దేశాలకు విమాన సర్వీసులు అందుబాటులోకి రావడంతో అనేక రంగాల్లో అనూహ్య అభివృద్ధి జరిగింది. అంతేకాదు, ఫార్మా సిటీ, మెడిటెక్ పార్క్, లాజిస్టిక్స్ హబ్‌ల అభివృద్ధితో హైదరాబాద్ ఫార్మారంగ ఎగుమతులు 35శాతం పెరిగినట్టు వివిధ నివేదికలు తేటతెల్లం చేస్తున్నాయి. ఇక అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జొమాటో, స్విగ్గీ వంటి కంపెనీల డెలివరీలు విమానసర్వీసులు అందుబాటులో ఉండటం వల్ల వేగంగా సాగుతున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా ఎయిర్‌పోర్ట్ నిర్మాణ సమయంలో దాదాపు పదివేల మందికి ఉపాధి దొరకగా.. ఇప్పుడది 50 వేలకు చేరింది.

మామునూర్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు వరంగల్ జిల్లా ప్రజల దశాబ్దాల కల. అది ఇప్పుడు మా ప్రజాప్రభుత్వ హయంలో నెరవేరబోతున్నందుకు సంతోషంగా ఉంది. ఇది ఉమ్మడి వరంగల్ జిల్లా సత్వర ప్రగతికి ఆయువుపట్టుగా మారబోతున్నది. ఇప్పటిదాక మెల్లగా సాగుతున్న వరంగల్ జిల్లా పారిశ్రామిక ప్రగతి మామునూర్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధితో రాకెట్ స్పీడ్‌తో దూసుకుపోబోతున్నది. రామప్ప వంటి వరల్డ్ హెరిటేజ్ సైట్ ఉండటం, కాకతీయుల అపురూప కట్టడాలైన వెయ్యి స్తంభాల దేవాలయం, వరంగల్ కోట, కోటగుళ్లు, భద్రకాళీ దేవస్థానంతో పాటు ఆసియాలో అతిపెద్ద ట్రైబల్ జాతర మేడారం వంటి ఆధ్యాత్మిక ప్రాంతాలతో పాటు.. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి జాతీయ విద్యా సంస్థలు ఉండటం, ఇప్పటికే వివిధ దేశాలకు చెందిన టెక్స్‌టైల్ కంపెనీలు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో తమ కంపెనీలను ఏర్పాటు చేసుకోవడంతో రేపు మామునూర్ ఎయిర్‌పోర్ట్ ఎగుమతులు, దిగుమతులకు కీలక కేంద్రంగా అభివృద్ధి చెందనున్నది. అంతేకాదు, వరంగల్ జిల్లాలో రియల్ ఎస్టేట్, విద్యా, వైద్యరంగాల్లో అనూహ్యమైన మార్పులు జరగనున్నాయి. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు తర్వాత హైదరాబాద్ నగరం విస్తరించినట్టుగానే.. మామునూర్ విమానాశ్రయం ఏర్పాటు తర్వాత వరంగల్ నగరం కూడా మరింత విస్తరించనున్నదనడంలో నాకు ఎటువంటి సందేహం లేదు. వరంగల్ మరింత అభివృద్ధి సాధించి జిల్లా పౌరులకు ఉద్యోగ, ఉపాధి, విద్యా అవకాశాలను మెరుగుపరచాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఏయిర్‌పోర్ట్ మంజూరు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ గారికి, పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు గారికి, ఎయిర్‌పోర్ట్ ముందుకు సాగడంలో తమదైన పాత్ర పోషించిన గౌరవ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి గారికి నా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

◆ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి



కొండా సురేఖకు సోనియాగాంధీ ప్రశంసలు

- కాళేశ్వరాలయంలో 42ఏళ్లకు కుంభాభిషేక నిర్వహణపై హర్షం
- సోనియాకు త్రివేణి సంగమం నీరు, ప్రసాదాలు పంపిన మంత్రి

వరంగల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖను అభినందిస్తూ కాంగ్రెస్ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ బుధవారం ఓ లేఖ విడుదల చేశారు. తెలంగాణలోని చారిత్రత్మక ఆలయం కాళేశ్వరంలోని మహకుంభాభిషేకం నిర్వహించటం అభినందనీయమన్నారు. 42ఏళ్ల తరువాత ప్రత్యేక చొరవతీసుకుని దేవాదాయశాఖ మంత్రిగా సురేఖ కుంభాభిషేకం నిర్వహించటం అభినందనీయమన్నారు. తనకు గంగాజలంతో పాటు ప్రసాదాన్ని పంపించారని సోనియాగాంధీ ఆ లేఖలో పేర్కొన్నారు. కాగా, ఫిబ్రవరి 8, 9, 10 తేదీల్లో మూడు రోజుల పాటు భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో శ్రీకాళేశ్వర, ముక్తీశ్వరాలయంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో మహకుంభాభిషేకం నిర్వహించారు. మంత్రి కొండా సురేఖతో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. 42ఏళ్ల తరువాత నిర్వహించిన ఈ మహకుంభాభిషేకానికి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. గోదావరి, ప్రాణహిత త్రివేణి సంగమంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ మహాకుంభాభిషేకం సందర్భంగా ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియాగాంధీకి మంత్రి కొండా సురేఖ గంగాజలంతో పాటు ప్రసాదాలు పంపించారు. వాటిని స్వీకరించిన సోనియాగాంధీ మంత్రి సురేఖను అభినందిస్తూ లేఖ రాయటం చర్చనీయాంశంగా మారింది.



ముగ్గురూ.. మనోళ్లేనా?

నిన్నటి వరకు ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికలు రాజకీయాలను హీటెక్కించాయి. ఇక ఇప్పుడు ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపు ఉత్కంఠను రేపుతున్నాయి. మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదలవగా.. శాసనసభలో ప్రస్తుత బలా బలాల దృష్ట్యా మిత్రపక్షాలతో కలిపి అధికార కాంగ్రెస్‌కు నాలుగు, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ఒక స్థానం దక్కనున్నాయి. ఇక ఆ సీట్లను దక్కించుకునేందుకు ఆయా పార్టీల్లోని నేతలు తీవ్రంగా పోటీ పడుతున్న నేపథ్యంలో ఏ పార్టీ నుంచి ఏ నాయకుడు పెద్దల సభలో అడుగుపెడతారోనన్నది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో కాంగ్రెస్‌తో పాటు ఆ పార్టీ మిత్రపక్షమైన సీపీఐ, ప్రతిపక్ష బీఆర్ఎస్ ఉమ్మడి ఓరుగల్లుకు ప్రాధాన్యమివ్వబోతున్నాయని, ఆయా పార్టీలకు చెందిన ముగ్గురు నేతలకు అవకాశం రాబోతోందన్న ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ నుంచి పలువురు నేతలు పోటీపడుతుండగా సీఎం రేవంత్ వేం నరేందర్‌రెడ్డివైపు మొగ్గుచూపుతున్నారని, సీపీఐ నుంచి ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ నుంచి మాజీమంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ పేర్లు పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఏదేమైనా.. పలు సమీకరణల నేపథ్యంలో 'మనోళ్లు ముగ్గురు' పెద్దల సభలో అడుగుపెట్టబోతున్నారంటూ చర్చ జరుగుతోంది.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ సీటు.. రాజకీయాల్లో హీటును పెంచుతోంది. ఏ పార్టీ ఎవరికి అవకాశమిస్తుందోనన్న ఉత్కంఠను రేపుతోంది. అయితే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో పాటు తాజాగా కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా సీపీఐకి లభించే ఒక్క ఎమ్మెల్సీ సీటు కూడా ఓరుగల్లు నేతకే దక్కుతుందని.. తద్వారా మూడు పార్టీల నుంచి ముగ్గురు ఓరుగల్లు నేతలకు మండలిలో కాలుబెట్టే అవకాశం రాబోతందన్న ప్రచారం పొలిటికల్ సర్కిల్‌లో చక్కర్లు కొడుతోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తులో భాగంగా వరంగల్ ఎంపీ సీటును సీపీఐ పట్టుపట్టింది. అయితే అప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో ఎంపీ టికెట్ వరంగల్ సీపీఐకి చేజారింది. ప్రస్తుతం పొత్తులో భాగంగా కేటాయిస్తున్న ఎమ్మెల్సీ సీటును వరంగల్ నేతలకే ఇవ్వాలనే ఒత్తిడి అధిష్ఠానంపై ఉండటం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కాంగ్రెస్ ఎమ్మెల్సీ సీటుపై అరడజను మంది ఓరుగల్లు నేతలు ఆశలు పెట్టుకున్నప్పటికి సీఎం రేవంత్‌రెడ్డి వేం వైపే మొగ్గుచూపుతున్నారనే చర్చ జరుగుతోంది. ఇక టీడీపీలో ఉన్నప్పుడు వేం నరేందర్‌రెడ్డి చేజారిన ఎమ్మెల్సీ సీటు ఈ సారి దక్కుతుందా అనే చర్చ కాంగ్రెస్‌లో జోరుగా సాగుతోంది. ఇక ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ఒక ఎమ్మెల్సీ సీటు రానుండగా.. ఉమ్మడి జిల్లా కు చెందిన ఒక ముఖ్యనేతకు దక్కనుందని ప్రచారం జరుగుతుండగా.. దీనిపై ఆ పార్టీలో డైలమా నడుస్తోంది.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలో ఓరుగల్లుకే పార్టీల ప్రాధాన్యం!

ఎమ్మెల్సీ సీటుపై సీపీఐ నజర్..

ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైంది. అయితే శాసనసభలో బలాబలాల దృష్ట్యా మిత్రపక్షాలతో కలిపి అధికార కాంగ్రెస్ పార్టీకి నాలుగు ఎమ్మెల్సీ సీట్లు దక్కే అవకాశం ఉంది. అయితే ఇందులో ఒక సీటు సీపీఐకి ఇవ్వాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇస్తామని హమీ ఇచ్చారని, ఈసారి ఒక సీటు పక్కగా ఇవ్వాలని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కే.నారాయణ ఇటీవల వరంగల్ పర్యటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా ఒక సీటుకు సుముఖంగా ఉండటంతో వరంగల్‌కే ఆ ఒక్క సీటు ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తుంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తులో భాగంగా వరంగల్ ఎంపీ సీటు కోసం సీపీఐ తీవ్రంగా ప్రయత్నాలు చేసింది. సీపీఐ బలోపేతానికి విశేషంగా కృషి చేసిన బీఆర్.భగవాన్‌దాస్ కుమారుడు బీఆర్.లెనిన్‌కు ఎంపీ టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానంపై సీపీఐ నేతలు ఒత్తిడి తెచ్చారు. అయితే అప్పుడున్న రాజకీయ సమీకరణాల

మిగతా 7వ పేజీలో..

- వరంగల్ నేతలకు ఇచ్చేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కసరత్తు
- పొత్తులో భాగంగా వచ్చే సీటును ఉమ్మడి జిల్లా వాసికి కేటాయించే యోచనలో సీపీఐ
- వేం వైపే సీఎం మొగ్గు
- గతంలో చేజారిన అవకాశాన్ని.. ఇప్పుడు ఇవ్వాలన్న భావనలో రేవంత్
- గులాబీలో డైలమా.. ఇద్దరు నేతల్లో ఒకరికి చాన్స్
- ఉత్కంఠగా మారిన ఎమ్మెల్సీ టికెట్ల కేటాయింపు



టౌన్‌ప్లానింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ఎల్ఆర్ఎస్‌ల పరిశీలనలో పురోగతి అవసరం

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- వార్డు ఆఫీసర్లు పూర్తి చేసిన దరఖాస్తుల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బల్దియా పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో పురోగతి అవసరమని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలనలో వేగం పెంచాలని అన్నారు. ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బల్దియా ప్రధాన కార్యాలయంతో కాజీపేట, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది ప్రతీరోజు 50 దరఖాస్తులను పరిశీలించే విధంగా ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఏసీపీలు, రజిత, నస్రీన్, ఖలీల్, శ్రీనివాస్‌రెడ్డి, ఇర్షాద్ పాల్గొన్నారు.



ఏవీవీ కళాశాల కేంద్రంలో పరీక్ష రాయడానికి సిద్ధంగా ఉన్న విద్యార్థులు

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

- సెంటర్ల వద్ద విద్యార్థులు, బంధువుల కోలాహల
- వరంగల్ జిల్లాలో 95.7, హనుమకొండ జిల్లాలో 97 శాతం హాజరు
- ఇద్దరిని డీబార్ చేసిన బోర్డు పరిశీలన బృందాలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లాలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ జిల్లాలో 95.7శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, హనుమకొండ జిల్లాలో 97 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఇంటర్ బోర్డు నుంచి వచ్చిన ప్రత్యేక పరిశీలన బృందాలు మొదటి రోజే తనిఖీలు నిర్వహించి ఇద్దరు విద్యార్థులను డీబార్ చేశారు. వరంగల్ ములుగురోడ్‌లోని ఎల్బీ కళాశాల కేంద్రంలో ఒకరిని డీబార్ చేయగా, హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరో విద్యార్థిని డిబార్ చేశారు. మొదటి పరీక్ష కావడటంతో పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 8 గంటల నుంచే సందడి నెలకొంది. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను సెంటర్ల వద్దకు తీసుకువచ్చి వారికి కేటాయించిన గదుల్లోకి దగ్గరుండి పంపించడం కోలాహలంగా కనిపించింది. వరంగల్‌లోని ఏవీవీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఇటీవలే ప్రమాదానికి గురైన విద్యార్థి వాకర్ సహాయంతో పరీక్షకు హాజరయ్యాడు.

వరంగల్ జిల్లాలో జనరల్ విభాగంలో 5,372 మందికి గాను 5,175 మంది హాజరు కాగా, వొకేషనల్ విభాగంలో 894 మందికి గాను 824 మంది హాజరయ్యారు. మొత్తంగా 6,266 మందికి గాను 5,999 మంది హాజరు కాగా 267 మంది గైర్హాజరయ్యారు. . హనుమకొండ జిల్లాలో జనరల్ విభాగంలో 19,412 మంది విద్యార్థులకు గాను 596 మంది గైర్హాజరుకాగా 18,815 మంది హాజరయ్యారు. ఇక వొకేషనల్ విభాగంలో 1,134 మందికి గాను 1,057 మంది హాజరయ్యారు. మొత్తంగా 20,546 మంది విద్యార్థులకు గాను 19,872 మంది విద్యార్థులు హాజరు కాగా 673 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కాగా నగరంలో ఏర్పాటు చేసిన పలు పరీక్ష కేంద్రాలను సీపీ అంబర్ కిషోర్ ఝా సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. మొదటి రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పరీక్షలు ప్రశాంతగా ముగిశాయని డీఐఈవోలు డాక్టర్ జి. శ్రీధర్‌సుమన్, ఏ. గోపాల్ పేర్కొన్నారు.



హనుమకొండలోని ఓకేంద్రం వద్ద విద్యార్థినులు

పరీక్ష కేంద్రాలను సందర్శించిన సీపీ

వరంగల్ క్రైం: ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సందర్శించి బందోబస్తును పరిశీలించారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. పరీక్షలు జరిగే సమయంలో పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక ఇన్‌స్పెక్టర్లకు పలు సూచనలు చేశారు.

గుడుంబా నిర్మూలనే ధ్యేయంగా..

- నెల పాటు ఎక్సైజ్ శాఖ స్పెషల్ డ్రైవ్
- 771 కేసుల్లో 823 మంది అరెస్టు.. 137 వాహనాలు సీజ్ : డీసీ

వరంగల్ క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాను గుడుంబా రహిత జిల్లాగా మార్చే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళుతున్నట్లు ఎక్సైజ్ ఉమ్మడి వరంగల్ జిల్లా డిప్యూటీ కమిషనర్ జి. అంజన్‌రావు తెలిపారు. ఉమ్మడి వరంగల్‌లో గుడుంబా ప్రభావిత ప్రాంతాలైన మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్ జిల్లాల్లో రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలహాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు జనవరి 15 నుంచి ఫిబ్రవరి 15 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. ఈ డ్రైవ్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 771 కేసులు నమోదు చేసి 823 మంది అరెస్టు చేశామన్నారు. గుడుంబా తరలిస్తున్న 137 వాహనాలను సీజ్ చేసి, 746 మందిని బైండోవర్ చేశామన్నారు. నేరాలు చేస్తూ పట్టుబడ్డ 45 మందిని బ్రీచ్ కేసు కింద అరెస్టు చేసి నిందితులతో ప్రభుత్వానికి రూ.8లక్షల 75వేలను చేశామన్నారు. మారుమూల ప్రాంతాల్లోని పల్లెలు, తండాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, నాటు సారా, బెల్లం విక్రయించడం, సరఫరా చేస్తూ పట్టుబడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని అంజన్‌రావు హెచ్చరించారు.

బ్రాండ్ల పేరిట దందా

మార్కెట్‌లో నకిలీ పురుగుల మందులు

- కారులో సరఫరా చేస్తూ పట్టుబడ్డ నిందితుడు
- అతడి సమాచారంతో మరో నలుగురు పట్టివేత
- రూ.32 లక్షల విలువైన నకిలీ పురుగుల మందు, లేబుల్స్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నకిలీ మందులు, నిందితులతో సీపీ అంబర్‌కిషోర్ ఝా, పోలీసులు

వరంగల్ క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ కంపెనీల లేబుల్స్ వినియోగించి నకిలీ పురుగు మందులను విక్రయిస్తున్న ముఠా సభ్యుల గుట్టును వరంగల్ కమిషనరేట్ పోలీసులు రట్టు చేసినట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం.. మట్టెవాడ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా రెండు రోజుల కిందట వరంగల్ గోపాలస్వామి గుడి ప్రాంతంలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఓ కారులో ఉన్న పురుగు మందుల డబ్బాలను గుర్తించి అందులో ఉన్న మహరాష్ట్రలోని బల్లారి జిల్లా కురుగోడు ప్రాంతానికి చెందిన కాట్రగౌడ భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించగా నకిలీ పురుగుల మందులు విక్రయిస్తున్నట్లుగా అంగీకరించాడు. కేసు నమోదు చేసిన మట్టెవాడ పోలీసులు.. భాస్కర్‌రెడ్డి ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లోని చర్లపల్లిలో ఉన్న గోదాముపై దాడిచేసి బెయర్, టాటా, కోర్టెవాతో పాటు మరో నాలుగు కంపెనీల లేబుల్స్‌తో ఉన్న రూ.32 లక్షల విలువ చేసే నకిలీ పురుగుమందులు, గడ్డి మందులను, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే హైదరాబాద్ కుషాయిగూడకు చెందిన పిల్ల నాగ వెంకటరంగారావు, లకిడీకపూల్‌కు చెందిన ముద్దంగుల ఆదిత్య, హైదరాబాద్‌కు చెందిన పిట్ల నవీన్, మిర్యాలగూడకు చెందిన దూదిమెట్ల శ్రీధర్‌లను అదుపులోకి తీసుకొని విచారించారు. పురుగుల మందులకు కావాల్సిన ముడిసరుకులను కొనుగోలు చేసి డిమాండ్ ఉన్న కంపెనీ పేర్లతో మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్‌జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీలు మధుసూదన్, నందిరాంనాయక్, ఇన్‌స్పెక్టర్లు సార్ల రాజు, గోపి, ఎస్సై భానుప్రకాశ్, లచ్చయ్య, సాంబయ్య, ఏఎఓ సల్మాన్‌పాషా, కానిస్టేబుళ్ల సురేశ్, సాంబరాజు, సురేందర్, రమేశ్‌లను సీపీ అభినందించారు.



కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ నారాయణ స్వామి

ఫేస్ టు ఫేస్

కార్మికుల కోసం సంక్షేమ కార్యక్రమాలు

ఆంధ్రజ్యోతి : కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారు?

అసిస్టెంట్ కమిషనర్ : శాఖ ఆధ్వర్యంలో సంక్షేమ బోర్డు ద్వారా సామాజిక, ఆర్థిక అభివృద్ధి పథకాలు అసంఘటిత కార్మికుల కోసం కార్యక్రమాలను చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : ఆ కార్యక్రమాలు ఏంటీ?

అసిస్టెంట్ కమిషనర్: నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా భూమి నుంచి పునాదులు తీయడం మొదలుకొని తాపీ మేస్త్రీలు, కూలీలు, సెంట్రింగ్ వర్కర్లు వడ్రంగి, తదితర పనులు చేస్తున్న వారందరినీ లబ్ధిదారులుగా చేర్చి వివిధ పథకాలు అమలు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇంకా ఏమైనా ఉన్నాయా..?

అసిస్టెంట్ కమిషనర్ : ప్రమాదకరమైన పనుల్లో పని చేసే కార్మికులకు ప్రమాదవశాత్తు మరణిస్తే బీమా సౌకర్యంతో పాటు అంగవైకల్యం పొందిన వారికి ఆర్థిక సహాయం అందజేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: కార్మికుల కోసం సంక్షేమ కార్యక్రమాలు ఏమున్నాయి ..?

అసిస్టెంట్ కమిషనర్ : నిర్మాణ రంగంలో కార్మికులను నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ ద్వారా కార్మికులకు సెంట్రింగ్ కట్టడం, ఇటుకల తయారీ, పెయింటింగ్, వెల్డింగ్ లాంటి పనులను చేయడానికి అవసరమైన శిక్షణ ఇప్పిస్తున్నాం.

- బాలసముద్రం (ఆంధ్రజ్యోతి)

అకుట్ అధ్యక్ష, కార్యదర్శిగా వెంకట్రామిరెడ్డి, రాజ్‌కుమార్

కేయూ క్యాంపస్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి, ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లు గెలుపొందారు. 2025-27 రెండేళ్ల కాలానికి జరిగిన అకుట్ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీపడిన ప్రొఫెసర్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డిపై ప్రొఫెసర్ బి.వెంకట్రామిరెడ్డి 8 ఓట్లతో గెలుపొందగా, జనరల్ సెక్రటరీ పదవికి పోటీపడిన డాక్టర్ పోడేటి శ్రీనివాస్‌పై ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ 17ఓట్ల మెజారిటీతో నెగ్గారు. అధ్యక్ష పదవికి మల్లికార్జున్‌రెడ్డికి 33 ఓట్లు రాగా, వెంకట్రామిరెడ్డికి 41 ఓట్లు వచ్చాయి. అలాగే జనరల్ సెక్రటరీ పదవికి డాక్టర్ పోడేటి శ్రీనివాస్‌కు 29 ఓట్లు రాగా, ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌కు 46 ఓట్లు వచ్చాయి. బుధవారం కేయూ సెనెట్ హాల్‌లో అకుట్ ఎన్నికల అధికారి, టీచింగ్ విభాగం ఏఆర్ సీహెచ్. ప్రణయ్‌కుమార్ నేతృత్వంలో ఓట్ల లెక్కింపు చేపట్టి అధికారులు ఫలితాలను ప్రకటించారు.

అకుట్ ఉపాధ్యక్షురాలిగా కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ వి. రాము, కోశాధికారిగా డాక్టర్ వి.రాము, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వర్సిటీ కళాశాల నుంచి డాక్టర్ ఎం. స్వర్ణలత, డాక్టర్ పి.వెంకటయ్య, ఫార్మసీ కళాశాల నుంచి డాక్టర్ షయేదా, ఇంజనీరింగ్ కళాశాల నుంచి కె.స్వర్ణలత, వుమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఎం. వేణుగోపాల్‌రెడ్డి, సుబేదారి యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి ప్రొఫెసర్ ఎస్.జ్యోతి, సుబేదారి పీజీ కళాశాల నుంచి ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల నుంచి డాక్టర్ ఇ.హరికృష్ణలు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారి ప్రణయ్‌కుమార్ ప్రకటించారు. ఎన్నికైన కార్యవర్గానికి ధ్రువపత్రాలను అందచేశారు. అకుట్ ఎన్నికల్లో అధ్యక్షపదవికి ఇద్దరికీ ఓటు వేయడంతో ఒక్క ఓటు చెల్లనిదిగా ప్రకటించారు. కార్యవర్గం వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలను కలిశారు. నూతన కార్యవర్గాన్ని యూనివర్సిటీ ప్రొఫెసర్లు తదితరులు అభినందించారు.



గెలుపొందిన అకుట్ కార్యవర్గానికి ధ్రువపత్రాలు ఇస్తున్న ఎన్నికల అధికారులు

16న స్టేషన్‌ఘన్‌పూర్‌కు సీఎం

- రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న రేవంత్ రెడ్డి
- వివరాలు వెల్లడించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 16న స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి రానున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘన్‌పూర్ మునిసిపాలిటీని కూడా సీఎం లాంచనంగా ప్రారంభించనున్నారని, ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి, ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజనల్ కాంప్లెక్స్ నిర్మాణానికి, యంగ్ ఇండియా ఇంటర్నేషినల్ స్కూల్ నిర్మాణానికి, ఘన్‌పూర్‌లో జనరల్ డిగ్రీ కళాశాల, ఆర్ఎస్ ఘన్‌పూర్ -నవాబుపేట మెయిన్ కెనాల్‌కు లైనింగ్ పనులకు, ఘన్‌పూర్ మండల కేంద్రంలో విద్యుత్ డీఈఈ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తారన్నారు. అదే విధంగా ధర్మసాగర్ మండలంలోని రాయగూడెంలో నెలకొల్పిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం, చిలుపూరు మండలంలోని కొండాపూర్‌లో, రఘునాథపల్లి మండలంలోని కుర్చపల్లి, మల్లికుదుర్ల గ్రామాల్లో నెలకొల్పనున్న సబ్‌స్టేషన్ల నిర్మాణానికి, నియోజకవర్గంలో వీఆర్ రోడ్ల విస్తరణకు, ఏర్పాటుకు సీఎం శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో రూ 2కోట్లతో నిర్మించనున్న బంజార భవనం నిర్మాణానికి, రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26న ప్రతీ మండలంలోని ఒక్కో గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి ఆరు పథకాలు అమలు చేశారని తెలిపారు. ఏడు మండలాలలోని ఏడు గ్రామల్లో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించనున్నారని అన్నారు. ఇన్ని అభివృద్ధి పనులను చేపడుతున్నప్పటికీ ప్రతిపక్షాలకు చెందిన నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం పైన చౌకబారు విమర్శలు చేయడం సరికాదని మానుకోవాలని సూచించారు. ఘన్‌పూర్ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నానని తెలిపారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన అనంతరం సీఎం బహిరంగసభ ఉంటుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ లావణ్యా-శిరీష్ రెడ్డి, నాయకులు బెలిదె వెంకన్న, నరేందర్ రెడ్డి, గుజ్జరి రాజు, అంబటి కిషన్‌రాజ్, గన్ను నర్సింహులు, అన్నం బ్రహ్మారెడ్డి, రాపోలు మధుసూదన్ రెడ్డి, మనోజ్ రెడ్డి, మామిడాల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రాయపర్తి ఎస్‌బీఐ ఎదుట
బాధితుల ఆందోళన

- బంగారం లేదా ధర కట్టిస్తామన్న బ్యాంకు అధికారులు
- జాప్యం చేయడంపై మండిపాటు



రాయపర్తి ఎస్‌బీఐలో ఆందోళన చేస్తున్న బాధితులు

రాయపర్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో జరిగిన బంగారం చోరీ బాధితులు రోడ్డెక్కుతున్నారు. బ్యాంకులో బంగారాన్ని కుదవపెట్టిన 496 మంది బాధితులు బ్యాంకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలల కిందట బంగారం పోయిన నాటినుంచి ఇప్పటివరకు బంగారానికి బంగారం, లేదా నష్ట పరిహారంగా ఆ రోజు రేటును కట్టిస్తామని బాధితులకు నచ్చచెప్పి ఎస్‌బీఐ అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో ఆగ్రహం చెందిన మండలంలోని మైలారం, మహబూబ్‌నగర్, రాయపర్తి, పెర్కవేడుతో పాటు పలు గ్రామాలకు చెందిన పలువురు బాధితులు బుధవారం రాయపర్తి ఎస్‌బీఐ బ్యాంకుల ఎదుట ఆందోళనకు దిగారు. తమ బంగారాన్ని ఇంకా వెతికి ఇవ్వడం లేదని, బ్యాంకు అధికారులు చెప్పినట్లు బంగారం బదులు బంగారం ఇస్తామని చెప్పి దాటవేస్తున్నారని ఆరోపించారు. అధికారుల మాటలకు చేతలకు పొంతన ఉండడం లేదని, తమ బంగారం తమకు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. బంగారం దొంగిలించినప్పటికీ రేటు కట్టిస్తామని బ్యాంకు అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుత రేటునే కట్టించాలని, అప్పటి రేటు ఎలాంటి కట్టిస్తారని ప్రశ్నించారు. ఎప్పుడు నష్టపరిహారం ఇస్తారో అప్పటి బంగారం రేటే ఇవ్వాలి లేదా మా బంగారం ఆర్నిమెంట్‌లా అందించాలని డిమాండ్ చేశారు. దాదాపు 30 మంది ఒకేసారి బ్యాంకులోకి వచ్చి ఎస్‌బీఐలో ఆందోళన చేయడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది.

నిబంధనల ప్రకారం అందిస్తాం..:

రామకృష్ణ, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్

ఎస్‌బీఐలో బంగారం కుదవబెట్టి బాధితులుగా ఉన్న వారికి తులం బంగారానికి గ్రాము తరుగు తీసివేసి తొమ్మిది గ్రాముల బంగారాన్ని లెక్కగట్టి రూ.77,710 చొప్పున చెల్లిస్తాం. బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నిబంధనల ప్రకారం నడుచుకుంటాం. బాధితుల సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

కమ్యూనిటీ మీడియేటర్ల ఆధ్వర్యంలో
కేసుల పరిష్కారం జరగాలి

వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ

వరంగల్ లీగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని వ్యక్తుల మధ్య, కుటుంబాల్లో వచ్చే తగాదాలను పరిష్కరించడానికి సామాజిక వర్గ స్థాయిలో (కమ్యూనిటీ మీడియేటర్లు)వర్గ స్థాయిలో పరిష్కారం జరుగాలని వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ సూచించారు. బుధవారం న్యాయసేవా సదన్‌లో జరిగిన కమ్యూనిటీ మీడియేటర్లను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలోని వివాదాలు, పోలీసు స్టేషన్లు, కోర్టుల దాకా వెళ్లకుండా కమ్యూనిటీ మీడియేటర్లు చొరవ తీసుకోవాలని ఆమె అన్నారు. కోర్టులు, పోలీసుస్టేషన్లు సమస్యల పరిష్కారం కంటే మానవ సంబంధాలు దెబ్బతింటాయని, ఇది సమాజానికి హానికరమని ఆమె పేర్కొన్నారు. ఈ నెల 8న రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ హనుమకొండకు వస్తున్నారని, ఆ రోజు ఉదయం 9 గంటలకు కాళోజీ కళాక్షేత్రంలో కమ్యూనిటీ మీడియేటర్లకు సంబంధించిన సమావేశం ఉంటుందన్నారు. వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. సాయికుమార్, వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, మాతంగి రమేష్‌బాబు, వివిధ సామాజిక వర్గాలకు చెందిన కమ్యూనిటీ మీడియేటర్లు పాల్గొన్నారు.

బల్లార్షా ఎక్స్‌ప్రెస్ రైలు పునఃప్రారంభం

కాజీపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మూడో రైల్వే లైన్‌ల నిర్మాణ పనుల దృష్ట్యా కొంతకాలంగా నిలిపేసిన బల్లార్షా ఎక్స్‌ప్రెస్ రైలు గురువారం నుంచి పునఃప్రారంభం కానుందని కాజీపేట రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు (17035/36) కాజీపేట జంక్షన్- బల్లార్షా రైల్వే స్టేషన్‌ల మధ్య ఈ నెల 6 నుంచి కాజీపేటలో ప్రతీ రోజు రాత్రి 10. 50 నిమిషాలకు బయలు దేరి తెల్లవారుజామున 3. 15 నిమిషాలకు బల్లార్షాకు చేరుకుంటుంది. తిరిగి బల్లార్షా రైల్వే స్టేషన్‌లో ప్రతిరోజూ తెల్లవారుజామున 3.50కి బయలు దేరి కాజీపేటకు ఉదయం 8. 50 నిమిషాలకు చేరుకుంటుంది. బల్లార్షా వైపు వెళ్లే రైల్వే ప్రయాణికులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు తెలిపారు.

వ్యాధుల నివారణకు డీఎన్ఏ కీలకం

- కాకతీయ వర్సిటీ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- జంతుశాస్త్ర విభాగంలో జాతీయ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సవాల్‌గా మారుతున్న వ్యాధుల నివారణ, చికిత్సకు డీఎన్ఏ కీలమని కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం కేయూ జంతుశాస్త్ర విభాగం నేతృత్వంలో 'యూజేస్ రీకోంబినేట్ డీఎన్ఏ టెక్నాలజీ ఇన్ హెల్త్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ప్రతాప్‌రెడ్డి జ్యోతి ప్రజలన చేసి సదస్సులో మాట్లాడారు. డీఎన్ఏకు వ్యాధుల నివారణ, చికిత్సలో అపరిమితమైన అవశ్యకత ఉందన్నారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ పూండి ఎస్.రంగరాజన్ కీలక ఉపన్యాసం చేశారు. దేశం వ్యాక్సిన్ల హబ్‌గా నిలుస్తోందన్నారు. బయాలజికల్ ఎవాన్స్ లిమిటెడ్, భారత్ బయోటెక్, సేరం ఇండియా, శాంతా బయోటెక్‌లు కరోనా సమయంలో కోవ్యాక్సిన్, కోవిషీల్డ్, హెపటైటీస్-బి, పల్స్ పోలియో చుక్కలను ఉత్పత్తి చేశారని గుర్తుచేశారు. అన్ని రోగాలకు ఒకే వ్యాక్సిన్‌ను కనుకునే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. దేశీయంగా వ్యాక్సిన్ల వృద్ధితో ఖర్చు తగ్గుతోందన్నారు. దీనిపై మరిన్ని విశిష్టమైన పరిశోధనలు రావాలని ఆకాంక్షించారు. యువ పరిశోధకులు ముందుకు రావాలన్నారు. అకాడమీ, ఇండస్ట్రీల మధ్య సయోధ్య మంచి ఫలితాలను ఇస్తోందన్నారు. ఈ వర్క్‌షాప్ ప్రారంభ సదస్సుకు జువాలజీ హెడ్ షమిత అధ్యక్షత వహించగా సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు, బీవోఎస్ ప్రొఫెసర్ వై. వెంకయ్య, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ, ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ సుజాత, కనీజ్ ఫాతీమా తదితరులు పాల్గొన్నారు.

కేయూ దూరవిద్య
పరీక్షల్లో 27 మంది డీబార్

కేయూ క్యాంపస్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం పీజీ పరీక్షల్లో బుధవారం 27 మంది మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడగా తనిఖీ అధికారులు గుర్తించి డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ తెలిపారు. వర్సిటీ క్యాంపస్‌లోని విద్యా కళాశాలలో 16, వరంగల్‌లోని సీకేఎం కాలేజీలో 10, ఎల్‌బీ కళాశాల ఒక్కరూ డీబారైనట్లు పేర్కొన్నారు. కాగా, బుధవారం పరీక్షల నిర్వహణ తీరును కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజ, డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు ఏఎస్ఎం కళాశాలలో తనిఖీలు పరిశీలించారు.

నేడు దంత వైద్య దినోత్సవం.. వాకథాన్‌కు ఏర్పాట్లు

వరంగల్ మెడికల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ డెంటల్ అసోసియేషన్ వరంగల్ బ్రాంచ్ నేషనల్ డెంటిస్ట్ డే సందర్భంగా ఈ నెల 6న గురువారం దంత సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వాకథాన్ నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి, డాక్టర్ వేణుయాదవ్ తెలిపారు. ముఖ్య అతిథులుగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్ నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు దంతవైద్యులు, సిబ్బందితో వాకథాన్ ఉంటుందని తెలిపారు.

మిర్చి ధర పెరిగిందోచ్..

సింగిల్ పట్టి రకానికి రూ.41,000

వరంగల్ వ్యవసాయం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మిర్చి ధర పెరిగింది. బుధవారం సింగిల్‌పట్టి రకం మిర్చికి క్వింటాకు రూ.41.000 ధర పలికింది. ఇది ఈ సీజన్‌లోనే అత్యధికం. మార్కెట్‌కు వివిధ రకాల మిర్చి బస్తాలు సుమారు 50 వేల వరకు రాగా, అందులో పది బస్తాల సింగిల్‌పట్టి రకం వచ్చాయి. ఆ మిర్చిని రూ.41.000 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. అదేవిధంగా దేశీ రకం మిర్చికి రూ.28,500, దీపిక రకం మిర్చికి రూ.17,100, వండర్‌హాట్ రూ.16,700, తేజా రకం రూ.14,000, యూఎస్ 341 రకానికి రూ.14,600లు ధర పలికింది.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు(బిల్టీరకం)	2311	2100
పల్లికాయ (సూక)	6850	6500
పల్లికాయ (పచ్చిది)	5000	5200
కందులు	6990	5540
పెసళ్లు	6840	4645
పత్తి	6900	5800
తేజ మిర్చి	14000	9000
డిడి	13000	12500
వండర్‌హాట్	16700	11500
ఎల్లో మిర్చి	17000	15000
యూఎస్341	14600	9500
దేశీ	28500	25500
సింగిల్‌పట్టి	41000	40000
దీపిక	17100	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ఇరిగేషన్ ఈఎన్‌సీ వాహనాన్ని చుట్టుముట్టిన రైతులు

చలివాగు నుంచి నీటి లిఫ్టింగ్ నిలిపేయాలని డిమాండ్

శాయంపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చలివాగు ప్రాజెక్ట్ నుంచి నీరు లిఫ్ చేయడం వల్ల మినిమం లెవెల్స్ తగ్గిపోయి పంటలకు నీరందడం లేదని రైతులు ఇరిగేషన్ ఈఎన్‌సీ (ఇంజనీర్ ఇన్ చీఫ్) అనిల్ కుమార్ వాహనాన్ని అడ్డుకుని చుట్టుముట్టారు. చలివాగు ప్రాజెక్టు నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్‌కు దేవాదుల పంప్‌హౌస్ నుంచి రెండు మోటార్ల ద్వారా నీరు లిఫ్టింగ్ చేస్తారు. ఈ నేపథ్యంలో ఈఎన్‌సీ అనిల్‌కుమార్, అడ్వైజర్ పెంటారెడ్డి, వరంగల్ సీఈ అశోక్ కుమార్, ఎస్‌ఈలు వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, ఈఈలు ప్రసాద్, సునిత, డీఈఈ, ఏఈఈలు చలివాగులో నీటి నిల్వలు తగ్గడంపై ఆరా తీసేందుకు బుధవారం మండలంలోని జోగంపల్లి శివారు దేవాదుల పంప్‌హౌస్ వద్దకు వచ్చారు. అనంతరం చలివాగు ప్రాజెక్టు తూము పరిశీలించి, నీటి విడుదల నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో విషయం తెలుసుకున్న చలివాగు పరివాహక ప్రాంత రైతులు పంప్‌హౌస్ వద్దకు చేరుకుని అధికారులు బయటకు వెళ్లకుండా గేటుకు తాళం వేసి, ధర్నా చేశారు. రెండు మోటార్ల ద్వారా ధర్మసాగర్‌కు నీరు లిఫ్ట్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో కనీసం 15 ఫీట్ల నీరు ఉన్న తర్వాతే లిఫ్టింగ్ చేయాలని, లేకుంటే నీరందక తమ పంటలు ఎండిపోతున్నాయని, ప్రస్తుతం 12 ఫీట్లు నీరు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మోటార్లు నిలివేయకుంటే తమ ప్రాణాలు అడ్డుపెట్టైనా పంటలను కాపాడుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలో అధికారులు సమాధానం ఇవ్వడంలేదని ఈఎన్‌సీ వాహనాన్ని చుట్టుముట్టి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో స్పందించిన ఈఎన్‌సీ రెండురోజుల్లో మోటార్లు నిలివేస్తామని, అనంతరం చలివాగులో కనీస లెవెల్స్ పెరిగిన తర్వాత ధర్మసాగర్‌కు లిఫ్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించి, అధికారులను వెళ్లనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు చక్రపాణి, చంద్రప్రకాష్, ప్రకాష్‌రెడ్డిలు రైతుల పక్షాన అధికారులతో మాట్లాడారు.



ఇరిగేషన్ ఈఎన్‌సీ వాహనాన్ని అడ్డుకుంటున్న రైతులు

పాల కల్తీపై చెకింగ్

- విజయ డెయిరీ బ్రాండ్‌ను వాడుకుంటున్న ప్రైవేటు డెయిరీలు
- పాల కల్తీపై వినియోగదారుల మండలి అవగాహన

హనుమకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, హనుమకొండలలో వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పాలలో కల్తీ, వినియోగదారుల చైతన్యంపై హనుమకొండ విజయ డెయిరీ, వరంగల్ పోచమ్మమైదాన్ ప్రాంతంలో పాల నాణ్యతపై టెస్ట్ చెక్‌లు జరిగాయి. హనుమకొండ విజయా డెయిరీలో మండలి సేకరించిన 19 ప్రైవేటు డెయిరీల పాల నాణ్యతా పరీక్షలు నిర్వహించారు. పాల ప్యాకెట్‌లపై ముద్రించిన ప్రకారం వెన్న శాతం, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండటానికి కలిపే హైడ్రోజన్ పెరాక్సైడ్, కాస్టిక్ సోడాలకు సంబంధించిన నాణ్యతా పరీక్షలను నిర్వహించారు. ఈ టెస్ట్‌చెక్ కార్యక్రమంలో వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్‌లతో పాటు విజయా డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రవణ్ కుమార్, మేనేజర్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. విజయా డెయిరీ పోలికలతో ఉన్న ప్రైవేటు డెయిరీ పాలలో కాస్టిక్ సోడా కలిపినట్టు తేలింది. ఆలాగే ఆరు డెయిరీలు తమ ప్యాకెట్లపై ముద్రించిన ప్రకారం వెన్నశాతం పాలలో లేదని స్పష్టమైంది. ఈ కార్యక్రమంలో వినియోగదారుల మండలి రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రావుల రంజిత్ కుమార్, నల్లా రాజేందర్, చిలువేరు ప్రవీణ్, నగర కార్యదర్శి బేతి రాజేష్‌లు పాల్గొన్నారు. అనంతరం వరంగల్ పోచమ్మమైదాన్ ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్‌లతో పాటు ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ మౌనిక పాల్గొన్నారు. ప్యాకెట్ పాల నాణ్యత, పాలప్యాకెట్‌లపై ఉండాల్సిన సమాచారం, పాల పాకెట్లపై పోర్టిఫైడ్ ముద్రలు, పాకెట్ పాల నిల్వ సమాచారం తదితర అంశాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు.



హనుమకొండలోని విజయ డెయిరీలో పాలను చెక్ చేస్తున్న వినియోగదారుల మండలి ప్రతినిధులు

మహబూబాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మామునూరుకు విమానాశ్రయం, కాజీపేట్‌లో కోచ్ ఫ్యాక్టరీ తయారీ కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు స్వాగతిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి స్వతంత్ర జిల్లాగా ఆవిర్భవించిన గిరిజన ప్రాబల్య మానుకోట ప్రాంతంలో ఉపాధి అవకాశాలు లేక ఉద్యోగాలకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్న నిరుద్యోగులు సొంత జిల్లాలో అపార ప్రభుత్వ స్థలాలను పాలకులు విస్మరిస్తున్నారని మండిపడుతున్నారు. తొలుత దశాబ్దాల తెలంగాణ ఆశల కాజీపేట్ రైల్ కోచ్ ఫ్యాక్టరీ చివరకు కేంద్రం చలువతో రూ.530 కోట్ల వ్యయంతో నిర్మాణానికి సిద్ధమవుతోంది. తాజాగా, ఏనాటి నుంచో రేపు.. మాపు అంటూ ఊరిస్తూ వచ్చిన మామునూరు ఎయిర్‌పోర్టుకు రాష్ట్ర చొరవ, కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనే ఇచ్చేసింది. ఇక.. మానుకోట జిల్లా ఏ పాపం చేసిందని ఉపాధి అవకాశాల కల్పన విషయంలో పాలకులు వివక్ష ఎందుకు చూపుతున్నారని యువత ప్రశ్నిస్తోంది.



డోర్నకల్ రైల్వే జంక్షన్

డ్రైపోర్టుకు మోక్షమెప్పుడో?


- డోర్నకల్‌లో అనువుగా స్థలాలు
- జిల్లాపై పాలకుల వివక్షతో నిరుద్యోగుల గుస్సా
- మంజూరుకు కృషి చేస్తానంటున్న విప్ రాంచందర్‌నాయక్

దావోస్‌లో సీఎం ప్రకటనతో ఆశలు

తెలంగాణలో డ్రైపోర్టు నిర్మించి వేర్‌హౌజ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, రాష్ట్రానికి తీరప్రాంతం లేని లోటును పూడ్చడానికి తెలంగాణ డ్రైపోర్టును మచిలిపట్నం పోర్టుకు రోడ్డు, రైల్వే మార్గాలతో అనుసంధానం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఏడాది జనవరి చివర్లో దావోస్ సదస్సులో చేసిన ప్ర కటన మరోమారు మహబూబాబాద్ జిల్లాలో అభివృద్ధిపై ఆశలు చిగురిం పజేసింది. డ్రైపోర్టు ఏర్పాటుకు భౌగోళికంగా అనువైన ప్రాంతం మానుకోటేనని మేధావి వర్గం స్పష్టం చేస్తోంది. దావోస్‌లో సీఎం ప్రకటనతో తొలుత స్పందించిన ఈ జిల్లాకు చెందిన డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్ తెలంగాణకు రానున్న డ్రైపోర్టును డోర్నకల్‌కు తీసుకువచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

అనువైన ప్రాంతంగా మానుకోట

తీరప్రాంత తమిళనాడు ఆంధ్రప్రదేశ్‌లను కలిపే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న మహబూబాబాద్ జిల్లా మరోపక్క ఉత్తర-దక్షిణ భారతాన్ని అనుసంధానించే గ్రాండ్‌ట్రంక్ రైలు మార్గాల నడుమ కూడా ఉండడంతో ప్రభుత్వ స్థలాలు ఉన్న డోర్నకల్ ప్రాంతం డ్రైపోర్టు ఏర్పాటుకు అనువుగా ఉంటుందని విశ్లేషకుల అభిప్రాయం. స్వరాష్ట్ర ఆవిర్భావంలో డ్రైపోర్టు ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. 2015 సంవత్సరంలో ఉమ్మడి నల్గొండ జిల్లా కోదాడలో డ్రైపోర్టు ఏర్పాటు చేస్తామని అప్పటి రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు సూచనప్రాయంగా ప్రకటించారు. అయితే డ్రైపోర్టు ఏర్పాటుకు కావాల్సిన


డోర్నకల్‌లో డ్రైపోర్టుకు అనుకూలంగా ఉన్న భూములు (ఫైల్)

భూముల రేట్లు కోదాడ ప్రాంతంలో ఆకాశాన్ని అంటుతుండడంతో ఆ ప్రయత్నాలు అప్పట్లోనే నిలిచిపోయాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వ సీఎం రేవంత్‌రెడ్డి దావోస్‌లో ప్రకటనతో మహబూబాబాద్ జిల్లాలో ఆ డ్రైపోర్టు ఏర్పాటు చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

భౌగోళికంగా రేవు పట్టణాలకు చేరువలో..

కోస్తా ప్రాంతాల్లోని ప్రధాన రేవు పట్టణాలైన విశాఖపట్టణం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం తదితర కేంద్రాలకు తెలంగాణలోని మిగతా ప్రాంతాలకంటే భౌగోళికంగా డోర్నకలే అతి సమీపంలో ఉండడం విశేషం. రోడ్డు రవాణా కోణంలో చూస్తే 365/ఏ జాతీయ రహదారి డోర్నకల్ మండలం మీదుగానే వెళ్తుంది. అమరావతి-నాగ్‌పూర్ మధ్య నూతనంగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కూడా డోర్నకల్ మండలం మీదు గా వెళ్తుంది. ప్రస్తుతం మహబూబాబాద్-డోర్నకల్ మధ్య 33 అడుగుల వెడల్పుతో రోడ్డు మార్గం ఉంది. డోర్నకల్ నుంచి రోడ్డు మార్గంలో ఏన్కూరు, తల్లాడ, సత్తుపల్లి మీదుగా పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లి మీదుగా ప్రయాణిస్తే కాకినాడ వస్తుంది. మరో పక్క డోర్నకల్, ఎన్కూరు, తల్లాడ, కల్లూరు, తిరువురు, నూజివీడు, హనుమాన్ జంక్షన్ నుంచి నూతనంగా నిర్మిస్తున్న మచిలీపట్నం పోర్టు వస్తుంది. చెన్నై, కోల్‌కత్తా జాతీయ రహదారి ద్వారా విశాఖపట్టణం, గంగవరం, కృష్ణపట్నం రేవులకు తెలంగాణ నుంచి ఎగుమతులు చేసే అవకాశాలు ఉంటాయి.

డ్రైపోర్టు అంటే..

సముద్ర మార్గం ద్వారా జరిగే ఎగుమతి, దిగుమతులకు సంబంధించిన వస్తువులు ఓడరేవుకు చేరుకుని అక్కడ్నుంచి రోడ్డు, రైలు మార్గాల ద్వారా నిర్దేశిత నగరాలు, ప్రదేశాలకు తరలిస్తారు. వాటికి సంబంధించిన ఎగుమతి, దిగుమతి సుంకాలను కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉండే సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ చూస్తుంది. అలాంటి ప్రక్రియ డ్రైపోర్టులోనూ ఉంటుంది. అయితే డ్రైపోర్టును మాత్రం భూభాగం పైనే ఏర్పాటు చేస్తారు. విదేశాలకు ఎగుమతులు, దిగుమతులు ద్వారా వచ్చిన సరుకులను అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన గోదాంలలో నిల్వ చేస్తారు. ఆ సరుకులు కస్టమ్స్ తనిఖీల అనంతరం రవాణాకు అనుమతులు తీసుకునే అవకాశాలుంటాయి. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్‌లో చేసిన ప్రకటనకనుగుణంగా తెలంగాణలో డ్రైపోర్టు ఏర్పాటు చేయాల్సి వస్తే ఈ రాష్ట్ర జిల్లాల సరిహద్దు ఉత్తర, దక్షిణ రైలు మార్గాల నడుమ ఉన్న డోర్నకల్ రైల్వేస్టేషనే కీలకం గా మారుతుందని చెబుతున్నారు. డోర్నకల్‌లో రైల్వేకు సం బంధించిన విశాలమైన భూములు ఉండడం, ఒకవేళ ఇవి కూడా సరిపోకపోతే ప్రభుత్వం సేకరించేందుకు అనువుగా డోర్నకల్ చుట్టూరా భూములు తక్కువ ధరలకు ఉండడం లాంటివి పరిగణనలోకి తీసుకుంటే డ్రైపోర్టుకు డోర్నకల్ అనువైన స్థలంగా విశ్లేషిస్తున్నారు.

వివిధ దేశాలకు ఎగుమతులు ఇలా..

తెలంగాణ నుంచి ఇప్పటికే గ్రానైట్, పాలిషింగ్ గ్రానైట్, చైనా, జపాన్ దేశాలకు ఎగుమతవుతోంది. ఇంకా బియ్యం, మొక్కజొన్న, మిర్చి, పసుపు, పత్తి తదితర వ్యవసాయ ఉత్పత్తులు, ఫిలిప్పైన్స్, ఇండోనేషియా, థాయిలాండ్, వియాత్నం, మలేషియా, సింగపూర్, ఆస్ట్రేలియా, తూర్పు ఆఫ్రికా దేశాలకు ఎగుమతి జరుగుతున్నాయి. హైదరాబాద్‌లో తయారయ్యే భారీ యంత్ర పరికరాలు కూడా ఎగుమతులు చేసే అవకాశాలు లభిస్తాయి. డ్రైపోర్టుల ద్వారా నిత్యం వివిధ సరుకుల ఎగుమతులు, దిగుమతులు కొనసాగించే కేంద్రానికి అనుసంధానంగా రవాణా కార్యాలయాలు, షిఫ్టుల వారీగా 24 గంటలు పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబాలు ఇలా అన్ని రంగాలకు సంబంధించి మహబూబాబాద్ జిల్లాలో ఉపాధి పొందడానికి అవకాశాలు కలుగుతాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 వేల మందికి పైగా ఉపాధి లభిస్తుంది.

డోర్నకల్‌లో డ్రైపోర్టు ఏర్పాటుకు కృషి చేస్తున్నాను. డ్రైపోర్టు ఏర్పాటుకు ఉన్న అవకాశాలన్నీ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాను. డోర్నకల్‌లో రైల్వే భూములతో పాటు ప్రైవేట్ భూములు, ప్రభుత్వం సేకరించే భూములూ అందుబాటు ధరల్లో ఉన్నాయి. అవసరమైతే ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల ప్రజాప్రతినిధుల మద్దతు తీసుకుంటాను. డోర్నకల్‌కు రైల్వే, జాతీయ రహదారులు కలిగి ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతం డ్రైపోర్టు ఏర్పాటుకు అనువైన ప్రాంతం. శక్తి మేరకు డోర్నకల్‌లో డ్రైపోర్టు ఏర్పాటుకు కృషి చేస్తా.

డ్రైపోర్టు ఏర్పాటుకు కృషి
జాటోత్ రాంచందర్‌నాయక్
ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే




ధర్మకంచ జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు లేఖలు అందిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

విద్యార్థులకు జయోస్తు లేఖలు

జనగామ కలెక్టర్ వినూత్న కార్యక్రమం

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలకు సూచనలు

జనగామ కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభా చాటేలా పాఠశాల విద్యాశాఖ అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ప్రేరణ అనే పేరుతో ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. అభ్యాస దీపికలను అందజేసి వాటిలోని ప్రశ్నలకు సమాధానాలను ప్రాక్టీసు చేయడం ద్వారా మంచి మార్కులు రాబట్టేందుకు కృషి చేస్తోంది. విజయోస్తు స్మార్ట్ లర్నింగ్ మెటీరియల్‌ను అందించి వాటిని సాధన చేయిస్తోంది. ఈ క్రమంలో టెన్త్ క్లాసులో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో 'విజయోస్తు-లేఖ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా. పంచసూత్రాలతో విజయోస్తు లేఖను ఆయనే స్వయంగా రాసి విద్యార్థులకు అందజేస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించాలంటే క్రమశిక్షణ ఎంతో అవసరమని, సమయపాలన పాటిస్తూ ఒత్తిడికి గురి కాకుండా ప్రణాళికాబద్ధంగా చదవాలని, కష్టపడి చదివిన వారికి ఓటమి అనేది ఉండదని ఆయన సూచిస్తున్నారు. అదే సమయంలో ఆరోగ్యంపై కూడా శ్రద్ధ తీసుకోవాలని, తల్లిదండ్రులు, గురువులు, పెద్దల పట్ల వినయ విధేయతలు ఎంతో అవసరమని విజయోస్తు లేఖల ద్వారా వివరిస్తూకలెక్టర్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



నేటి నుంచి బుగులు వేంకన్న బ్రహ్మోత్సవాలు



చిలుపూర్ గుట్ట, బుగులు వేంకన్న ఆలయం


ఆలయంలోని స్వామి మూలవిరాట్ →

12న స్వామివారి కల్యాణ మహోత్సవం

చిలుపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రెండో తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయం గురువారం నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. అధికారులు భక్తుల కోసం సకల సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జనగామ జిల్లా చిలుపూర్ మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్టపై 14 వందల సంవత్సరాల క్రితం కాకతీయుల కాలంలో నిర్మించిన దేవాలయాల్లో ఒకటైన బుగులు వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఈవో లక్ష్మీప్రసన్న, దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు సహకారంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రచార రథాన్ని సైతం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణం రోజున భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని రూట్ల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేవిధంగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. తిరుకల్యాణ నిర్వహణకు స్థానిక పూజారులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులతో పాటు, హైదరాబాద్‌కు చెందిన వేదపండితుడు అరుణ్‌కుమారా చార్యుల ప్రత్యేక బృందం హాజరుకానుంది. ఇక 12వ తేదీన నిర్వహించే వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవానికి పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామని దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు తెలిపారు. ఈ వేడుకలకు మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో పాటు, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేశ్‌కుమార్, డీపీవో స్వరూపరాణి, ఆర్డీవో ధరంసోత్ వెంకన్న తదితరులను ఆహ్వానించామని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

వారెవ్వా.. హలీమ్

- రంజాన్ మాసంలో ఇదే ప్రత్యేకం
- త్రినగరిలో 200కు పైగా విక్రయ కేంద్రాలు
- బర్డ్‌ఫ్లూ కారణంగా మందకొడిగా చికెన్ హలీమ్ అమ్మకాలు



వడ్డెపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ మాసంలో హలీమ్, హరీస్‌లకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. ఉపవాస దీక్షలతో శుష్కించిన శరీరానికి బలవర్ధకమైన అల్పాహారంగా వీటిని ముస్లింలు తీసుకుంటారు. ఇఫ్తార్ సమయంలో ఉపవాసం పూర్తయ్యాక ముస్లింలు హలీమ్, హరీస్ తింటారు. వరంగల్ నగరంలోని మండిబజార్, హనుమకొండలోని న్యూ రాయపుర, అశోక హోటల్ ప్రాంతం సుబేదారి, కలెక్టరేట్‌తోపాటు కాజీపేట రైల్వే జంక్షన్ ఏరియాల్లో ప్రతీ రోజు సాయంత్రం విక్రయాలు జరుగుతున్నాయి. గొర్రె, మేక, కోడి మాంసంతో తయారు చేసే ఈ హలీమ్, హరీస్‌ను ముస్లింలే కాదు ఇతర మతాల వారు కూడా ఎంతో ఇష్టంగా తింటారు. ఇటుకలతో నిర్మించిన బట్టీలపై కట్టెలతో మంట పెడుతూ వండే ఈ పదార్థాల్లో కాజు, బాదం, కిస్మిస్, పిస్తా, మునఖా, అంజీర్ లాంటి బలవర్ధకమైన దినుసులు కలిపి చాలా సేపు ఉడికిస్తారు. ఆ తర్వాత నానబెట్టిన గోధుమ రవ్వ, స్వచ్ఛమైన నేతిలో పాలు, పెరుగుపోసి మరో రెండుగంటల పాటు ఉడికించి తెడ్లతో బాగా కలియబెడతారు. మెత్తగా ఉడికిన తర్వాత సాయంత్రం వేడిగా ఉన్న హలీమ్, హరీస్‌లను విక్రయిస్తారు. అయితే ఈ ఏడాది బర్డ్‌ఫ్లూ భయం కారణంగా చికెన్ హలీమ్, హరీస్ విక్రయాలు తగ్గాయని వ్యాపారులు అంటున్నారు. హలీమ్ ప్లేట్ ధర రూ. 220, ఫ్యామిలీ ప్యాక్ రూ. 420 పలుకుతోంది. హరీస్ ప్లేట్ ధర రూ. 120, ఫ్యామిలీ ప్యాక్ రూ.300కు విక్రయిస్తున్నారు. అదే విధంగా క్రీమ్ మిల్క్, కోవా, సోరకాయ, డ్రైఫ్రూట్స్‌తో తయారు చేసిన ఖద్దూఖా ఖీర్ ప్లేట్ ధర రూ. 70, డబుల్‌కా మీఠా ప్లేట్ ధర రూ. 60, ఖుబానీ ప్లేట్ ధర రూ.70కు అమ్ముతున్నారు.

దిల్‌షాద్ హోటల్‌లో తొలిసారి..

హలీమ్ వంటకానికి శతాబ్దాల చరిత్ర ఉంది. సౌదీ అరేబియా వంటి గల్ఫ్‌దేశాల్లో ప్రథమంగా ప్రారంభమైన హలీమ్ కాలక్రమేపీ విశ్వవ్యాప్తిలోకి వచ్చింది. తొలుత హైదరాబాద్‌లోని చార్మినార్, గోల్కొండ ప్రాంతాల్లో అమ్మకాలు జరగ్గా.. ఇప్పుడు రంజాన్ మాసంలో అన్ని చోట్ల



లభ్యమవుతుంది. వరంగల్‌లో అయితే ప్రప్రథమంగా నగరంలోని మండిబజార్ (దిల్‌షాద్ హోటల్)లో హలీమ్, హరీస్‌ను నగర వాసులకు పరిచయం చేశారు. ఒకప్పుడు హనుమకొండ, సుబేదారి, కాజీపేట, రాయపుర, మచిలీబజార్, ఇట్లీబేస్, ఇమ్లిపుర, అలీపుర, నయీంనగర్‌లోని మండిబజార్‌కు వచ్చి హలీమ్, హరీస్‌లను తినేవారు. ఆ తర్వాత హనుమకొండలోని అప్పటి కోహినూర్ హోటల్, సుబేదారిలోని మునవర్ హోటల్ హలీమ్, హరీస్ వంటకాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం త్రినగరిలో సుమారు 200 లకుపైగా విక్రయ కేంద్రాలు వెలిశాయి.

మందకొడిగా అమ్మకాలు..

ఎండీ అలీఖాన్, సుబేదారి బడే మసీద్

కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిన ప్రభావంతో చికెన్ హలీమ్, హరీస్ విక్రయాలు మందకొడిగా సాగుతున్నాయి. రంజాన్ మాసంలో ముస్లింలు ఎక్కువగా హలీమ్, హరీస్ తినడానికి ఇష్టపడుతారు. ఇతర మతాల వారు కూడా తినేందుకు ఆసక్తి చూపుతారు. కానీ ఈ సారి బర్డ్‌ఫ్లూ భయం కారణంగా తినేందుకు భయపడుతున్నారు.




నగరంలో ఏర్పాటైన హలీం విక్రయశాలలు

ముగ్గురూ.. మనోళ్లేనా?

(5వ పేజీ తరువాయి)

నేపథ్యంలో ఎంపీ టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ అంగీకరించలేదు. ఎమ్మెల్సీ సీటు ఇచ్చేందుకు సై అన్నది. అప్పుడు వరంగల్‌లో సీపీఐ బలంగా ఉందనే ఎంపీ టికెట్‌ను పార్టీ అడిగిందనే చర్చ ఉంది. ఖమ్మం నుంచి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్, మెదక్ జిల్లాలకు సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి లాంటి బలమైన నేతలు ఉన్నారు. అయితే వరంగల్ నుంచి చట్టసభల్లో రెండు దశాబ్దాలుగా ప్రాతినిధ్యం లేకుండా పోతుందని క్యాడర్ ఆందోళనలో ఉంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ సీటు వరంగల్ నేతలకు ఇవ్వాలని పార్టీ కార్యకర్తలు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. పార్టీ కోసం సేవలు అందిస్తున్న శ్రీనివాస్‌రావుకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని పార్టీ నేతలపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో సీపీఐకి వచ్చే ఒక సీటు కూడా ఓరుగల్లుకే దక్కుతుందా అనే ఉత్కంఠలో కామ్రేడ్లు ఉన్నారు.

వేం వైపే సీఎం మొగ్గు ?

కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ సీటు కోసం అరడజను మందికి పైగా నేతలు సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం తన సలహాదారుడు, అప్తమిత్రుడు వేం నరేందర్‌రెడ్డి వైపే మొగ్గు చూపుతున్నారనే చర్చ జరుగుతోంది. పదేళ్ల క్రితం వేం నరేందర్‌రెడ్డికి చేజారిన ఎమ్మెల్సీ సీటును ఈసారి పక్కాగా ఇవ్వాలనే ఆలోచనలో సీఎం ఉన్నారనే చర్చ జరుగుతోంది. 2015లో వేం నరేందర్‌రెడ్డిని టీడీపీ నుంచి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా గెలిపించుకునేందుకు ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతు అవసరం పడింది. కాగా, ఆ ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతు కూడకట్టే ప్రయత్నంలో అప్పుడు టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌రెడ్డి ఓటు-నోటు కేసు అయింది. అప్పుడు పదేళ్ల క్రితం చేజారిన ఎమ్మెల్సీ పదవిని ఈసారి పక్కాగా వేంకు ఇవ్వాలని సీఎం డిసైడ్ అయ్యారనే చర్చ ఓరుగల్లు పాలిటిక్స్‌లో జోరుగా సాగుతుంది. రేవంత్‌రెడ్డితో పాటు టీడీపీ నుంచి వేం నరేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్‌లో ఏదైనా స్థానం నుంచి పోటీకి వేం ఆసక్తి చూపించారు. అయితే అప్పట్లో రాజకీయ సమీకరణలు కుదరకపోవటంతో రేవంత్‌రెడ్డి వెంటే ప్రచారంలో నిలిచారు. గత పదేళ్లుగా కష్టనష్టాల్లో తనతో నిలిచిన వేం నరేందర్‌రెడ్డిని ఈసారి ఎమ్మెల్సీతో పాటు సమీకరణలు కుదిరితే మంత్రిగా సీఎం అవకాశమిచ్చే ఛాన్స్ ఉందనే చర్చ రాజకీయాల్లో జోరుగా జరుగుతోంది. ఇక ఇదే సీటుపై ఆశలు పెట్టుకున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, మంత్రి కొండా సురేఖ హైదరాబాద్‌లోనే మకాం వేసి ఏఐసీసీ, టీపీసీసీ నేతలతో చర్చలు జరుపుతున్నట్లుగా సమాచారం. వీరితో పాటు శనిగరపు ఇందిరా, దొమ్మాటి సాంబయ్య కూడా ఎమ్మెల్సీ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్న జాబితాలో ఉన్నారు.

గులాబీలో డైలమా..

ఎమ్మెల్సీ సీటుపై బీఆర్‌ఎస్‌లో ఉత్కంఠ నెలకొంది. ఆ పార్టీకి దక్కేది ఒకే ఒక ఎమ్మెల్సీ సీటు. ఈ ఒక్క సీటు కోసం పాతిక మందికి పైగా నేతలు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఉమ్మడి వరంగల్‌జిల్లా చెందిన మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే ఉమ్మడి జిల్లాల్లో రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ఎర్రబెల్లికి ఎమ్మెల్సీ సీటు ఇవ్వాలనే ఒత్తిడి గులాబీ బాస్‌పై ఉన్నట్టుగా సమాచారం. అయితే కుల సమీకరణలు, రాజకీయ వ్యూహంలో భాగంగా గులాబీ ఎమ్మెల్సీ సీటు ఓరుగల్లు దక్కుతుందా ? లేదా ? అనేది క్యాడర్‌లో ఉత్కంఠగా మారింది. ఇప్పటికే నామినేషన్ల పర్వం ప్రారంభం కావటంతో ఆశవహులు అన్ని పార్టీల్లో జోరుగా పైరవీలు చేస్తున్నారు. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లకు గడువు ఉండటంతో ఏ పార్టీలో ఎవరికి ఎమ్మెల్సీ సీటు వరిస్తుందో.. శాసనమండలిలో ఓరుగల్లుమని పించే నేతలు ఎవరో అనే ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది.

ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డికి సన్మానం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన పింగిలి శ్రీపాల్‌రెడ్డిని హనుమకొండలోని పీఆర్‌టీయూ భవన్‌లో బుధవారం ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్స్ అసోసియేషన్, స్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇ.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పలు కళాశాలల అధ్యాపకులు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.నరసింహారెడ్డి, వి.శ్రీధర్, అశోక్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న జీజేఎల్‌ఏ నాయకులు

ప్రతీ హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తా..

▸▸ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని 8, 10 డివిజన్లలోని పలు కాలనీలను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సందర్శించారు. హనుమకొండ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి త్వరలోనే వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తామన్నారు. టైలర్‌స్ట్రీట్‌లో ఉన్న సైడ్‌డ్రైన్ సమస్యను పరిశీలించి సంబంధిత అధికారులను సైడ్‌డ్రైన్ నిర్మాణానికి అంచనా వ్యయం వేయాలన్నారు. ఈసందర్భంగా పలు కాలనీల్లో ఇళ్లు శిథిలావస్థలోకి చేరిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు.

అలాగే 10వ డివిజన్ అలంకార్ జంక్షన్ సమీపంలో నిర్మాణంలో ఉన్న డ్రైన్, బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే పరిశీలించి కాంట్రాక్టర్‌ను నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. ప్రజల సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతానన్నారు. తాను ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఏటా వర్షాకాలంలో నీట మునిగే లోతట్టు ప్రాంతాలను పరిశీలించి సమస్య పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందిరానగర్‌లోని అంబేద్కర్ భవన్


8వ డివిజన్ ఇందిరానగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నిర్మాణం, ప్రహరీగోడ ఏర్పాటు నిధులను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. ఇదిలా వుండగా, ఎమ్మెల్యే పర్యటించిన ప్రాంతాల్లో కొందరు మహిళలు, స్థానికులు ఎమ్మెల్యేను సమస్యలపై నిలదీసే ప్రయత్నం చేయగా స్థానిక కాంగ్రెస్ నాయకులు వారిని అడ్డుకున్నారు. కొందరు మహిళలు ఎమ్మెల్యే సమక్షంలో తమ కాలనీల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, అధికారులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్ డైరీ ఆవిష్కరణ


ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి పూలమాల వేసి శాలువాతో సత్కరిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

హనుమకొండ టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో నూతన డైరీని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యేను టీఎన్జీవో నాయకులు శాలువాతో సన్మానించి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణు, కోశాధికారి పి. రాజేష్, గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్, కేంద్ర సంఘం కార్యదర్శి రాము నాయక్, కార్యవర్గ సభ్యులు లక్ష్మీప్రసాద్, మొయిజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల తనిఖీ

వరంగల్ మెడికల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నారాయణగిరి, ముప్పారం, పీహెచ్‌సీ ధర్మసాగర్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఎర్రబెల్లి, ప్రాథమిక కేంద్రం వేలేరులో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని హీట్ వేవ్ సన్ స్ట్రోక్ ముందస్తు ప్రణాళిక గురించి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం ముప్పారం గ్రామంలో నిర్మాణ దశ పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి తయారుగా ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ మేఘన, సూపర్‌వైజర్లు రాంమోహన్, కుమారస్వామి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

న్యూస్ బాక్స్

నేడు రాఘవేంద్రస్వామి జయంతి

వడ్డెపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లి పరిమళ కాలనీలోని రాఘవేంద్ర స్వామి మఠంలో గురువారం రాఘవేంద్రస్వామి జయంతి మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు మఠం విచారణ కర్త డీవీఎం ప్రభాకర్‌రావు, గౌరవ ప్రతినిధి వి.చక్రధరరావులు తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు అష్టోత్తరం, 8.30 గంటలకు పాదపూజ, కనకాభిషేకం, ఉదయం 11.30 గంటలకు రథోత్సవంతో పాటు మధ్యాహ్నం 12.30 గంటలకు తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి రాఘవేంద్రస్వామిని దర్శించుకొని తరించాలని వారు కోరారు.

కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలి

▸▸ ప్రజాతంత్ర ఆలోచన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు దశరథం

వడ్డెపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ లష్కర్ సింగారం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 266లో ఉన్న స్థలంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని ప్రజాతంత్ర ఆలోచన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తుపాకుల దశరథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్‌లోని సమ్మయ్యనగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్లకు ఇరువైపులా చిరు వ్యాపారులు కూరగాయలను విక్రయించడం వలన ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. మార్కెట్ ఏర్పాటు వలన సుమారు 20 కాలనీల ప్రజలకు కూరగాయలు కొనుగోలు చేసే సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. సమావేశం అనంతరం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించి మార్కెట్ ఏర్పాటు చేయించాలని కోరారు. సమావేశంలో ప్రజాతంత్ర ఆలోచన వేదిక జిల్లా ప్రతినిధులు పింగిళి అశోక్‌రెడ్డి, మీసాల రమేష్, జనప సారంగపాణి, చింతపణి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న దేవాదాయ శాఖ ఏసీ సునీత

రుద్రేశ్వరుడి శివరాత్రి ఆదాయం రూ.22లక్షలు

హనుమకొండ కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులు స్వామి వారికి సమర్పించిన హుండీ లెక్కింపు బుధవారం ఆలయ కల్యాణ మండపంలో జరిగింది. హుండీల ద్వారా రూ.8లక్షల 21వేల 800లు, పూజా రుసుముల ద్వారా రూ.7లక్షల 20వేలు, భక్తులు స్వామి వారికి అందించిన విరాళాల ద్వారా రూ.6లక్షల 60వేలు మొత్తంగా రూ.22లక్షల పైచిలుకు ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో అనిల్‌కుమార్ చెప్పారు. కిందటేడు కంటే ఈసారి ఆరున్నర లక్షల ఆదాయం అదనంగా సమకూరిందని చెప్పారు. మహాశివరాత్రి ఫెస్టివల్ అధికారి హోదాలో దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా ఏసీ రామాల సునీత హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మతోపాటు వెంకటేశ్వర సహకార సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి సహకరించండి


మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌కు వినతి పత్రం అందజేస్తున్న డంపింగ్ యార్డు నిర్మూలన అడ్‌హక్ కమిటీ సభ్యులు

మడికొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మడికొండ పరిసర గ్రామాల ప్రజల పాలిట శాపంగా పరిణమించిన మడికొండ, రాంపూర్ శివారులోని చెత్త డంపింగ్ యార్డును ఎత్తివేసేందుకు సహకరించాలని కోరుతూ డంపింగ్ యార్డు నిర్మూలన అడ్‌హక్ కమిటీ సభ్యులు బుధవారం పలువురు ప్రముఖులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. తొలుత టేకులగూడెంలో రాష్ట్ర ఆయిల్ సీడ్స్ గ్రోవర్ కమిషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. అనంతరం హనుమకొండలో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈమేరకు వారు సానుకూలంగా స్పందించి తమ వంతు సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారని డంపింగ్ అడ్‌హక్ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, పెండ్లి క్రిష్ణమూర్తి, తాడూరి మోహన్, తొట్ల రాజుయాదవ్, పొనగోటి వెంకట్రావు, దువ్వ నవీన్, బొల్లికొండ వినోద్, దువ్వ శ్రీకాంత్, పేపర్ రవి, అల్లం సతీష్, నరేందర్, కుమారస్వామి, పాపన్న పాల్గొన్నారు.

కేయూ ఇంజనీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారుల నియామకం

కేయూ క్యాంపస్ మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ కో ఎడ్యుకేషన్, మహిళా ఇంజనీరింగ్ కళాశాలలకు కొత్త ప్లేస్‌మెంట్, కేరీర్ అండ్ గైడెన్స్ సెల్ అధికారులను నియామిస్తూ బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. మహిళ ఇంజనీరింగ్ కళాశాలకు సీఎస్ఈ విభాగం కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ బొల్లం కిరణ్‌కుమార్‌ను, కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలకు సీఎస్ఈ విభాగం కాంట్రాక్టులు వి.రమణబాబులను నియమించారు. వీరిద్దరు ఏడాది పాటు పదవిలో కొనసాగుతారు. వీరిద్దరికీ కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి నియామక పత్రాలను అందచేసి అభినందించారు.

కేయూ విద్యా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా మనోహర్

కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ విద్యా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ నియమితులయ్యా రు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు వెలువరించగా వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మనోహర్‌కు అందచేసి అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకు ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ప్రిన్సిపాల్‌గా వ్యవరించగా వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్‌ను నియమించారు. ఈ సందర్భంగా మనోహర్‌ను పలువురు అభినందించారు.

కేయూలో పురుషుల సైక్లింగ్ పోటీలు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో 2024-25 ఏడాదికి పురుషుల సైక్లింగ్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కేయూ క్యాంపస్‌లో బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి పోటీల ను జెండా ఊపి ప్రారంభించారు.

కోదండరెడ్డిని కలిసిన డెయిరీ రైతులు

హనుమకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వ్యవ సాయ రైతుల సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డిని బుధవారం విజ య కాకతీయ పాడి రైతు ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇరుకు దేవేం దర్ రావు కలిశారు. పాడి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను


కోదండరెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందచేస్తున్న దేవేందర్ రెడ్డి

ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా విజయా డెయిరీ లాభాల బాటలో విజ యవంతంగా నడవాలంటే రైతుల భాగస్వామ్యం అవసరాన్ని వివరించారు. ప్రధానంగా డెయిరీ నిర్వహణలో మూడంచెల విధానాన్ని అనుసరించాలని సూచించారు. విజయా డెయిరీ ప్రస్తుతం నష్టాలను ఎదుర్కొంటుండానికి కారణాలను విశ్లేషించారు. ఈ మేరకు దేవేందర్‌రావు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, సునీల్. భవానీ తదితరులు ఈ సందర్భంగా హాజరయ్యారు.

న్యూశాయంపేటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

వరంగల్ కార్పొరేషన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేటలో అక్రమనిర్మాణాలపై బల్దియా అధికారులు కొరడా ఝులిపించారు. న్యూ శాయంపేట సర్వే నెంబర్ 125/సీలో అక్రమ నిర్మాణాలను బుధవారం బల్దియా అధికారులు కూల్చివేశారు. కూల్చివేతలకు సంబంధించి నగర పాలక సంస్థ పరిధిలోని కాజీపేట సర్కిల్-2 కార్యాలయం నుంచి డిప్యూటీ కమిషనర్ రవీందర్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే...

హంటర్‌రోడ్డులోని సర్వే నెంబర్ 125/సీ స్థలంలో నంబూరి చారుమతి అనే మహిళ 2వేల చదరపు గజాల స్థలంలో కట్టడాలను నిర్మించింది. దీనిపై న్యూశాయంపేట ప్రాంతానికి చెందిన మంద యాకూబ్ అనే వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేస్తూ 2022 నవంబరు 17న మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. తన భూమి ఆక్రమణకు గురైందని, తనకు న్యాయం చేయాలని బల్దియా అధికారుల చుట్టూ తిరిగాడు. దీంతో బల్దియా అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి 2025 ఫిబ్రవరి 5న నంబూరి చారుమతి కట్టడాలు అక్రమ నిర్మాణాలని తేల్చి నేలమట్టం చేయాలని కాజీపేట డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఫిబ్రవరి 25వరకు అక్రమ కట్టడాలను నేలమట్టం చేయాలని నగర పాలక సంస్థ ఆదేశించగా, వెలువడిన ఉత్తర్వులు రద్దు చేయాలని చారు మతి


న్యూశాయంపేటలో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న బల్దియా అధికారులు


హైకోర్టును ఆశ్రయించారు. అయితే చారుమతికి హైకోర్టులో ఊరట లభించలేదు. దీంతో బల్దియా అధికారులు బుధవారం జేసీ బీల సహాయంతో దగ్గరుండి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.

పరీక్షా కేంద్రానికి విద్యార్థిని చేర్చిన పోలీసు

మడికొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పరీక్షాకేంద్రం తెలియక దారి తప్పిన ఇంటర్ విద్యార్థిని సకాలంలో పరీక్షా కేంద్రానికి తరలించి పోలీసులు శభాష్ అనిపించుకున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో కాజీపేటలోని సిగ్మా జూనియర్ కాలేజీకి చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి నేతావత్ బాలాజీ పరీక్షా కేంద్రం క్షేత్ర జూనియర్ కాలేజీలో పరీక్ష రాయాల్సి ఉండగా పొరబాటున మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చేరుకున్నాడు. అక్కడే బందోబస్తు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ విద్యార్థి వివరాలు తెలుసుకొని కానిస్టేబుల్ రాంచందర్ ద్వారా ఆ విద్యార్థిని కాజీపేట క్షేత్ర జూనియర్ కాలేజీలోని పరీక్షా కేంద్రానికి తరలించి సకాలంలో పరీక్ష రాసే విధంగా సహకరించారు.


ఇంటర్ విద్యార్థిని కానిస్టేబుల్‌తో పరీక్షా కేంద్రానికి తరలిస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషన్

శ్రీనివాస్ గురుకుల్ హైస్కూల్ వార్షికోత్సవం



వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

హనుమకొండ టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ హైస్కూల్ అంబేద్కర్ భవన్‌లో బుధవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రెటరీ చిదురాల సోమరత్నం మాట్లాడుతూ.. నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు కొత్త ఉత్తేజాన్ని నింపుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యుగంధర్, ఉపాధ్యాయులు చిదురాల ఇంద్ర, వినయ్‌కుమార్, విజయ్ కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అనితారెడ్డికి ఐడియల్ ఉమెన్ అవార్డు

బాలసముద్రం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఛైర్మన్, కేయూ పాలక మండలి సభ్యురాలు, వరల్డ్‌వైజ్ కన్స్యూమర్ రైట్స్ నేషనల్ వైస్ ఛైర్మన్ డాక్టర్ కరుకాల అనితారెడ్డి ఐడియల్ ఉమెన్-2025 అవార్డును అందుకున్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ, హైదరాబాద్ పాత నగర కవుల వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా వివిధ రంగాలలో ప్రతిభ చూపిన మహిళలకు పురస్కారాలు అందజేశారు. ఇందులో సమాజ సేవా రంగంలో సేవలు చేసిన డాక్టర్ కరుకాల అనితారెడ్డికి అతిథుల చేతుల మీదుగా ఐడియల్ ఉమెన్ అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, డాక్టర్ నామోజు


డాక్టర్ అనితారెడ్డికి అవార్డును అందజేస్తున్న నిర్వాహకులు

బాలా చార్య, ప్రముఖ కవి కోరుప్రోలు హరినాథ్ తదితరులు అనితారెడ్డికి అవార్డును అందజేశారు. డాక్టర్ అనితారెడ్డి మాట్లాడుతూ తనకు లభించిన అవార్డు సంతోషాన్ని కలిగించడమే కాకుండా బాధ్యతను మరింతగా పెంచిందని అన్నారు.

కేయూలో జిల్లా యూత్ పార్లమెంట్ ఎంపిక పోటీలు

కేయూ క్యాంపస్ మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో మార్చి 12, 13 తేదీల్లో జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలు నిర్వహిస్తామని వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ మేరకు బుధవారం కేయూ పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణలు యూత్ పార్లమెంట్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూత్ పార్లమెంట్ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. కేంద్రం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నేతృత్వంలో నేషనల్ యూత్ పార్లమెంట్ జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 18-25 వయస్సు కలిగిన వారందరూ పాల్గొనవచ్చునని తెలిపారు. మార్చి 9 వరకు మై భారత్ వెబ్‌సైట్‌లో యువత తమ వివరాలను రిజిస్టర్ చేసుకోవాలని, 'వాట్ డస్ వికసిత్ భారత్ మీన్ టూ యూ' అనే అంశంపై నిమిషం విడివి కలిగిన వీడియోను రూపొందించాలని తెలిపారు. ఉత్తమమైన వీడియోలను ఎంపిక చేసి జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలకు అర్హులను ఎంపిక చేస్తామని చెప్పారు. జిల్లా యూత్ పార్లమెంట్ పోటీలు కేయూ సెనెట్ హాల్‌లో మార్చి 12, 13 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. వీటిలో ఎంపికైన ఉత్తమ 10 మంది యువతను రాష్ట్ర స్థాయి యూత్ అసెంబ్లీకి పంపుతామన్నారు. అక్కడి నుంచి ముగ్గురు జాతీయ స్థాయికి న్యూఢిల్లీకి పంపుతారని తెలిపారు. ఇతర వివరాల కోసం వికాస్, శ్రీజలను 76609-39019, 63033-50918 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. యూత్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మమత, నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ అన్వేశ్ చింతల, ఎన్ఎస్ఎస్ పీవోలు రాధిక, సుజాత, సునీత పాల్గొన్నారు.



యూత్ పార్లమెంట్ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, తదితరులు

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన స్టాలిన్ : సీపీఐ

హనుమకొండ టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన అమరుడు స్టాలిన్ అందరికీ ఆదర్శంగా నిలిచారని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కొనియాడారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ పార్టీ జిల్లా కార్యాలయంలో స్టాలిన్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాలిన్ చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. సమసమాజ స్థాపనే లక్ష్యంగా బడుగు, బలహీన వర్గాల కోసం పోరాటాలు చేసి అసువులు బాసిన వ్యక్తి స్టాలిన్ అన్నారు. హిట్లర్ అవలంబించిన ఫాసిస్ట్ విధానాన్ని తిప్పి కొట్టి ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు విముక్తి కలిగించిన విప్లవవీరుడు స్టాలిన్ అని


స్టాలిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కొనియాడారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు భిక్షపతి, సంతోష్, శ్రీనివాస్, రవి, శంకర్‌నాయక్, అనిల్‌కుమార్, కనకమ్మ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

వరంగల్ మెడికల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ.అప్పయ్య బుధవారం పీసీ, పీఎన్‌డీటీ, ఎంటీపీ యాక్ట్ ప్రకారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా హనుమకొండలోని పలు ఆస్పత్రులను సందర్శించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. చట్టం ఉల్లంఘిస్తున్న వారి వివరాలను 181, 104, 1098కు, డయల్ 100కు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఓఎంసీహెచ్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మంజుల, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

పెదవులు తేమగా...

గాలి, ఎండ, వాతావరణ కాలుష్యం వల్ల పెదవులు పొడిబారి నల్లగా మారుతుంటాయి. ఇలా నిర్జీవంగా మారిన పెదవులను కొన్ని చిట్కాలతో అందంగా మార్చుకోవచ్చు.

- ఒక గిన్నెలో ఒక చెంచా తేనె, అర చెంచా దానిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు పట్టించాలి. పావుగంటసేపు ఆరనివ్వాలి. తరవాత నీటితో శుభ్రం చేసుకుని లిప్‌బామ్ రాసుకోవాలి. ఇలా రోజూ చేస్తూ ఉంటే పెదవులు తేమతో నిండి ఆరోగ్యంగా కనిపిస్తాయి.
- పెదవులకు తరచూ పేరిన నెయ్యి, వెన్న, పాల మీగడ రాసినా కూడా మంచి ఫలితం ఉంటుంది.
- ఒక చెంచా కాఫీ పొడిలో అర చెంచా కొబ్బరి నూనె వేసి బాగా కలపాలి. ఈ పేస్టుని పెదవులకు పట్టించి అయిదు నిమిషాల తరవాత వేళ్లతో మెల్లగా రుద్దితే మృతకణాలన్నీ తొలగిపోతాయి.
- ఒక గిన్నెలో ఒక చెంచా పంచదార, అరచెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు రాసి రెండు నిమిషాలు ఒకే దిశలో మర్దన చేయాలి. తరవాత నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే పెదవులపై ఉండే చర్మపు పొరల్లో తేమ నిండుతుంది.
- ఒక చెంచా దాల్చినచెక్క పొడిలో అర చెంచా తేనె కలిపి..... ఈ మిశ్రమాన్ని రాత్రి పడుకునేముందు పెదవులకు రాయాలి. ఉదయాన్నే చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే పెదవులకు రక్తప్రసరణ మెరుగవుతుంది.
- ఒక గిన్నెలో రెండు చెంచాల బీట్‌రూట్ పేస్టు, ఒక చెంచా పంచదార, అరచెంచా కొబ్బరినూనె వేసి కలపాలి.
ఈ మిశ్రమాన్ని పెదవులకు పట్టించి రెండు నిమిషాలు సున్నితంగా రుద్దాలి. పొడిబారిన చర్మం పొర తొలగిపోయి పెదవులు మృదువుగా మారతాయి.



- ఒక చెంచా బీట్‌రూట్ రసం, అర చెంచా పాలు, అరచెంచా తేనె కలిపిన మిశ్రమాన్ని పెదవులకు రాయాలి. పావుగంటసేపు ఆరిన తరవాత చల్లని నీటితో శుభ్రం చేసుకుంటే ఎండవల్ల నల్లబడిన పెదవులు గులాబీ రంగులోకి మారతాయి.

కౌన్సెలింగ్

ఆ గడ్డలతో గర్భానికి చేటు ఏ మేరకు?

Q A

డాక్టర్! నా వయసు 28 సంవత్సరాలు. గర్భసంచిలో గడ్డలు ఉన్నాయని స్కానింగ్‌లో తెలిసింది. వీటి వల్ల గర్భం వచ్చే అవకాశాలు తగ్గుతాయా? ఒకవేళ గర్భం ధరిస్తే, సమస్యలేవైనా ఎదురవుతాయా?

\- ఓ సోదరి, హైదరాబాద్

చిన్నపాటి ఫైబ్రాయిడ్ గడ్డలతో గర్భం దాల్చే అవకాశాలకు ఎలాంటి అవరోధం ఉండదు. సాధారణంగా ఫైబ్రాయిడ్ గడ్డలు చిన్నవిగా ఉంటాయి. పైగా వాటి వల్ల గర్భసంచి పరిమాణం తగ్గడం, ఫెలోపియన్ ట్యూబులకు అడ్డంకులు ఏర్పడడం ఎంతో అరుదు. అయితే ఇవే గడ్డలు పరిమాణంలో పెద్దవిగా ఉన్నా, లోపలి వైపుకు పెరుగుతున్నా, గర్భధారణలో ఇబ్బందులు తలెత్తవచ్చు. కొన్నిసార్లు



గడ్డలు గర్భసంచి పైపైపు ఒక మూలలో పెరగవచ్చు. వాటి వల్ల ఫెలోపియన్ ట్యూబులో అవరోధాలు ఏర్పడి గర్భధారణ సమస్యలు తలెత్తవచ్చు. కొన్ని సందర్భాల్లో పెద్ద ఫైబ్రాయిడ్ గడ్డల వల్ల, గర్భస్రావం జరగడం, నెలలు నిండకుండా పిల్లలు పుట్టడం లాంటివి కూడా జరగవచ్చు. ఫైబ్రాయిడ్స్‌తో గర్భం దాల్చినప్పుడు గడ్డలకు రక్తప్రసరణ పెరిగి వాటి పరిమాణం కూడా పెరిగి బాధ, అసౌకర్యం వేధించవచ్చు. అలాంటి సందర్భాల్లో ఆస్పత్రిలో చేరి నొప్పినివారణ చికిత్స తీసుకోవలసి వస్తుంది. ఫైబ్రాయిడ్స్ గర్భసంచి కింది భాగంలో పెరిగితే, గర్భాశయంలో బిడ్డ అడ్డంగా లేదా తలకిందులుగా పెరిగి, సిజేరియన్ సర్జరీ చేయవలసి వస్తుంది. ఈ గడ్డల వల్ల సర్జరీ సమయంలో అధిక రక్తస్రావం జరిగే సమస్య కూడా ఉంటుంది. మీ విషయంలో థైరాయిడ్ గడ్డలు పెద్దవిగా ఉన్నా, లోపలి వైపు పెరుగుతున్నా లేదా వాటి వల్ల నెలసరిలో తీవ్ర రక్తస్రావం అవుతున్నా, నొప్పి వేధిస్తున్నా, సర్జరీతో ఫైబ్రాయిడ్స్‌ను తొలగించుకోవాలి. సర్జరీ జరిగిన ఆరు నెలల తర్వాత పిల్లల కోసం ప్రయత్నిస్తే, ఫైబ్రాయిడ్స్ తాలూకు ఇబ్బందులు తగ్గుతాయి. త్వరగా కోలుకోవడం కోసం కోత లేని కీహోల్ పద్ధతిలో, ల్యాప్రోస్కోపిక్ సర్జరీ చేయించుకోవడం ఉత్తమం.

డాక్టర్ ప్రమత శిరీష
కన్సల్టెంట్ అబ్‌స్టెట్రీషియన్,
గైనకాలజీ, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ అండ్
ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్,
బర్త్‌రైట్ బై రెయిన్‌బో, హైదరాబాద్.





ఆరేళ్ల పిల్లను పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆమె...
ఆ బాధ నుంచి బయటపడటానికి అల్లికలు మొదలుపెట్టింది.
ఆ అభిరుచే ఆమెను పారిశ్రామికవేత్తను చేసింది.
కాలక్షేపానికి ఇంట్లో మొదలైన వ్యాపకం...
ఇప్పుడు ఎనిమిది కోట్ల ఆదాయం తెచ్చే సంస్థగా మారింది.
భర్తతో కలిసి 'మ్యాజిక్ నీడిల్స్' నెలకొల్పి... మూడు వందల
మంది అట్టడుగు వర్గాల మహిళలకు ఉపాధి కల్పిస్తోంది.
ముంబయికి చెందిన ఇద్దరు పిల్లల తల్లి
హీనా పటేల్ విజయ గాథ ఇది.

అభిరుచితో మ్యాజిక్

"అది 2011. నా జీవితంలోనే అత్యంత బాధాకరమైన సంవత్సరం. నా ఆరేళ్ల పాప మూర్ఛ వ్యాధితో మమ్మల్ని వదిలి వెళ్లిపోయింది. నా గుండె ఆగలేదు... కానీ నేను జీవచ్ఛవంలా మారిపోయాను. కళ్లు తెరిచినా మూసినా నా కూతురు కళ్ల ముందు మెదులుతుండేది. నా పరిస్థితి చూసి మావారు కల్పేష్, ఇంట్లోవాళ్లు ఆందోళన చెందేవారు. నావల్ల వాళ్లందరూ బాధపడటం నాకు నచ్చలేదు. ఆ బాధ నుంచి బయటకు రావడానికి ప్రయత్నించాను. అందులో భాగంగానే స్వెటర్లు, టోపీలు అల్లడం మొదలుపెట్టాను. కాలేజీ రోజుల్లో అప్పుడప్పుడూ అల్లుతుండేదాన్ని. క్రమంగా అల్లిక నా అభిరుచిగా మారిపోయింది. అదే సమయంలో ఐవీఎఫ్ ద్వారా పిల్లను కనాలనుకున్నాను. దూరమైన మా అమ్మాయి మళ్లీ మా ఇంట పుడుతుందనే ఆశ నాది. అప్పట్లో నేను ఐసీఐసీఐ బ్యాంకులో ఉద్యోగం చేసేదాన్ని. గర్భవతిని కావడంతో పనికి బ్రేక్ ఇచ్చాను. కాలక్షేపంగా అల్లికలు కొనసాగించాను.

కవలలు పుట్టాక...

ఈసారి నాకు కవలలు పుట్టారు. వాళ్లను చూసుకోవడం కోసం అన్నీ ఆపేసి ఇంటికే పరిమితమయ్యాను. పిల్లలకు రెండున్నరేళ్లు వచ్చాక వాళ్లను ప్లే స్కూల్‌కు పంపించాను. దాంతో నాకు మళ్లీ కాస్త ఖాళీ సమయం లభించింది. అటకెక్కిన అల్లికలను తిరిగి మొదలుపెట్టాను. ఊలు, సూదులు ఆర్డర్ చేశాను. యూట్యూబ్‌లో చూసి స్వెటర్లు, టోపీల వంటివి ఎలా అల్లాలో నేర్చుకున్నాను. నాకు వచ్చినంతలో రెండు స్వెటర్లు అల్లాను. వాటిని నా పిల్లలకు వేసి ఫొటోలు తీసి, వాటిని నా స్నేహితుల వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాను. అవి చూసి వాళ్లు ఫిదా అయ్యారు. రోజుకు ఒకటి చొప్పున మరికొన్ని వెరైటీలు రూపొందించాను. వాటిని ఫేస్‌బుక్‌లో పెట్టమని స్నేహితులు చెప్పారు. దాంతో మావారు నా కోసం ఒక ఎఫ్‌బీ పేజీ తెరిచారు. అందులో కొన్ని క్యాప్‌ల ఫొటోలు అప్‌లోడ్ చేస్తే అనూహ్య స్పందన వచ్చింది. 800 మంది బాగున్నాయంటూ కామెంట్లు పెట్టారు.

అలా మొదలైంది...

అదే ఏడాది నా అల్లికలు ప్రముఖ బ్రాండ్ 'ఫస్ట్ క్రై'ను ఆకర్షించాయి. వాళ్లు నన్ను సంప్రతించారు. తమ కంపెనీ ద్వారా నా ఉత్పత్తులు విక్రయించుకోవచ్చని చెప్పారు. అసలు వీటిని విక్రయించాలని గానీ, వ్యాపారం ఒకటి ప్రారంభించాలని కానీ నేను ఎప్పుడూ అనుకోలేదు. కానీ అందివచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోదలుచుకో లేదు. కంపెనీ ప్రతిపాదన నాకు నచ్చింది. వెంటనే పని ప్రారంభించాను. దాని కోసం మాకూ ఒక బ్రాండ్ ఉండాలి కదా. అందుకే మావారి భాగస్వామ్యంతో 'మ్యాజిక్ నీడిల్స్' పేరుతో చిన్న సంస్థను నెలకొల్పాను. మావారు వివిధ కంపెనీలకు మార్కెటిం గ్ చేసేవారు. ఆయన సహకారంతో నాకు మార్కెటింగ్ బాధ తప్పింది.

> **అదే మా పెట్టుబడి...**
>
> మా ఉత్పత్తుల్లో నాణ్యమైన ఊలు మాత్రమే ఉపయోగిస్తాం. అదే మా పెట్టుబడి. మొదట్లో టర్కిష్ ఊలును విదేశాల నుంచి దిగుమతి చేసుకొనేవాళ్లం. నాణ్యమైన ఊలు కోసం ఎంత వెతికినా భారత్‌లో లభ్యంకాలేదు. దాంతో ఈ లోటును మేమే భర్తీ చేయాలని భావించాం. దాని కోసం అత్యంత నాణ్యమైన ఊలు దారాలు సరఫరా చేసేందుకు 'హాబీ స్టోర్' పేరిట ఒక బ్రాండ్‌ను తెచ్చాం. ఊలు సేకరించి, మేమే ప్రపంచ స్థాయి నూలు దారాలు తయారు చేసి విక్రయిస్తున్నాం. దీంతో మా వ్యాపారం మరింత విస్తరించింది. అమెజాన్, మింత్ర, నైకా తదితర ప్రముఖ ఈకామర్స్ సంస్థల్లో మా ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. మా వెబ్‌సైట్‌ను నెలకు దాదాపు లక్ష మంది సందర్శిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరానికి గానూ ఎనిమిదిన్న కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. ఇది ఒక మహిళగా, మహిళల సాయంతో నేను సాధించిన విజయం.





మూడొందల మంది మహిళలు...

ఆరంభంలో నేనొక్కదాన్నే అల్లేదాన్ని. క్రమంగా ఆర్డర్లు పెరిగాయి. పని భారం అధికమైంది. దాంతో వేరెవరినైనా సహాయంగా పెట్టుకోవాలనుకున్నాను. పేద మహిళలైతే వారికి ఉపాధి కల్పించినట్టు అవుతుంది కదా. అందుకే మొదట మా ఇంట్లో పని చేసి మానేసిన ప్రియను పిలిచాను. ఈ పని తనవల్ల కాదని వెనకడుగు వేసింది. నేను ధైర్యం చెప్పి, శిక్షణ ఇచ్చాను. కొద్ది రోజుల్లోనే తను మంచి నైపుణ్యం సంపాదించింది. ఇప్పుడు తనే నాకు అత్యంత నమ్మకమైన కళాకారిణి. కొత్తగా చేరేవారికి కూడా శిక్షణ ఇస్తోంది. ముంబయిలోని మా ఇంటికి సమీపంలో బస్తీ ఉంది. అక్కడ ఎన్నో పేద కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రియ సహకారంతో ఆ ప్రాంతంలోని మహిళలను సంప్రతించాను. మొదట్లో వారు ఒప్పుకోలేదు. ముఖ్యంగా ఇల్లు వదిలి పని చేయడానికి వెనుకాడారు. అలాంటివారికి ఇంటి వద్దనుంచే పని చేసుకొనే వెసులుబాటు కల్పించాను. శిక్షణ ఇచ్చాను. ఇప్పుడు ఆ ఒక్క బస్తీ నుంచే 150 మంది మహిళలు మా సంస్థలో పని చేస్తున్నారు. మొత్తం మూడొందల మంది ఆడవారు మా ద్వారా ఉపాధి పొందుతున్నారు. గౌరవప్రదమైన జీవితం గడపగలు గుతున్నారు. వీరిలో హిమాచల్ ప్రదేశ్ నుంచి యాభైమంది, కోల్‌కతా నుంచి యాభైమంది ఉన్నారు. ప్రియ అయితే కంప్యూటర్స్ నేర్చుకొని తనే ఒక కంపెనీ ప్రారంభించాలనే ఆలోచనలో ఉంది. నేను కోరుకున్నది ఇలాంటి పురోభివృద్ధే. తను నా బిడ్డలాంటిది. ఇలా ఎందరో పేద మహిళలు తమ కాళ్లపై తాము నిలబడగలుగుతున్నారు. ఇంతకంటే సంతృప్తి, సంతోషం ఏముంటుంది!

నాదల్‌ను 'మాయ' చేసింది

టెన్నిస్ లెజెండ్ రఫెల్ నాదల్, తన సొంత అకాడమీలో ఒక బాలిక ఆటను ఆసక్తిగా వీక్షిస్తున్న తాజా వీడియో ఒకటి సంచలనం సృష్టిస్తోంది. ఆ 15 ఏళ్ల బాలికే, మన భారతీయ టెన్నిస్ క్రీడాకారిణి మాయా రాజేశ్వరన్. ప్రతిష్ఠాత్మకమైన రఫెల్ నాదల్ అకాడమీలో ఏడాది పాటు శిక్షణ పొందే కాంట్రాక్ట్‌ను సొంతం చేసుకున్న మాయ గురించిన ఆసక్తికరమైన విశేషాలు.



ఎంతో మంది బాలికలు టెన్నిస్ క్రీడను ఎంచుకుంటూ ఉంటారు. అయితే ఆ ఆటలో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎదిగేవారు అతికొద్దిమందే! వాళ్లలో మాయ రాజేశ్వరన్ ఒకరు. 15 ఏళ్ల మాయ రాజేశ్వరన్ కూడా టెన్నిస్ సర్క్యూట్‌లో రాణించి, ప్రతిష్ఠాత్మకమైన ఎల్ అండ్ టి డబ్ల్యుటిఎ 125 సిరీస్ సెమీఫైనల్స్‌లో తన స్థానాన్ని పదిలపరుచుకోగలిగింది. ఈ పోటీలో మాయ, ఇటలీకి చెందిన ప్రపంచ నంబర్ 264, నికోల్ ఫాసా హ్యార్రే, అమెరికాకు చెందిన వరల్డ్ నంబర్ 434, జెస్సికా ఫెల్లానూ ఓడించింది. ఈ విజయంతో, డబ్ల్యుటిఎ పాయింట్ సంపాదించిన అతి పిన్న వయసుగల భారతీయురాలిగా పేరు తెచ్చుకుంది మాయ. ఈ ప్రతిష్ఠాత్మక విజయంతో మాయ, ప్రపంచం దృష్టిని సైతం ఆకర్షించింది.

ఆటనే అభిరుచిగా...

తమిళనాడులోని కోయంబత్తూరులో 2009, జూన్ 12న పుట్టిన మాయచ ఊహించని విధంగా టెన్నిస్ క్రీడలోకి అడుగు పెట్టింది. బడి క్రీడల్లో భాగంగా టెన్నిస్ ఆడుతూ, ఆ ఆట మీద మక్కువ పెంచుకున్న ఈ బాలిక, ఎనిమిదేళ్ల వయసుకు చేరుకునేటప్పటికి ఆ క్రీడనే అభిరుచిగా మలుచుకుంది. మొదట్లో మాజీ భారతీయ నంబర్ వన్ ఆటగాడు కె.జి.రమేష్ దగ్గర టెన్నిస్‌లో శిక్షణ పొందింది. ఆ తర్వాత ప్రొసర్వ్ టెన్నిస్ అకాడమీలో కోచ్ మనోజ్ కుమార్ సారథ్యంలో ఐదేళ్ల పాటు శిక్షణ తీసుకుంది. మహారాష్ట్ర స్టేట్ లాన్ టెన్నిస్ అసోసియేషన్ ద్వారా క్వాలిఫయింగ్ వైల్డ్‌కార్డ్ పొందిన మాయ, డబ్ల్యుటిఎ 125 ఈవెంట్‌లో తన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం విశేషం.

దిగ్గజం దృష్టిలో...

తన ఆటతో మంచి గుర్తింపు తెచ్చుకున్న మాయ, స్పెయిన్ మల్లోర్కాలోని రఫెల్ నాదల్ అకాడమీలో వారం రోజుల శిక్షణ పొందే అవకాశాన్ని సొంతం చేసుకుంది. ఆ వారం రోజుల్లో ఆమె తన ప్రతిభతో, అదే అకాడమీలో ఏడాది పాటు టెన్నిస్ ఆడే కాంట్రాక్టును కూడా



పొందగలిగింది. అందుకోసం మామ, స్పెయిన్‌కు మకాం మార్చేసింది. అక్కడ శిక్షణ పొందుతున్న సమయంలో నాదల్ దగ్గరుండి ఆమె ఆటను వీక్షించడం సంచలనంగా మారింది. అకాడమీకి చెందిన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో మాయ సెషన్స్‌ను వీక్షిస్తున్న నాదల్ ఫొటోలను పోస్ట్ చేస్తూ... "అత్యంత ప్రత్యేక వీక్షకుడు, రఫెల్ నాదల్, డబ్ల్యుటిఎ టోర్నమెంట్‌లో సెమిఫైనల్స్‌కు చేరుకున్న 15 ఏళ్ల, మాయా రాజేశ్వరన్ శిక్షణను ఏమాత్రం మిస్ కాలేదు' అనే క్యాప్షన్ రాయడం విశేషం. ఈ పోస్ట్ గురించి ప్రస్తావిస్తూ... "నాకెంతో ప్రీతిపాత్రమైన మధుర స్మృతుల్లో ఇదొకటి. ఎన్నో విజయాలను సొంతం చేసుకున్న వ్యక్తి, ఇప్పటికీ క్రీడ పట్ల మక్కువను కలిగి ఉండడం గొప్ప విషయం" అంటూ మాయ పేర్కొంటోంది. ఈ టెన్నిస్ సంచలనం భవిష్యత్తులో, సానియా మీర్జాకు మించి మరింత మెరుగ్గా రాణించాలని కోరుకుందాం!

సహజంగా బరువు తగ్గే మార్గాలు ఇవే...

అధిక బరువుతో పలు ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు. సహజ మార్గాల్లో సులభంగా బరువు తగ్గే చిట్కాలను ఇలా సూచిస్తున్నారు...

- ప్రతిరోజూ పావు చెంచా నల్ల జీలకర్ర లేదా కలోంజీని ఆహారంలో చేర్చుకుంటే మూడు నెలల్లో బరువు తగ్గవచ్చు.
- ఉదయం నిద్రలేవగానే పరగడుపున ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో అర చెంచా శొంఠి పొడి



కలుపుకుని తాగితే శరీరంలోని కొవ్వులు కరిగి బరువు తగ్గుతారు.
- ప్రతిరోజూ ఉదయం అల్పాహారం మానకూడదు. ఇందులో పాలు, గుడ్లు, వెజిటబుల్ సూప్, బ్రౌన్ బ్రెడ్, సలాడ్ ఉండేలా చూసుకోవాలి.
- భోజనం చేసిన గంట తరవాత రెండు వెల్లుల్లి రెబ్బలు నమిలి తిన్నా మంచి ఫలితం ఉంటుంది.
- పాలు, చక్కెర కలిపిన టీ, కాఫీ తాగడానికి బదులు నిమ్మరసం, తేనె కలిపిన గ్రీన్ టీ తాగితే శరీరంలోని వ్యర్థపదార్థాలన్నీ విసర్జితమవుతాయి. జీవక్రియలు వేగవంతమై శరీర బరువు క్రమంగా తగ్గుతుంది.
- దాహం వేసినప్పుడు మాత్రమే కాకుండా రెండు గంటలకు ఒకసారి ఒకగ్లాసు మంచినీరు తాగడం వల్ల జీర్ణాశయం పనితీరు మెరుగవుతుంది. తిన్న ఆహార పదార్థాలన్నీ త్వరగా జీర్ణమవుతాయి. మలబద్ధకం లేకుండా పొట్ట శుభ్రంగా ఉంటే శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.
- భోజనం వేళలను క్రమం తప్పకుండా పాటించాలి. రాత్రిపూట వీలైనంత త్వరగా భోజనం పూర్తి చేయాలి.
- ప్రొటీన్లు, పీచుపదార్థాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. నూనెలు, తీపి పదార్థాలు తినడం తగ్గించాలి. తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గింజలు తింటూ ఉంటే పోషకాలు అంది శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. ఊబకాయం తగ్గుతుంది.
- నిద్రలేమి కూడా అధిక బరువుకి కారణమవుతుంది. ప్రతిరోజూ కనీసం ఎనిమిది గంటల నిద్ర ఉండేలా చూసుకోవాలి.


పిల్లలకు క్రమశిక్షణ నేర్పిద్దాం!

తల్లిదండ్రులు ఓపికగా వ్యవహరిస్తేనే పిల్లలు చెప్పినమాట విని క్రమశిక్షణ నేర్చుకుంటారు. ఆడుతూ పాడుతూ పిల్లలను దారిలోకి తెచ్చుకోవడానికి నిపుణులు సూచిస్తున్న చిట్కాలు...

- పిల్లలను చీటికీ మాటికీ కోప్పడకుండా వాళ్లు చేసే పనులను గమనిస్తూ ఉండాలి. మొదట పిల్లలు చేసిన పనిని పొగిడి చిన్న బహుమతి ఇస్తే చాలు. తరవాత తల్లిదండ్రులు ఏమి చెప్పినా పిల్లలు వినడానికి సిద్ధంగా ఉంటారు.
- తల్లిదండ్రులు ప్రతిరోజూ కొంత సమయాన్ని పిల్లలతో గడపాలి. వాళ్లతో మాట్లాడుతూ ఆటలు ఆడించాలి. దీంతో పిల్లలు తమ భావాలను తల్లిదండ్రులతో పంచుకోవడం మొదలుపెడతారు. ఈ సమయంలోనే పిల్లలకు మంచి చెడూ వివరించి చెప్పాలి.
- పిల్లలు ఏ విషయమైనా చెబుతున్నప్పుడు శ్రద్ధగా వినాలి. తరవాత వాళ్లు అడిగే ప్రశ్నలకు క్లుప్తంగా సమాధానాలు చెప్పాలి. పిల్లలవైపు చూస్తూ మృదుస్వరంతో లాలనగా సంభాషించాలి. అప్పుడే తల్లిదండ్రులు చెప్పిన మాటలు విని గుర్తుపెట్టుకోవాలనే భావన పిల్లల్లో కలుగుతుంది.
- పిల్లలతో ప్రేమగా, ప్రశాంతంగా, సహనంగా వ్యవహరించాలి. ఇదే క్రమంలో నైతిక విలువలు, మర్యాద, ఇచ్చి పుచ్చుకునే ధోరణి, స్నేహం, దయ, సహాయం లాంటి వాటి గురించి వివరించి చెప్పాలి. దీంతో పిల్లలు పరస్పర గౌరవాన్ని అర్థం చేసుకోగల్గుతారు.
- సమయానికి పడుకోవడం, నిద్ర లేవడం, హోంవర్క్, పుస్తకాలు సర్దుకోవడం, వ్యక్తిగత శుభ్రతల గురించి పిల్లలకు తెలియజెప్పాలి. దీనివల్ల పిల్లలకు స్వీయ క్రమశిక్షణ అలవడుతుంది.
- ఇంటి పనుల్లో పిల్లలను భాగస్వాములను చేయాలి. స్నేహితులు, బంధువులతో మాట్లాడే విధానాన్ని వివరించి చెప్పాలి.
- స్కూల్ బ్యాగ్ సర్దుకోవడం, డైనింగ్ టేబుల్ క్లీన్ చేయడం, బట్టలు-బొమ్మలను నిర్దేశిత ప్రదేశాల్లో ఉంచడం లాంటి పనులను పిల్లలకే వదిలివేస్తే వాళ్లలో బాధ్యత, స్వతంత్ర భావాలు పెరుగుతాయి. ముందుజాగ్రత్త అలవడుతుంది.











కొత్త షెడ్యూల్‌లో...



రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఎస్‌ఎస్‌ఎమ్‌బీ29' (వర్కింగ్ టైటిల్). చిత్రీకరణ ఇటీవలె ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ ఇప్పటికే పూర్తయింది. ఒడిస్సాలోని కోరపుట్‌లో రెండో షెడ్యూల్ మొదలైంది. ఈ నెలాఖరు వరకూ ఈ షెడ్యూల్ సాగనుంది. సినిమాలోని కీలక సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించనున్నారు. మహేశ్‌బాబు, ప్రియాంక చోప్రా గురువారం ఒడిస్సాకు చేరుకుంటారట. కాగా, దాదాపు రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా రూపొందిస్తున్నారు. మొదటి భాగాన్ని 2027లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు.

సూపర్ స్టార్ వద్దు... నయనతార చాలు



తమిళ నటి నయనతారను అభిమానులంతా 'లేడీ సూపర్‌స్టార్' అని పిలిచే విషయం తెలిసిందే. అయితే, తనను ఇకపై ఇలా పిలవొద్దని అభిమానులకు ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు నయనతార. "మీరంతా నన్ను లేడీ సూపర్ స్టార్ అంటూ నాపై ఆదరాభిమానాలు చూపిస్తున్నారు. మీ ప్రేమకు జీవితాంతం రుణపడి ఉంటాను. కానీ దయచేసి నన్ను లేడీ సూపర్‌స్టార్ అని పిలవకండి. నన్ను 'నయనతార' అని పిలవండి. ఎందుకంటే ఆ పేరు నా హృదయానికి చేరువైనది. నటిగా, వ్యక్తిగా నన్ను ప్రతిబింబిస్తుంది" అని పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం సెంథిల్ నల్లసామి తెరకెక్కిస్తున్న 'రక్కయిీ', యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న 'టాక్సిక్' చిత్రాల్లో నటిస్తున్నారు నయనతార.

మరోసారి కిస్సిక్



వెండితెరపైన హుషారైన స్టెప్పులతో అలరిస్తున్న కథానాయిక శ్రీలీల ఓ పార్టీలోనూ తన డ్యాన్స్‌తో సందడి చేశారు. బాలీవుడ్ కథానాయకుడు కార్తీక్ ఆర్యన్‌తో ఆమె 'ఆషికీ 3' చిత్రం చేస్తున్నారు. ప్రస్తుతం ముంబైలో జరుగుతున్న షూటింగ్‌లో శ్రీలీల పాల్గొంటున్నారు. ఇటీవలే కార్తీక్ ఆర్యన్ తన సోదరి కృతిక తివారికి పార్టీ ఇచ్చారట. ఈ వేడుకకు హాజరైన శ్రీలీల 'పుష్ప 2' చిత్రంలోని 'కిస్సిక్' పాటతో పాటు మరికొన్ని హిందీ గీతాలకు స్టెప్పులేసి ఎంటర్‌టైన్ చేశారు. ఆమెతో పాటు కార్తీక్ ఆర్యన్ సైతం కాలు కదిపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. నితిన్‌తో శ్రీలీల నటించిన 'రాబిన్‌హుడ్' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

సందేశంతో వినోదం



యువతను ఆకట్టుకునే చక్కని ప్రేమకథతో తెరకెక్కుతోన్న చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్నారు. సంజీవ్‌రెడ్డి దర్శకత్వంలో మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్‌రెడ్డి నిర్మిస్తున్నారు. తరుణ్ భాస్కర్, వెన్నెల కిశోర్ కీలకపాత్రలు పోషించారు. చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా 'సంతాన ప్రాప్తిరస్తు' చిత్రం టీజర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. ఈతరం యువత ఎదుర్కొంటున్న సంతాన లేమి సమస్యను ఇతివృత్తంగా చేసుకొని రూపొందించిన సినిమా ఇదని దర్శకుడు తెలిపారు. మంచి సందేశంతో పాటు ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలు ఉన్న చిత్రమిదని నిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, సినిమాటోగ్రఫీ: మహిరెడ్డి పండుగుల

మహిళలకు అంకితం



'ఇంతవరకూ ఎనిమిది సినిమాలకు సంగీత దర్శకత్వం వహించా. నిర్మాత అశోక్ సహకారంతో ఇప్పుడు దర్శకుడిగా మారాను. మహిళా దినోత్సవం సందర్భంగా విడుదలవుతున్న ఈ చిత్రాన్ని మహిళలకు అంకితం ఇస్తున్నాం' అన్నారు షెరాజ్ మెహ్ది. ఆయన రూపొందించిన 'పౌరుషం' చిత్రం ఈ నెల 7న విడుదలవుతున్న సందర్భంగా బుధవారం జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నిర్మాత అశోక్ ఖుల్లార్ మాట్లాడుతూ 'ఇందులో రొమాన్స్, యాక్షన్, ఫ్యామిలీ డ్రామా అన్నీ ఉన్నాయి. ప్రపంచంలో ఆడవాళ్లు లేకుండా మగవాళ్లు లేరు. వాళ్ల సపోర్ట్‌తో మనం ముందుకు వెళ్లాలి అనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. సినిమా బాగా వచ్చింది. మంచి కంటెంట్ కలిగిన ఈ చిత్రాన్ని ఆదరించమని కోరుతున్నాం' అన్నారు. సుమన్, మేకా రామకృష్ణ, షెరాజ్, అశోక్ ఖుల్లార్, కుష్బూ జైన్, జ్యోతిరెడ్డి తదితరులు ఈ చిత్రంలో నటించారు.

సరికొత్త సైకో థ్రిల్లర్



సంతోష్ కల్వచెర్ల, క్రిషేక పటేల్ జంటగా నటించిన 'ఆర్టిస్ట్' చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. రతన్ రిషి దర్శకత్వంలో జేమ్స్ వాట్ కొమ్ము ఈ చిత్రాన్ని నిర్మించారు. చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో నిర్మాత మాట్లాడుతూ 'అమెరికా నుంచి ఈ మూవీ కోసం ఎన్నో సార్లు ఇక్కడకు వచ్చాను. కొత్త వాళ్లకు అవకాశం ఇవ్వాలని నా కోరిక. మా సంస్థలో ఇది రెండో సినిమా. భవిష్యత్‌లో కూడా సినిమాలు తీస్తాను. సొసైటీకి కావాల్సిన మంచి కంటెంట్‌తో ఈ సినిమా తీశాం. మా చిత్రం నచ్చి మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ నెల 21న విడుదల చేస్తున్నారు' అని చెప్పారు. దర్శకుడు రతన్ రిషి మాట్లాడుతూ 'ఇదొక సరికొత్త సైకో థ్రిల్లర్. సాధారణంగా ఓ హత్య జరిగిన తర్వాత కిల్లర్ ఎవరనేది పరిశోధన జరుగుతుంది. కానీ మా సినిమాలో విలన్ ఎవరో మొదటే చెప్పేసి భయపెట్టే ప్రయత్నం చేశాం. నాకు మంచి టీమ్ దొరికింది' అన్నారు.

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
వరంగల్ ● గురువారం 6 మార్చి 2025

సాయి తేజ్ సాహసాలు!



సాయి దుర్గతేజ్ కంప్లీట్ యాక్షన్ ప్యాక్డ్ పాత్రలో నటిస్తున్న 'సంబరాల ఏటిగట్టు' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఇటీవలే రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ కంపోజ్ చేసిన యాక్షన్ ఎపిసోడ్‌ను ఓ భారీ సెట్‌లో చిత్రీకరించారు. చాలా రిస్క్‌తో కూడుకున్న ఈ ఫైట్‌లో సాయి దుర్గ తేజ్ పాల్గొని అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. ప్రస్తుతం దినేశ్ మాస్టర్ కొరియోగ్రఫీలో ఓ పాటను భారీ ఎత్తున చిత్రీకరిస్తున్నారు. వెయ్యి మంది డ్యాన్సర్లు ఇందులో పాల్గొనడం ఓ విశేషం. ఇటీవలి కాలంలో భారీ స్థాయిలో చిత్రీకరించిన పాటల్లో ఇదొకటి. రూ.125 కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. 'హను-మాన్' చిత్రం తర్వాత కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రోహిత్ దర్శకుడు. ఐశ్వర్య లక్ష్మీ, జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల ఇతర ముఖ్య తారాగణం.

మంచి కంటెంట్ ఉంటేనే సినిమా చూస్తున్నారు



- దిల్ రాజు

'పవన్‌కల్యాణ్ నటించిన 'తొలి ప్రేమ' చిత్రాన్ని డిస్ట్రిబ్యూషన్ చేసినప్పుడు ఐదేళ్ల సినిమా హక్కులు మా దగ్గర ఉండేవి. ఎప్పుడు డబ్బు అవసరమైతే అప్పుడు రీ రిలీజ్ చేస్తే మంచి అమౌంట్ వచ్చేది. నిజంగా అవన్నీ మిరాకిల్ డేస్. అలాగే ఇప్పుడు కూడా రీ రిలీజ్‌కు ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తున్నారు' అన్నారు దిల్ రాజు. వెంకటేశ్, మహేశ్ నటించిన 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు' చిత్రం ఈ నెల 7న మళ్లీ విడుదల చేస్తున్న సందర్భంగా బుధవారం మీడియాతో మాట్లాడుతూ 'ఈ సినిమా ఓటీటీలో ఉంది. చాలా మంది చూసేశారు. అయినా ఇప్పుడు మళ్లీ థియేటర్లకు చూడడానికి ప్రేక్షకులు సిద్ధంగా ఉన్నారంటే కారణం .. మంచి కంటెంట్. ఇప్పటికే పది థియేటర్లు ఫుల్ అయ్యాయి. మంచి సినిమాలు తీస్తే జనం మళ్లీ మళ్లీ థియేటర్‌కు వస్తారని రీ రిలీజులు నిరూపిస్తున్నాయి. పన్నెండేళ్ల తర్వాత ఈ సినిమాను మళ్లీ జనంతో పాటు థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేయాలని ఉంది. అందుకే ఆ రోజు సుదర్శన్ లో మార్నింగ్ షో చూస్తా' అని చెప్పారు.

లుక్ లాకయ్యింది



రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'ఆర్‌సీ16' (వర్కింగ్ టైటిల్) సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాలో ఆయన పోషిస్తున్న లుక్ టెస్ట్‌ను పూర్తి చేశారు. ఈ విషయాన్ని అభిమానులతో సోషల్ మీడియాలో పంచుకున్నారు మేకర్స్. లుక్ టెస్ట్ పూర్తయ్యింది. అద్భుతమైన లుక్‌ను లాక్ చేశాం అని తెలిపారు. త్వరలోనే ఆయన తన పాత్ర కోసం చిత్రీకరణలో జాయిన్ అవుతారని.. రెగ్యులర్ షూట్‌లో పాల్గొంటారని చెప్పారు. ఈ సినిమాలో జాన్వీకపూర్ కథానాయిక. జగపతిబాబు కీలక పాత్రలో నటిస్తున్నారు. స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రానికి 'పెద్ది' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు.

దేవుడు మమ్మల్ని కాపాడతాడు



- కంగనా రనౌత్

కర్ణాటక డిప్యూటీ సీఎం డీ.కే.శివకుమార్ కన్నడ నటీనటులపై చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్ పరోక్షంగా స్పందించారు. 'ఎవరైనా సినిమా వాళ్ల నట్లు, బోల్టులు టైట్ చేయాలనుకుంటే, దేవుడు మమ్మల్ని కాపాడతాడు. భగవంతుడు కళాకారులందరికీ అండగా నిలబడతాడు" అని హీరోయిన్ రష్మికకు మద్దతుగా మాట్లాడారు. కర్ణాటకలోని శ్రీహోస మారిగుడి దేవస్థానానికి వచ్చిన సందర్భంగా కంగన ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, ఇటీవలె శాండల్‌వుడ్ నటీ నటులపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్నడ భూమి, భాష గురించి నటీనటులు పట్టించుకోవడం లేదని, అలాంటి వాళ్ల నట్లు, బోల్టులు టైట్ చేస్తానని హెచ్చరించారు. ఈ వేడుకకు నటి రష్మిక మందన్నను ఆహ్వానించినా ఆమె రాలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి గౌడ గణిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

సిరిమంతుల భారతం!

6 శాతం వృద్ధితో దేశంలో 85,698 మంది బడా శ్రీమంతులు



- 191కి చేరిన కుబేరుల సంఖ్య
- వారి మొత్తం సంపద రూ.82.65 లక్షల కోట్లు
- నైట్‌ఫ్రాంక్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో కోటి డాలర్లకు (రూ.87 కోట్లు) పైగా ఆస్తులు కలిగిన హై నెట్‌వర్త్ ఇండివిజువల్స్ (హెచ్‌ఎన్‌ఐ) సంఖ్య గత ఏడాదిలో మరో 6 శాతం పెరిగి 85,698కి చేరుకుందని ప్రాపర్టీ కన్సల్టింగ్ కంపెనీ నైట్‌ఫ్రాంక్ వెల్లడించింది. 2023లో వీరి సంఖ్య 80,686గా నమోదైంది. బుధవారం సంస్థ విడుదల చేసిన 'ది వెల్త్ రిపోర్ట్ 2025' ప్రకారం.. గత ఏడాది చివరి నాటికి దేశంలోని బిలియనీర్ల (కనీసం 100 కోట్ల డాలర్లు లేదా రూ.8,700 కోట్ల సంపద కలిగిన వారు) సంఖ్య 191కి పెరిగింది. అంతక్రితం సంవత్సరంతో పోలిస్తే కొత్తగా 26 మంది బిలియనీర్లుగా ఎదిగారు. ఆ నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- దేశంలో శ్రీమంతులు వేగంగా పెరుగుతున్నారు. 2028 నాటికి హెచ్‌ఎన్‌ఐల సంఖ్య 93,753కు చేరుకోవచ్చని అంచనా. దీర్ఘకాలంలో బలమైన వృద్ధి, పెరుగుతున్న పెట్టుబడి అవకాశాలతో పాటు లగ్జరీ ఉత్పత్తులు, సేవల మార్కెట్ పుంజుకోనుందని ఈ ట్రెండ్ నొక్కి చెబుతోంది. ప్రపంచ సంపద సృష్టిలో భారత్ కీలక దేశంగా మారనుంది.
- ప్రపంచంలోని మొత్తం హెచ్‌ఎన్‌ఐల లో 3.7 శాతం మంది భారతీయులే. హెచ్‌ఎన్‌ఐల విషయంలో అమెరికా (9.05 లక్షల మంది), చైనా (4.71 లక్షలు), జపాన్ (1.22 లక్షలు) తర్వాత నాలుగో స్థానం భారత్‌దే.
- దేశంలోని బిలియనీర్ల మొత్తం సంపద విలువ 95,000 కోట్ల డాలర్ల (రూ.82.65 లక్షల కోట్లు) స్థాయిలో ఉండవచ్చని అంచనా. బిలియనీర్ల మొత్తం సంపద విషయంలో అమెరికా (5.7 లక్షల కోట్ల డాలర్లు), చైనా (1.34 లక్షల కోట్ల డాలర్లు) తర్వాత మూడో స్థానం భారత్‌దే.

విలాస గృహాల ధరల పెరుగుదలలో ఢిల్లీకి 18వ స్థానం

గత ఏడాదికిగాను ప్రపంచంలోని 100 నగరాల్లో విలాస గృహాల ధరల వార్షిక పెరుగుదల విషయంలో ఢిల్లీ 18వ స్థానంలో నిలిచింది. ముంబై 21, బెంగళూరు 40వ స్థానంలో ఉన్నాయని నైట్‌ఫ్రాంక్ వెల్లడించింది. గత ఏడాది ఢిల్లీలో లగ్జరీ హౌసింగ్ ధరలు సగటున 6.7 శాతం పెరిగాయని తెలిపింది. 2023లో 37వ స్థానంలో ఉన్న ఢిల్లీ 2024లో 18వ స్థానానికి ఎగబాకగా.. బెంగళూరు 59 నుంచి 40వ స్థానానికి పుంజుకుంది. ముంబై మాత్రం 13వ స్థానం నుంచి 21వ స్థానానికి జారుకుంది.

లగ్జరీ వస్తువుల ధరలు తగ్గాయ్..

కొందరు శ్రీమంతులు కేవలం ప్రాపర్టీ, షేర్లు, బంగారంలోనే కాదు వ్యక్తిగత అభిరుచి మేరకు ప్రముఖ కళాకారులు గీసిన చిత్రపటాలు, అరుదుగా లభించే కళాకృతులు, వైన్, విస్కీ, వజ్రాలు, ఫర్నీచర్‌పైనా పెట్టుబడి పెడుతుంటారు. గత ఏడాది మాత్రం వీటి ధరలు తగ్గాయని నైట్‌ఫ్రాంక్ వెల్లడించింది. పెయింటింగ్స్ రేట్లు 18.3 శాతం, ఫైన్ వైన్, అరుదుగా లభించే విస్కీ ధరలు 9 శాతం చొప్పున తగ్గాయని తెలిపింది. అయితే లగ్జరీ హ్యాండ్‌బ్యాగ్‌ల ధరలు మాత్రం 2.8 శాతం పెరిగాయని, జువెలరీ 2.3 శాతం, కాయిన్స్ 2.1 శాతం, లగ్జరీ వాచ్‌లు 1.7 శాతం, క్లాసిక్ కార్ల రేటు 1.2 శాతం వృద్ధి చెందాయని నైట్‌ఫ్రాంక్ నివేదికలో పేర్కొంది.

భారత్‌లో హెచ్‌ఎన్‌ఐల సంఖ్య అసాధారణ స్థాయిలో పెరుగుతోంది. భారతీయుల వ్యాపార సామర్థ్యం, ప్రపంచ అనుసంధానత, ఆధునిక పారిశ్రామిక రంగాలు ఇందుకు దోహదపడుతున్నాయి. సంపద పెరుగుదలతోపాటు సిరిమంతుల పెట్టుబడుల ప్రాధాన్యాలూ విస్తరించాయి. రియల్ ఎస్టేట్ నుంచి ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల వరకు తమ పెట్టుబడులను వివిధీకరిస్తున్నారు. వచ్చే దశాబ్ద కాలంలో ప్రపంచ సంపద సృష్టిలో భారత్ మరింత కీలకం కానుంది.

\- శిశిర్ బైజాల్, చైర్మన్/ఎండీ నైట్‌ఫ్రాంక్ ఇండియా

సింగపూర్ కంపెనీతో అరబిందో కటీఫ్

న్యూఢిల్లీ: పెంటావలెంట్ వ్యాక్సిన్ల అభివృద్ధి, ఉత్పత్తి కోసం సింగపూర్ కంపెనీ హిల్లేమాన్ ల్యాబ్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని అరో వ్యాక్సీన్స్ రద్దు చేసుకుంది. అరో వ్యాక్సీన్స్ మాతృ సంస్థ అరబిందో ఫార్మా బుధవారం రెగ్యులేటరీ సంస్థలకు ఈ విషయం తెలిపింది. పిల్లల్లో ధనుర్వాతం, కోరింత దగ్గు వంటి ఐదు కీలక ప్రాణాంతక వ్యాధుల నివారణ కోసం ఈ వ్యాక్సిన్లను ఉపయోగిస్తారు. ఈ వ్యాక్సిన్ల అభివృద్ధి, ఉత్పత్తి కోసం 2023 సెప్టెంబరు 27న రెండు కంపెనీల మధ్య ఒప్పందం కుదిరింది. అయితే ఏ కారణంతో ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నదీ అరబిందో ఫార్మా వెల్లడించలేదు. ఈ ఒప్పందం రద్దు తమ పైనా, అనుబంధ కంపెనీల పైనా ఎలాంటి ప్రభావం చూపబోదని మాత్రం తెలిపింది.

ఫిబ్రవరిలో సేవల రంగం జోరు

న్యూఢిల్లీ: దేశీయ, అంతర్జాతీయ డిమాండు పెరిగిన కారణంగా సేవల రంగం ఫిబ్రవరిలో అద్భుతమైన వృద్ధిని నమోదు చేసింది. హెచ్‌ఎస్‌బీసీ సేవల రంగం పీఎంఐ 26 నెలల కనిష్ఠ స్థాయి 56.5 పాయింట్ల నుంచి 59 పాయింట్లకు దూసుకుపోయింది. కొత్త వ్యాపారాల రాకతో సేవల రంగంలోని కంపెనీలు కొత్త నియామకాలు చేపట్టేందుకు సమాయత్తం అవుతున్నాయని సర్వేలో తేలింది.

ఎట్టకేలకు నష్టాలకు తెర

రిలీఫ్ ర్యాలీతో రూ.7.97 లక్షల కోట్ల సంపద వృద్ధి



ముంబై: రిలీఫ్ ర్యాలీతో బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్ మంచి లాభాలతో ముగిసింది. సెన్సెక్స్ 740.30 పాయింట్ల లాభంతో 73,730.23 వద్ద, నిఫ్టీ 254.65 పాయింట్ల లాభంతో 22,337.30 వద్ద ముగిశాయి. దీంతో గత పది రోజుల నిఫ్టీ నష్టాలకు బ్రేక్ పడింది. ఈ రిలీఫ్ ర్యాలీతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ బుధవారం రూ.7.97 లక్షల కోట్లు పెరిగి రూ.393.04 లక్షల కోట్లకు చేరింది. యుటిలిటీస్, పవర్, సర్వీసెస్, మెటల్, టెలికాం, కమోడిటీస్, ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల షేర్లకు పెద్ద ఎత్తున కొనుగోళ్ల మద్దతు లభించడం, ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు మంచి లాభాలతో ట్రేడవడం; మెక్సికో, కెనడాలపై విధించిన సుంకాలపై అమెరికా పునరాలోచిస్తోందన్న వార్తలు ఇందుకు తోడయ్యాయి. ప్రధాన కరెన్సీలతో అమెరికా డాలర్ మారకం రేటు బలహీనపడడం కూడా ఇందుకు కలిసొచ్చింది. అయితే ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం దీర్ఘకాలిక ప్రభావంపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. దీంతో ఈ రిలీఫ్ ర్యాలీ ఎన్నాళ్లు కొనసాగుతుందనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్సెల్‌సాఫ్ట్ నుంచి రూ.700 కోట్ల ఐపీఓ!

మైసూరు కేంద్రంగా పనిచేసే ఎక్సెల్ సాఫ్ట్ టెక్నాలజీస్ కంపెనీ రూ.700 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతోంది. కంపెనీ ఇందు కోసం ఇప్పటికే సెబీకి దరఖాస్తు చేసింది. కొత్త షేర్ల జారీ ద్వారా రూ.210 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.490 కోట్లు సమీకరించనున్నట్లు తెలిపింది. కొత్త షేర్ల జారీ ద్వారా సమీకరించే నిధులను కంపెనీ అభివృద్ధి కార్యక్రమాల కోసం వినియోగించనున్నట్లు తెలిపింది.

హైదరాబాద్‌లో మరో నాలుగు ప్రాజెక్టులు

వైజాగ్, అమరావతికీ కాసాగ్రాండ్ విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): చెన్నై కేంద్రంగా పనిచేసే ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ 'కాసాగ్రాండ్' హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా కొంపల్లి, అత్తాపూర్, గౌడవల్లి, మంఖల్ వద్ద రూ.2,500 కోట్ల పెట్టుబడితో నాలుగు ప్రీమియం రెసిడెన్షియల్ ప్రాజెక్టులు ప్రారంభించింది. ఇందులో రెండు విల్లా ప్రాజెక్టులు, రెండు హైరైజ్ కమ్యూనిటీ టవర్లని కంపెనీ ఎండీ అరుణ్ చెప్పారు. మూడు, నాలుగు బెడ్ రూమ్స్‌తో నిర్మించే ఈ నాలుగు ప్రాజెక్టులను ఏడాదిన్నర నుంచి మూడేళ్లలో పూర్తి చేస్తామన్నారు. 2,000 నుంచి 2,800 ఎస్ఎఫ్‌టీ ఉండే ట్రిపుల్, ఫోర్ బెడ్‌రూమ్స్ ఫ్లాట్ల కనీస ధర రూ.1.4 కోట్లు, 450 గజాల్లో 4000 ఎస్ఎఫ్‌టీలో నిర్మించే విల్లాల ధర రూ.4.2 కోట్లు ఉంటుందని చెప్పారు.

ఏపీపైనా దృష్టి: కాసాగ్రాండ్ ఆంధ్రప్రదేశ్‌కి విస్తరించేందుకు కూడా సిద్ధమవుతోంది. ఇందుకోసం వైజాగ్, అమరావతిలో కొన్ని ప్రాంతాలను పరిశీలిస్తున్నట్టు అరుణ్ చెప్పారు. ఆరు నుంచి ఎనిమిది నెలల్లో ఈ ప్రాజెక్టులపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రస్తుత నాలుగు ప్రాజెక్టులకు తోడు హైదరాబాద్‌లో త్వరలో మరో నాలుగు ప్రీమియం రెసిడెన్షియల్ ప్రాజెక్టులు ప్రారంభించే యోచన ఉందన్నారు. అత్యాధునిక సదుపాయాలతో నిర్మించే తమ ప్రాజెక్టులన్నీ ప్రీమియం మిడ్ సెగ్మెంట్‌లోకి వస్తాయన్నారు.

'డిస్‌ప్లే చిప్'ల తయారీలోకి టాటా

గుజరాత్‌లో ప్లాంట్ ఏర్పాటు

గాంధీనగర్: టాటా గ్రూప్‌నకు చెందిన టాటా ఎలక్ట్రానిక్స్ డిస్‌ప్లే చిప్‌ల తయారీలోకి ప్రవేశిస్తోంది. ఇందుకోసం తైవాన్‌కు చెందిన పీఎస్ఎంసీ, హైమాక్స్ టెక్నాలజీస్‌తో కలిసి గుజరాత్‌లో ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు టాటా ఎలక్ట్రానిక్స్ సీఈఓ రణధీర్ ఠాకూర్ బుధవారం తెలిపారు. ప్లాంట్ ఏర్పాటు కోసం గుజరాత్ ప్రభుత్వంతో అగ్రిమెంట్ కూడా కుదుర్చుకున్నట్లు ఐఈఎస్ఏ విజన్ సదస్సులో వెల్లడించారు. డిస్‌ప్లే చిప్‌లను టీవీలు, మొబైల్ ఫోన్ స్క్రీన్లు, కెమెరా ఇమేజ్ సెన్సర్లు, ఎల్ఈడీలు, ఓఎల్ఈడీ ఉత్పత్తుల్లో విరివిగా వాడతారు. అనిల్ అగర్వాల్‌కు చెందిన వేదాంత గ్రూప్ సైతం గుజరాత్‌లో డిస్‌ప్లే చిప్‌ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలనుకున్నప్పటికీ, ఆ ప్రతిపాదిత ప్రాజెక్ట్‌కు ప్రభుత్వం ఇంకా అనుమతులు మంజూరు చేయలేదు.

ప్లాంట్‌కు ఆర్థిక మద్దతు కోసం ఒప్పందం: రూ.91,000 కోట్ల పెట్టుబడులతో గుజరాత్‌లో ఏర్పాటు చేయబోతున్న సెమీకండక్టర్ల తయారీ ప్లాంట్‌కు ఆర్థిక మద్దతు కోసం టాటా ఎలక్ట్రానిక్స్, టాటా సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీలు బుధవారం ఇండియా సెమీకండక్టర్ విషన్‌తో (ఐఎస్ఎం) ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఐఎస్ఎం ద్వారా కేంద్రం అర్హత కలిగిన ప్రాజెక్టులకు వ్యయాల్లో 50 శాతం ఆర్థిక మద్దతు కల్పించనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	430
వరంగల్	412	గోదావరి	425
చిత్తూరు	443	విశాఖపట్నం	435
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	85	విజయవాడ	101
వరంగల్	85	గుంటూరు	95
కరీంనగర్	85	ఒంగోలు	95
మహబూబ్‌నగర్	85	చిత్తూరు	89
కర్నూలు	85	నెల్లూరు	94
విశాఖపట్నం	100	అనంతపురం	94
గోదావరి	101		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,980 ▲	80,650 ▲	1,07,000 ▲
విజయవాడ	89,000 ▼	84,250 ▲	98,500 ▲
విశాఖపట్నం	86,340 ▼	79,150 ▼	97,490 ▲
రాజమండ్రి	87,820 ▲	80,500 ▲	98,200 ▲
ప్రొద్దుటూరు	88,400 ▲	81,360 ▲	98,000 ▲
ముంబై	86,300 ▼	79,050 ▼	95,990 ▲

స్పోర్ట్స్

కివీస్ వచ్చేసింది

భారత్‌తో ఫైనల్‌కు సై

- రచిన్, కేన్ శతక హోరు
- సెమీస్‌లో దక్షిణాఫ్రికా చిత్తు
- మిల్లర్ సెంచరీ వృథా

చాంపియన్స్ ట్రోఫీ


మిల్లర్ (100 నాటౌట్)


రచిన్ రవీంద్ర (108)
కేన్ విలియమ్సన్ (102)

లాహోర్: పరుగుల వరద పారిన మ్యాచ్‌లో అదరగొట్టిన న్యూజిలాండ్ చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) ఫైనల్‌కు దూసుకెళ్లగా.. దక్షిణాఫ్రికా మరోసారి నాకౌట్ మ్యాచ్‌లో ఒత్తిడికి చిత్తయింది. ఆదివారం జరిగే టైటిల్ ఫైట్‌లో భారత్‌తో అమీతుమీకి కివీస్ సిద్ధమైంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' రచిన్ రవీంద్ర (101 బంతుల్లో 13 ఫోర్లు, సిక్స్‌తో 108), కేన్ విలియమ్సన్ (94 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 102) సెంచరీల మోతతో.. బుధవారం జరిగిన రెండో సెమీస్‌లో కివీస్ 50 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ టోర్నీ చరిత్రలోనే అత్యధికంగా 362/6 స్కోరు సాధించింది. ఎన్‌గిడి 3, రబాడ 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో డేవిడ్ మిల్లర్ (67 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 100 నాటౌట్) శతకంతో పోరాడినా.. దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 9 వికెట్లకు 312 పరుగులు మాత్రమే చేయగలిగింది. శాంట్నర్ 3, హెన్రీ, ఫిలిప్స్ చెరో 2 వికెట్లు తీశారు.

రచిన్, కేన్ విజృంభణ: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న కివీస్.. పవర్‌ప్లేలోనే ఓపెనర్ యంగ్ (21) వికెట్‌ను కోల్పోయింది. అయితే, మరో ఓపెనర్ రచిన్, విలియమ్సన్ సఫారీ బౌలర్లను ఆటాడుకొన్నారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 164 రన్స్ జోడించడంతో.. కివీస్ కొండంత స్కోరు చేసింది. శతకం సాధించిన రచిన్‌ను అవుట్ చేసిన రబాడ.. జట్టుకు ఊరటనిచ్చాడు. డెత్ ఓవర్లలో డారెల్ మిచెల్ (49), గ్లెన్ ఫిలిప్స్ (49 నాటౌట్) బ్యాట్లను ఝుళిపించడంతో జట్టు స్కోరు 360 దాటింది.

దెబ్బకొట్టిన శాంట్నర్: భారీ ఛేదనను దక్షిణాఫ్రికా ఆశావహంగా ఆరంభించినా.. కెప్టెన్ శాంట్నర్ (3/43) కీలక సమయంలో మూడు వికెట్లతో దెబ్బ కొట్టడంతో సఫారీల ఆట ఒక్కసారిగా గతి తప్పింది. ఓపెనర్ రికెల్టన్ (17)ను హెన్రీ స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేర్చాడు. కానీ, బవుమా (56), డుస్సెన్ (69) రెండో వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, అర్ధ శతకం సాధించిన బవుమాను శాంట్నర్ అవుట్ చేశాడు. అప్పటికి జట్టు స్కోరు 23 ఓవర్లలో 128/2. మిడిలార్డర్‌లో హిట్టర్లు ఉండడంతో మ్యాచ్ ఆసక్తిగా మారుతుందనుకున్నా.. డుస్సెన్‌తోపాటు క్లాసెన్ (3)ను శాంట్నర్ పెవిలియన్ చేర్చడంతో సౌతాఫ్రికా 167/4తో కష్టాల్లో పడింది. ఈదశలో కివీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేస్తూ.. బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. నిలకడగా ఆడుతున్న మార్‌క్రమ్ (31)ను రచిన్ రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేయడంతో.. మ్యాచ్ కివీస్‌వైపు మొగ్గింది. మల్డర్ (8), జెన్సన్ (3), కేశవ్ మహరాజ్ (1) సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగారు. చివరి బంతికి సెంచరీ చేసిన మిల్లర్.. ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగాడు.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్: యంగ్ (సి) మార్‌క్రమ్ (బి) ఎన్‌గిడి 21, రచిన్ (సి) క్లాసెన్ (బి) రబాడ 108, విలియమ్సన్ (సి) ఎన్‌గిడి (బి) మల్డర్ 102, మిచెల్ (సి) రబాడ (బి) ఎన్‌గిడి 49, లాథమ్ (బి) రబాడ 4, ఫిలిప్స్ (నాటౌట్) 49, బ్రేస్‌వెల్ (సి) రికెల్టన్ (బి) ఎన్‌గిడి 16, శాంట్నర్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 50 ఓవర్లలో 362/6; వికెట్ల పతనం:** 1-48, 2-212, 3-251, 4-257, 5-314, 6-360; **బౌలింగ్:** జెన్సన్ 10-0-79-0, ఎన్‌గిడి 10-0-72-3, రబాడ 10-1-70-2, ముల్డర్ 6-0-48-1, కేశవ్ 10-0-65-0, మార్‌క్రమ్ 4-0-23-0.

దక్షిణాఫ్రికా: రికెల్టన్ (సి) బ్రేస్‌వెల్ (బి) హెన్రీ 17, బవుమా (సి) విలియమ్సన్ (బి) శాంట్నర్ 56, డుస్సెన్ (బి) శాంట్నర్ 69, మార్‌క్రమ్ (సి అండ్ బి) రచిన్ 31, క్లాసెన్ (సి) హెన్రీ (బి) శాంట్నర్ 3, మిల్లర్ (నాటౌట్) 100, మల్డర్ (సి) రచిన్ (బి) బ్రేస్‌వెల్ 8, జెన్సన్ (ఎల్బీ) ఫిలిప్స్ 3, కేశవ్ (సి) లాథమ్ (బి) ఫిలిప్స్ 1, రబాడ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 16, ఎన్‌గిడి (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 50 ఓవర్లలో 312/9; వికెట్ల పతనం:** 1-20, 2-125, 3-161, 4-167, 5-189, 6-200, 7-212, 8-218, 9-256; **బౌలింగ్:** హెన్రీ 7-0-43-2, జేమిసన్ 7-1-57-0, విల్ ఒరోర్క్ 8-0-69-0, బ్రేస్‌వెల్ 10-0-53-1, శాంట్నర్ 10-0-43-3, రచిన్ 5-0-20-1, ఫిలిప్స్ 3-0-27-2.

1 చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా న్యూజిలాండ్ (362/6). ఇదే టోర్నీలో ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా (356/5) చేసిన రికార్డును కివీస్ బద్దలుకొట్టింది.

5 వన్డేల్లో రచిన్ రవీంద్ర సెంచరీలు. ఇవన్నీ ఐసీసీ టోర్నీల్లో సాధించినవే. 2023 వరల్డ్ కప్‌లో 3 శతకాలు బాదిన రచిన్.. ప్రస్తుత చాంపియన్స్ ట్రోఫీలో 2 సెంచరీలు కొట్టాడు. ఇలా ఐసీసీ టోర్నీలో ఐదు శతకాలు సాధించిన ఏకైక ఆటగాడిగా రచిన్ రికార్డులకెక్కాడు. బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మదుల్లా (4 సెంచరీలు)ను దాటాడు.

శరత్.. టీటీకి గుడ్‌బై



నెలాఖరులో జరిగే డబ్ల్యూటీటీ చివరిదని ప్రకటన

చెన్నై: భారత టీటీకి అంతర్జాతీయ సొబగులద్దిన ఆటగాడు. చైనా, కొరియా, జపాన్ దేశాల మేటి ప్లేయర్లకు ముచ్చెమటలు పట్టించిన వీరుడు. యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచిన తెలుగు అథ్లెట్. రెండు దశాబ్దాలకుపైగా కెరీర్‌లో ఎన్నో సంచలనాలు సృష్టించి దేశ టేబుల్ టెన్నిస్‌కు పర్యాయంగా నిలిచిన 42 ఏళ్ల ఆచంట శరత్ కమల్ ఆటకు వీడ్కోలు పలకనున్నాడు. 22 ఏళ్ల సుదీర్ఘ టీటీ కెరీర్ నుంచి ఈ నెలాఖరున రిటైర్ కానున్నట్టు బుధవారం వెల్లడించాడు. ఈనెల 25 నుంచి 30 వరకు ఇక్కడ జరిగే వరల్డ్ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెడర్ టోర్నమెంట్ (డబ్ల్యూటీటీ) తనకు కెరీర్‌లో చివరిదని తెలిపాడు. ఆ టోర్నీ సందర్భంగా సొంతూళ్లో, కుటుంబ సభ్యులు, స్నేహితుల నడుమ ఆటకు గుడ్ బై చెప్పాలని తమిళనాడుకు చెందిన శరత్ నిర్ణయించుకున్నాడు.

కమల్ కెరీర్ ఇలా..

- కామన్వెల్త్ స్వర్ణాలు-7, రజతాలు-3, కాంస్యాలు-3
- ఆసియా క్రీడలు- 2 కాంస్యాలు
- ఆసియా చాంపియన్‌షిప్- 4 కాంస్యాలు
- జాతీయ చాంపియన్‌షిప్- 10 సార్లు

అవార్డులు
పద్మశ్రీ, ఖేల్‌రత్న, అర్జున

అసామాన్య ఆటగాడు: కమల్ కెరీర్‌లో సాధించిన ఘనతలు లెక్కకు మిక్కిలి. అతడు అందుకున్న విజయాలు ఎన్నో ఉన్నాయి. వీటిలో ఏకంగా 7 కామన్వెల్త్ స్వర్ణ పతకాలున్నాయి. ఆసియా క్రీడల్లో రెండు కాంస్యాలు దక్కించుకున్నాడు. ఒలింపిక్స్‌లో ఐదుసార్లు ప్రాతినిధ్యం వహించాడు. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో శరత్ కమల్‌కు అరుదైన గౌరవం దక్కింది. క్రీడల ప్రారంభోత్సవంలో దేశ పతాకను చేబూని భారత బృందాన్ని నడిపించాడు. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న ఉత్సాహంతో మరో కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో పాల్గొనాలని కమల్ భావించాడు. కానీ ఆ నిర్ణయాన్ని మార్చుకున్నాడు. 'భారీగా అభిమానులు హాజరయ్యే టోర్నీ సందర్భంగా నా ర్యాకెట్‌కు, బందన (మ్యాచ్‌ల సమయంలో కమల్ తలకు ధరించే కర్చీఫ్)కు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించుకున్నా' అని శరత్ చెప్పాడు.

వన్డేలకు స్మిత్ వీడ్కోలు



దుబాయ్: ఆస్ట్రేలియా తాత్కాలిక సారథి స్టీవెన్ స్మిత్ వన్డే క్రికెట్‌కు బుధవారం రిటైర్మెంట్ ప్రకటించాడు. చాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్లో భారత్ చేతిలో ఆసీస్ నాలుగు వికెట్లతో ఓడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 50 ఓవర్ల ఫార్మాట్‌కు వీడ్కోలు పలకాలని స్మిత్ నిర్ణయించుకున్నాడు. అయితే 35 ఏళ్ల స్టీవ్.. టెస్టులు, టీ20లలో కొనసాగనున్నట్టు తెలిపాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ గాయంతో వైదొలగడంతో చాంపియన్స్ ట్రోఫీలో స్మిత్ సారథ్యం వహించాడు. మంగళవారం టీమిండియాతో మ్యాచ్ ముగియగానే..తన రిటైర్మెంట్ విషయాన్ని సహచరులకు స్మిత్ తెలిపాడు. 2015, 2023లో ఆస్ట్రేలియా జట్టు వన్డే వరల్డ్ కప్‌లు సాధించడంలో స్మిత్‌ది కీలక భూమిక. 2015, 2021లో 'ఆస్ట్రేలియా పురుషుల వన్డే ఆటగాడు' అవార్డులు అందుకున్నాడు. 2015లో 'ఐసీసీ వన్డే పురుషుల జట్టు'లో స్టీవ్‌కు చోటు దక్కింది. 2015లో ఆసీస్ వన్డే జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. మొత్తం 64 వన్డేల్లో స్మిత్ సారథ్యం వహించాడు. '2027 వన్డే ప్రపంచ కప్‌నకు సన్నాహకాలు ప్రారంభించాల్సిన తరుణం ఆసన్నమైంది. అందువల్ల నేను వైదొలగేందుకు ఇదే సరైన సమయమని భావించా' అని స్మిత్ చెప్పాడు. జూన్‌లో జరిగే వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో ఆడేందుకు ఎదురు చూస్తున్నట్టు తెలిపాడు. 2010లో లెగ్‌స్పిన్ ఆల్‌రౌండర్‌గా వెస్టిండీస్‌పై స్మిత్ వన్డే అరంగేట్రం చేశాడు. ఏళ్లుగా ఆస్ట్రేలియా బ్యాటింగ్‌కు స్మిత్ వెన్నుముకగా నిలిచాడు.

వన్డే కెరీర్ ఇలా..

మ్యాచ్‌లు	170
ఇన్నింగ్స్	154
పరుగులు	5800
అత్యధికస్కోరు	164
సగటు	43.28
శతకాలు	12
అర్ధ శతకాలు	35
వికెట్లు	28

బరిలో పారాలింపిక్స్ పతక విజేతలు

20 నుంచి ఖేలో ఇండియా పారా క్రీడలు

న్యూఢిల్లీ: ఖేలో ఇండియా పారా క్రీడలకు దేశ రాజధానిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. ఈనెల 20 నుంచి 27 వరకు ఈ గేమ్స్ జరగనున్నాయి. 2024 పారిస్ పారాలింపిక్స్, 2022 ఆసియా పారా క్రీడల్లో పతకాలు గెలిచిన హర్విందర్ సింగ్, ధరమ్‌వీర్, ప్రవీణ్ కుమార్‌లాంటి అంతర్జాతీయస్థాయి అథ్లెట్లు ఈ మెగా టోర్నీలో పోటీపడనున్నారు. ఆరు క్రీడాంశాలు.. ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, పవర్‌లిఫ్టింగ్, షూటింగ్, టేబుల్ టెన్నిస్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

త్రిష శతకం



హైదరాబాద్ గెలుపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): బీసీసీఐ మహిళల అండర్-23 వన్డే ట్రోఫీలో హైదరాబాద్ బ్యాటర్ జి.త్రిషారెడ్డి అజేయ శతకంతో సత్తా చాటింది. ఛత్తీస్‌గఢ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ 7 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఛత్తీస్‌గఢ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. త్రిషా పూజిత 3, త్రిష 2, జాస్మిన్ 2 వికెట్లు తీశారు. ఛేదనలో త్రిష 101 (నాటౌట్) సెంచరీతో చెలరేగడంతో హైదరాబాద్ 42.5 ఓవర్లలో 3 వికెట్లకు 188 పరుగులు చేసి లక్ష్యాన్ని సాధించింది. హైదరాబాద్ బ్యాటర్లలో త్రిషా పూజిత 39, మమత 32 (నాటౌట్) రాణించారు.

కోహ్లీ ఓ స్థానం పైకి..

నాలుగో ర్యాంక్‌లో భారత స్టార్
ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్లో క్లాస్ ఇన్నింగ్స్ ఆకట్టుకున్న విరాట్ కోహ్లీ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఓ అడుగు ముందుకేశాడు. తాజా ర్యాంకింగ్స్‌లో విరాట్ ఒక స్థానం ఎగబాకి నాలుగో ర్యాంక్‌లో నిలిచాడు. రోహిత్ శర్మ రెండు స్థానాలు కోల్పోయి ఐదో ర్యాంకులో ఉన్నాడు. శుభ్‌మన్ గిల్ నెంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకోగా, బాబర్ ఆజమ్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. శ్రేయాస్ అయ్యర్ ఓ స్థానం మెరుగై 8వ ర్యాంక్‌లో నిలిచాడు. బౌలర్ల జాబితాలో షమి మూడు ర్యాంక్‌లు ఎగబాకి 11వ స్థానంలో, కుల్దీప్ యాదవ్ మూడు స్థానాలు చేజార్చుకొని 6వ ర్యాంక్‌లో ఉన్నారు. తీక్షణ టాప్ ర్యాంక్‌లో మార్పు లేదు. ఆల్‌రౌండర్లలో జడేజా 9వ ర్యాంక్‌తో భారత్ నుంచి టాప్-10లో ఉన్నాడు. అఫ్ఘానిస్థాన్ స్టార్ అజ్మతుల్లా ఒమర్జాయ్ రెండు స్థానాలు ఎగబాకి నెంబర్‌వన్ స్థానాన్ని ఆక్రమించాడు.

భూములమ్మితేగాని ప్రభుత్వాన్ని నడపలేరు

» ఊసరవెల్లికంటే వేగంగా రేవంత్ మాటమార్చారు: కేటీఆర్



హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): భూములు అమ్మితేగాని ప్రభుత్వాన్ని నడపలేని స్థితికి తెలంగాణను తెచ్చారని, రూ.30 వేల కోట్ల నిధుల సమీకరణకోసం హైదరాబాద్‌లోని విలువైన భూములను అతి తక్కువ ధరకు అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భూములు అమ్మొద్దని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఊసరవెల్లి కంటే వేగంగా మాటమార్చి భూముల వేలానికి సిద్ధమయ్యారని బుధవారం ఎక్స్ వేదికగా ఆయన విమర్శించారు. బ్యాంకులో తనఖా పెట్టిన భూములనే వేలంవేసి అమ్ముకోవడం ప్రభుత్వ దివాలాకోరు తనానికి నిదర్శనమన్నారు. రంగారెడ్డిజిల్లా శేరిలింగపల్లి మండలం కంచగచ్చిబౌలి పరిధిలోని 400 ఎకరాల భూములను అమ్మడంలేదని అసెంబ్లీని మోసం చేసిన రేవంత్ ముక్కు నేలకురాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేస్తోందని గతంలో అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి అయ్యాక అప్పు చేయడమే పరమావధిగా పెట్టుకున్నారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన తెలంగాణ ప్రగతిని కేవలం 15 నెలల కాలంలోనే తిరోగమనం బాట పట్టించిన చేతకాని ముఖ్యమంత్రి అని ఆయన విమర్శించారు.

జోగులాంబ ఆలయ నిధుల దుర్వినియోగం..

» సుమోటోగా కేసు నమోదు చేసి విచారించండి

» లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశం

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జోగులాంబ ఆలయ నిధుల దుర్వినియోగంపై సుమోటోగా కేసు నమోదు చేసి విచారించాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశించింది. ఈవో పురేందర్, అర్చకుడు ఆనంద్ శర్మ పాత్రపై వచ్చిన కథనాల ఆధారంగా విచారణ చేయాలని పేర్కొంది. దేవాలయం లెక్కలు, డొనేషన్‌లతోపాటు ఆభరణాల మాయంపై వరుసగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, జోగులాంబ గద్వాల జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కుష దేవాదాయశాఖ కమిషనర్‌ను పూర్తిస్థాయి వివరణ కోరారు. సిబ్బందిపై దేవాదాయశాఖ ఉన్నతాధికారులు చేపట్టిన చర్యల గురించి ఏప్రిల్ 4లోగా రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీకి వివరించాలని ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఆలయ అర్చకుడు ఆనంద్ శర్మపై అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు శాసనసభ స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. స్పీకర్ కార్యాలయం ఆదేశాలతో జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ పూర్తి నివేదికను స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు అందజేశారు.

2 ఎమ్మెల్సీ స్థానాలు ఇవ్వండి

» సీఎం రేవంత్‌కు సీపీఐ ప్రతినిధుల వినతి

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీపీఐకి ఇచ్చిన హామీ మేరకు తమకు రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇవ్వాలని సీపీఐ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. బుధవారం సీఎం నివాసంలో ఆయన్ను కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. 2023 ఎన్నికల సమయంలో జరిగిన ఒప్పందం మేరకు సీపీఐకి రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇవ్వాల్సి ఉందని, ఇప్పుడు కనీసం ఒక స్థానం అయినా ఇవ్వాలని సీఎంను కోరామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. సీఎం సానుకూలంగా స్పందించారని, అధిష్ఠానంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని తెలిపారు.

నెలాఖరు నాటికి బీసీ కమిషన్ పర్యటనలు

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలాఖరు నాటికి క్షేత్రస్థాయిలో పర్యటనలు పూర్తిచేసిన తర్వాత సంచార జాతి కులాల పేర్ల మార్పిడిపై వచ్చిన ఫిర్యాదులపై తుది నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ బీసీ కమిషన్ నిర్ణయించింది. బుధవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులతో పాటు కమిషన్ సభ్య కార్యదర్శి బాల మాయాదేవి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో బీసీ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకలాపాలను సమీక్షించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఆయా ప్రాంతాల్లో సంచార జాతి కుటుంబాల పరిస్థితులను పరిశీలించడం వీలుకాలేదని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలియజేశారు. 50 రోజుల పాటు ఇంటింటికీ ఎన్యూమరేటర్లను పంపి కులగణన సర్వే అనంతరం ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు మిగిలిపోయిన కుటుంబాల నమోదుకు అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాలను బీసీ కమిషన్ స్వాగతించినట్టు వివరించారు.

ఉత్తమ రైతు అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : సమీకృత, సేంద్రియ వ్యవసాయం, ఉద్యాన తదితర పంటల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న రైతులు, మహిళా రైతులను ప్రోత్సహించేందుకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ విశ్రాంత అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి. రంగారెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ రైతులను ఎంపిక చేయనున్నట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8886861168, 9010498345, 7288877169 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఆసక్తిగలవారు ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తులను హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని వ్యవసాయ అధికారుల సంఘం కార్యాలయంలో అందించాలని సూచించారు.

కృష్ణా జలాల కోసం మరో పోరాటం తప్పదేమో

» ప్రొఫెసర్ హరగోపాల్

» పార్టీలకతీతంగా పోరాడాలి : జస్టిస్ చంద్రకుమార్

ఖైరతాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టులను మధ్యలో నిలిపివేసి కాళేశ్వరం ప్రాజెక్టు కోసం భారీగా ఖర్చు చేయడం సరైన చర్య కాదని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్స్ తెలంగాణ ఆధ్వర్యంలో కృష్ణానది నీరు... అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు లక్డీకాపూల్ అశోకా హోటల్‌లో బుధవారం జరిగింది. ఇందులో పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కేవలం కృష్ణా నది మిగులు జలాలనే తాము వినియోగిస్తామని పేర్కొంటుండడం సరైంది కాదని, ఈ విషయమై ట్రైబ్యునల్‌తో పాటు కేంద్రం వద్ద ఆయనకు వ్యతిరేకంగా తీర్పు వస్తుందని చెప్పలేమన్నారు. కృష్ణా జలాల కోసం మరో పోరాటం తప్పదని భావిస్తున్నట్లు తెలిపారు. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ కృష్ణానది జలాల కోసం పార్టీలకతీతంగా పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. సదస్సులో ఇంజనీర్, న్యాయవాది పాదూరి శ్రీనివాసరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్, బీజేపీ అధికార ప్రతినిధి ప్రకాశ్‌రెడ్డి, నిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి డి.విజయ్ పాల్ రెడ్డి, ఓయూ మాజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమేశ్‌రెడ్డి, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధి గోనా రెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు భవాని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బలపడిన బీసీ వాదం

» సమావేశంలో బీసీ సంఘాల ప్రతినిధులు

హైదరాబాద్/బర్కత్‌పుర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ వాదం బలపడిందని పలువురు, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లే ఇందుకు నిదర్శనమని పలువురు బీసీ మేధావులు పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య బీసీల మద్దతుతోనే విజయం సాధించారని చెప్పారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ మేధావుల ఫోరం అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్, బీసీ సంఘం నాయకులు వట్టె జానయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు. త్వరలో కరీంనగర్, వరంగల్ బీసీ మేథో మధన సదస్సు నిర్వహించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

బీజేపీదే గెలుపు

(మొదటిపేజీ తరువాయి)


విలేకరులతో మాట్లాడుతున్న సంజయ్, ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

ప్రసన్న హరికృష్ణ మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. తొలి ప్రాధాన్య ఓట్లలో ఎవరికీ కోటా ఓటు లభించక పోవడంతో ఎలిమినేషన్ పద్ధతిలో రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించి అభ్యర్థి గెలుపును ప్రకటించారు. ఈ స్థానానికి మొత్తం 2,52,029 ఓట్లు పోల్ కాగా, 28,686 ఓట్లు చెల్లకుండా పోయాయి. చెల్లుబాటైన 2,23,343 ఓట్లలో గెలుపు కోసం 1,11,672 ఓట్లను కోటా ఓట్లుగా నిర్ధారించారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి 75,675 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి 70,565 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 60,419 ఓట్లు వచ్చాయి. ఈ ముగ్గురికి కలిపి 2,06,659 ఓట్లు పోలవగా.. పోటీలో ఉన్న విగతా 53 మందికి కలిపి 16,684 ఓట్లు పోలయ్యాయి. దీంతో మొదటి ప్రాధాన్య ఓట్లలో ఎవరికీ కోటా ఓటు రాకపోవడంతో రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. ఈ క్రమంలో తొలి రెండు స్థానాల్లో ఉన్న అంజిరెడ్డి, నరేందర్‌రెడ్డి మినహా 54 మంది ఎలిమినేట్ అయినా కోటా ఓట్లు ఎవరికి లభించలేదు. దీంతో ఆ ఇద్దరిలో అత్యధిక ఓట్లు సాధించిన అంజిరెడ్డిని విజేతగా ప్రకటించారు. ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు తర్వాత అంజిరెడ్డి 98,637 ఓట్లతో ప్రథమ స్థానం పొందగా, నరేందర్‌రెడ్డి 93,531 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. ద్వితీయ ప్రాధాన్య ఓట్ల ద్వారా అంజిరెడ్డికి అదనంగా 22,962 ఓట్లు రాగా, నరేందర్‌రెడ్డికి 22,966 ఓట్లు వచ్చాయి.

కాంగ్రెస్ చేజారిన సిటింగ్ స్థానం..

కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో సిటింగ్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత టి.జీవన్‌రెడ్డి ఉన్నారు. ఈసారి పోటీకి ఆయన సుముఖత తెలపక పోవడంతో కాంగ్రెస్ అధిష్ఠానం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డిని బరిలోకి దింపింది. కాంగ్రెస్ టికెట్ ఆశించిన ప్రసన్న హరికృష్ణ బీఎస్పీ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. అయితే మొదటి నుంచీ గెలుపుపై ధీమాతో ఉన్న కాంగ్రెస్‌కు ఊహించని షాక్ తగిలింది. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఉన్నా, మిత్రపక్షంగా సీపీఐ మద్దతు ప్రకటించినా కాంగ్రెస్ తన సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోలేకపోయింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ప్రచారం చేసినా ప్రయోజనం లేకుండాపోయింది. ఇదే నియోజకవర్గ పరిధిలో ఏడుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలను కలిగి ఉన్న బీజేపీ అందరికంటే ముందుగానే అభ్యర్థిని ప్రకటించినా ఆలస్యంగా ప్రచారంలోకి దిగింది. అయినా అనూహ్యంగా పోటీ ఇచ్చి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతోపాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని కూడా కైవసం చేసుకొని ఈ ప్రాంతంలో తనపట్టును మరింత పెంచుకుంది. బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో అభ్యర్థిని నిలపకపోగా.. పోలింగ్‌కు ఒక రోజు ముందు బీసీ అభ్యర్థికి ఓటు వేయాలని ఆ పార్టీ నేతలు వివిధ ప్రాంతాల్లో ప్రకటనలు చేశారు.

కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్: సంజయ్

కరీంనగర్ అర్బన్: రాష్ట్రంలో కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ మొదలయిందని, ఇక్కడ కూడా డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిన అవసరముందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించిన సందర్భంగా బుధవారం రాత్రి కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియం వద్ద బీజేపీ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో పైసలతో గెలుస్తామని ఓట్ల కోసం కోట్లు ఖర్చు చేసిందని, పట్టభద్రులు డబ్బులను కాదని మోదీ అభివృద్ధికి పట్టంకట్టారన్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఈవీఎం టాంపరింగ్‌తో బీజేపీ గెలిచిందంటూ ఆరోపణలు చేసే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పుడేం సమాధానం చెబుతారని నిలదీశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలను బ్యాలట్ ద్వారా బీజేపీ గెలిచి చూపిందని తెలిపారు.

ప్రభావం చూపిన చెల్లని ఓట్లు..!

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఫలితంపై చెల్లని ఓట్లు ప్రభావం చూపాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ 28,686 ఓట్లు చెల్లకుండా పోయాయి. వీటిలో ఎక్కువ శాతం కాంగ్రెస్‌కు చెందినవే ఉన్నాయని ఆ పార్టీ నేతలు అంటున్నారు. అయితే ఇక్కడ బీసీ వాదం బలంగా వీచినా.. చెల్లని ఓట్లే ప్రసన్న హరికృష్ణను గెలుపునకు దూరం చేశాయని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు.

బీజేపీలో కొత్త జోష్

రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో గెలుపుతో

సంబురాల్లో కాషాయం శ్రేణులు

భవిష్యత్తులో అధికారం తమదేనంటూ ధీమా

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ 'ఛాంపియన్స్ ట్రోఫీ' విజేతగా బీజేపీ నిలిచింది. కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలు రెండింటినీ బీజేపీ కైవసం చేసుకోవడంతో ఆ పార్టీ వర్గాలు సంబురాల్లో మునిగిపోయాయి. ఒకవైపు బలమైన ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థిని సునాయసంగా ఓడించిన బీజేపీ.. మరోవైపు పట్టభద్రుల నియోజకవర్గ పోరులో అధికార పార్టీ అభ్యర్థితో జరిగిన హోరాహోరీ పోరులో విజయబావుటా ఎగురవేసింది. కాంగ్రెస్ సిటింగ్ స్థానాన్ని కైవసం చేసుకుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నేతృత్వంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్‌తో పాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేల సమష్టి కృషితో ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము రికార్డులు తిరగరాశామని కమలనాథులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో తొలిసారిగా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీని గెలుచుకోవడం క్యాడర్‌లో నూతనోత్సాన్ని నింపిందని బీజేపీ సీనియర్ నేత ఒకరు పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పీఠమే లక్ష్యంగా పెట్టుకున్న తమకు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు కొత్త జోష్ ఇస్తున్నాయని అన్నారు. ఉత్తర తెలంగాణలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా, తమ అభ్యర్థులు మొదటి స్థానంలో నిలిచారని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమదే అధికారం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇక రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా బీజేపీ ఉత్తర తెలంగాణలో మరింత బలోపేతం అవుతుందని బీజేపీ నాయకత్వం భావిస్తోంది. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు ఈ ప్రాంతంలో పార్టీకి పెద్దదిక్కుగా ఉండగా, ఇప్పుడు ఇద్దరు ఎమ్మెల్సీలు కూడా గెలవడంతో పార్టీ ఇటు పట్టభద్రులు, అటు ఉపాధ్యాయవర్గాల్లో పట్టు సాధించినట్లయ్యిందని భావిస్తోంది. మరోవైపు..కీలక నేతలంతా తమ ప్రాంతంలో జరిగిన టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికకు లేకపోవడంతో చేదు ఫలితం చవిచూడాల్సి వచ్చిందని నల్లగొండ జిల్లా పార్టీ నేత ఆవేదన వ్యక్తం చేశారు.

సేవా కార్యక్రమాలతో ప్రజల్లో అంజిరెడ్డి

రామచంద్రాపురం టౌన్: సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పట్టణంలో నివాసముంటున్న చిన్నమైల్ అంజిరెడ్డి పారిశ్రామికవేత్తగా ఉన్నారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా పనిచేశారు. 2014లో ఎమ్మెల్యేగా (స్వతంత్ర అభ్యర్థిగా) పోటీచేసి ఓడిపోయారు. పలు సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఉంటున్నారు. వేలాది మంది నిరుపేదలకు అంజిరెడ్డి ఉచితంగా వైద్య సేవలు అందించారు. నిరుపేద కార్మికుల కుటుంబాలకు ప్రమాద బీమా కల్పించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో తెల్లరేషన్‌కార్డు ఉన్నవారికి ఉచితంగా ఆరోగ్యబీమా కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, పరికరాలు పంపిణీ చేశారు. గ్రామాల్లో యువజన సంఘాలకు క్రీడా పరికరాలు అందించడమే కాకుండా క్రీడా పోటీలు నిర్వహించిన బహుమతులు అందజేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కూలింగ్ వాటర్ పరికరాలు అందించారు.

రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగాం

» మా బాధ్యత మరింత పెరిగింది: కిషన్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ రెండింటిని కైవసం చేసుకోవడం పార్టీ బలాన్ని, ప్రజల ఆదరణను మరోసారి స్పష్టం చేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగిందనడానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా, అసత్య ప్రచారాలతో బురదజల్లే ప్రయత్నం చేసినా ప్రజలు బీజేపీ వెంటే ఉన్నారన్నారు. ఈ ఎన్నికల్లో విజయం రాష్ట్ర ప్రభుత్వం పట్ల పెరుగుతున్న అసహనానికి, బీజేపీ పట్ల పెరుగుతున్న ఆదరనకు సంకేతం అని అన్నారు. ఈ విజయాలు తమ బాధ్యతను మరింత పెంచాయన్నారు

నన్ను ఓడించేందుకు కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయి

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



కరీంనగర్ అర్బన్/టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తనను ఓడగొట్టేందుకు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఒక్కటయ్యారని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ ఆరోపించారు. బుధవారం కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలోని కౌంటింగ్ కేంద్రం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాలు, విద్యార్థులు, పట్టభద్రులతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు రాజకీయాల్లోకి వచ్చి రాజకీయాలను కలుషితం చేస్తున్నారని విమర్శించారు. రూపాయి ఖర్చు లేకుండా స్నేహితుల సహకారంతో సభలు, సమావేశాలు నిర్వహించానని తెలిపారు. ఓటర్లకు ఒక రూపాయి కూడా పంచకుండా 63వేలకు పైగా ఓట్లు తెచ్చుకున్నానని చెప్పారు. తాను రాజకీయాల్లోకి కొత్తగా వచ్చినా కాంగ్రెస్, బీజేపీలకు వణుకు పుట్టించానని తెలిపారు. తాను తిరిగి ఉద్యోగంలో చేరే ప్రసక్తే లేదని, రాజకీయాల్లోనే ఉంటానని ఆయన స్పష్టం చేశారు.


జూపార్క్‌లో ఖడ్గమృగంపై నీళ్లు చల్లుతున్న యానిమల్ కీపర్

భానుడి భగభగలు

మహబూబాబాద్ జిల్లా గార్లలో 39.3 డిగ్రీలు

వనపర్తిలో 39.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు


(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలో ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. బుధవారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో 39.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. హనుమకొండ జిల్లా పెద్ద పెండ్యాల, వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం మంగళవారిపేట, జనగామ జిల్లా బచ్చన్నపేట, ములుగు జిల్లా వాజేడు మండలం ధర్మారం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం, వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని దగడపల్లిలలో 39.2 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎండలు మండిపోతుండడంతో వాతావరణ శాఖ అధికారులు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూర్‌లో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సిద్దిపేట, అక్కన్నపేట మండలంలోని కట్కూర్‌లలో 38.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. హైదరాబాద్ హకీంపేటలో గరిష్ఠంగా 38.7 డిగ్రీలు, బేగంపేటలో 37.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రెండేళ్లలో కరెంట్ కొనుగోళ్లకు రూ.15,299 కోట్లు

» 2023-24లో రూ.8,548 కోట్లు, 2024-25లో రూ.6,751 కోట్లు

» టీజీఈఆర్‌సీకి నివేదించిన డిస్కమ్‌లు



హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): డిమాండ్‌కు తగిన కరెంట్‌ను సరఫరా చేసేందుకు తెలంగాణ డిస్కమ్‌లు బహిరంగ మార్కెట్లో భారీగా కొనుగోళ్లు జరుపుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కరెంట్ కోసం రూ.8,548.73 కోట్లు, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.6,751.14 కోట్లు (రెండేళ్లలోమొత్తం రూ.15,299.88 కోట్లు) వెచ్చించాయి. ఈ మేరకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ)కి వివరాలు సమర్పించాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు(ఏఆర్ఆర్) దాఖలు చేయగా... అదనంగా మరిన్ని అంశాలు జోడించి మండలికి పిటిషన్లు అందించాయి.

వర్గానికో ఎమ్మెల్సీ సీటు!

» ఓసీ, బీసీ, ఎస్సీలకు ఒక్కొక్కటి చొప్పున సీపీఐకి ఒక సీటు కేటాయించే యోచన

» రేవంత్, మీనాక్షి, భట్టి, మహేశ్‌గౌడ్, ఉత్తమ్‌ల భేటీలో ప్రాథమికంగా చర్చ

» రేపు ఢిల్లీకి వెళ్లనున్న సీఎం రేవంత్!

» ఐదుగురినీ సంప్రదించి అభ్యర్థులను ఖరారు చేయనున్న కాంగ్రెస్ అధిష్ఠానం

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక విషయంలో సామాజిక సమతుల్యత పాటించాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోందా? అసెంబ్లీ ఉన్న ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని బట్టి పార్టీకి దక్కనున్న నాలుగు సీట్లలో.. ఓసీ, బీసీ, ఎస్సీ వర్గాలకు ఒకొక్కటి చొప్పున ఇవ్వనుందా? మరో సీటును మిత్రపక్షమైన సీపీఐకి కేటాయించనుందా? అంటే అవుననే అంటున్నాయి ఆ పార్టీ వర్గాలు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో జరిగిన సమావేశంలో ఈ మేరకు ప్రాథమికంగా చర్చించినట్లు చెబుతున్నారు. ఎన్నికల ముందు సీపీఐకి ఇచ్చిన హామీ మేరకు ఒక సీటును వారికి కేటాయించాల్సి రావచ్చంటూ అధిష్ఠానం నుంచి సంకేతాలు రావడం, ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ల దాఖలుకు తుది గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి వీరు భేటీ అయ్యారు. కాగా, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి హోదాలో తొలిసారిగా తన నివాసానికి వచ్చిన మీనాక్షి నటరాజన్‌ను సీఎం రేవంత్ రెడ్డి కండువా కప్పి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. ఎంపికకు నిర్ణయించాల్సిన మార్గదర్శకాలపై చర్చించారు. ఈ క్రమంలో ఒక సీటును సీపీఐకి కేటాయించాల్సి రావచ్చునన్న అధిష్ఠానం సంకేతాల నేపథ్యంలో మిగిలిన మూడు సీట్ల పంపకం ఎలా జరగాలన్నదానిపై చర్చించారు. ఓసీ, బీసీ, ఎస్సీలకు ఒక్కో సీటు కేటాయించాలని ప్రాథమికంగా అవగాహనకు వచ్చినట్లు సమాచారం. అయితే మైనారిటీలకు ఒక సీటు కేటాయించాలన్న అంశంపైనా కొంత చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కానీ, ఈ అంశంపై తుది నిర్ణయానికి రాలేదని సమాచారం.

ఢిల్లీకి పిలిపించి చర్చలు..

శుక్రవారం ఇండియా టుడే ఆధ్వర్యంలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళుతున్నారు. మీనాక్షి నటరాజన్, భట్టివిక్రమార్క, మహేశ్‌గౌడ్, ఉత్తమ్‌లను కూడా అధిష్ఠానం ఢిల్లీకి పిలిపించుకుని ఎమ్మెల్సీ అభ్యర్థులపై తుది చర్చలు జరపనుంది. అయితే ఓసీల నుంచి అనేక పేర్లు వచ్చినా.. తుది చర్చల్లో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సీనియర్ నేత కుసుమ్‌కుమార్ పేర్లు ఉన్నట్లు చెబుతున్నారు. బీసీల్లో తొలుత అత్యంత వెనుకబడిన వర్గాలకు(ఎంబీసీ) సీటు కేటాయించాలనుకున్నారు. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో మున్నూరు కాపు సామాజిక వర్గానికి కేటాయించే అంశంపై పార్టీలో చర్చ జరుగుతోంది. మున్నూరు కాపుల నుంచి ప్రధానంగా సీనియర్ నేత వి.హనుమంత రావు పేరు వినిపిస్తోంది. టీపీసీసీ అధికార ప్రతినిధి కొనగాల మహేశ్ కూడా తన వంతు ప్రయత్నం చేసుకుంటున్నారు. అయితే బీసీల్లో యాదవ, ఇతర సామాజిక వర్గాల నేతలూ బీసీ కోటాలో సీటు కోసం ఒత్తిడి తెస్తున్నారు. ఇక ఎస్సీలకు ఒక సీటును మాత్రమే కేటాయించాల్సి వస్తుండడంతో మాదిగ సామాజికవర్గానికి కేటాయించాలా? లేక ఎస్సీ మాలలకు ఇవ్వాలా? అన్నదానిపై రాష్ట్రస్థాయిలో నిర్ణయానికి రాలేకపోతున్నారు. శుక్రవారం అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి బృందం భేటీలో వీటన్నింటికీ సమాధానం దొరకనుందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 8 లేదా 9న అభ్యర్థుల ప్రకటన ఉంటుందని చెబుతున్నారు.

'సీతారామ'తో ఖమ్మం జిల్లా సస్యశ్యామలం

» రైతులు భూములిస్తేనే ప్రాజెక్టుల పూర్తవుతాయి

» అందరి సహకారంతోనే అభివృద్ధి: మంత్రి తుమ్మల

» రాజీవ్ లింక్ కెనాల్‌లోకి గోదావరి జలాల విడుదల


ఖమ్మం జిల్లా ఏన్కూర్ సమీపంలోని రాజీవ్‌కెనాల్ వద్ద గోదావరి జలాలకు పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల

జూలూరుపాడు/ఏన్కూరు/ఖమ్మం, మార్చి 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీతారామ ఎత్తిపోతల పథకంతో ఖమ్మం జిల్లా సస్యశ్యామలం కానుందని, రెండు, మూడేళ్లలో దశలవారీగా పది లక్షల ఎకరాలకు నీరందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి రైతులు భూములు ఇస్తేనే ప్రాజెక్టులు సత్వరం పూర్తవుతాయని అభిప్రాయపడ్డారు. అందరి సహకారం ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నాటి ఎన్టీఆర్ నుంచి నేటి రేవంత్‌రెడ్డి వరకు నలుగురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా పనిచేసే అవకాశాన్ని ఖమ్మం జిల్లా ప్రజలు తనకు కల్పించారన్నారు. ఖమ్మం జిల్లాలోని జూలూరుపాడు మండలం వినోబానగర్ వద్ద సీతారామ ప్రధాన కాల్వ ద్వారా వచ్చిన గోదావరి జలాలను బుధవారం రాత్రి రాజీవ్ లింక్ కెనాల్‌కు మంత్రి తుమ్మల అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఏన్కూరు లింక్‌కెనాల్ ద్వారా గోదావరి జలాలను సాగర్ కాలవకు అనుసంధానం చేయవచ్చని సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పిన వెంటనే.. ఆయన స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు. ఖమ్మం జిల్లా ప్రజలు ఇచ్చిన అవకాశంతో 43ఏళ్లుగా ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. తనపై ఉన్న నమ్మకంతోనే రాజీవ్‌కెనాల్‌కు రైతులు భూములు ఇచ్చారని, తద్వారానే గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు తీసుకురాగలిగామని తెలిపారు. త్వరలో కొత్తగూడేనికి ఎయిర్‌పోర్టు మంజూరు కాబోతుందన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు తక్కువ కేటాయింపులు జరిగాయని, రెండు రాష్ట్రాల సమన్వయంతోనే ఈ వివాదానికి పరిష్కారం లభిస్తుందన్నారు.

కృష్ణమ్మ చెంతకు గోదావరి జలాలు

సాగర్ ఆయకట్టును స్థిరీకరించాలన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కల ఎట్టకేలకు నెరవేరింది. గోదావరి, కృష్ణా జలాల అనుసంధానానికి ఏన్కూరు లింక్‌కెనాల్ వేదికగా నిలిచింది. ఈనెల 3న ఉదయం 10గంటలకు భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరునుంచి సీతారామ ప్రాజెక్టు మొదటి లిఫ్టు ద్వారా గోదావరి జలాల ఎత్తిపోతలు ప్రారంభించారు. ఆ నీళ్లు 40కి.మీ ప్రయాణించి ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద ఉన్న రెండో లిఫ్టు వద్దకు చేరుకున్నాయి. అక్కడ సీతారామ రెండో లిఫ్టు ద్వారా ఎత్తిపోసి కమలాపురం లిఫ్టుకు చేర్చారు. అక్కడ నుంచి 57కి.మీ ప్రయాణించి సీతారామ ప్రాజక్టు కెనాల్ 100వ కిలోమీటర్ పాయింట్‌కు చేరుకున్నాయి. అక్కడ రాజీవ్ కెనాల్‌కు అనుసంధానించారు. ఆ కాల్వలో 8.6కి.మీ ప్రయాణించిన గోదావరి జలాలు.. ఎట్టకేలకు సాగర్ ఎడమకాల్వకు చేరుకున్నాయి.

వైద్యులు సమయపాలన పాటించాల్సిందే

» గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవు: మంత్రి దామోదర



హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్లు, వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాల్సిందేనని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. ఆశ వర్కర్ల నుంచి వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్ల వరకూ ఎవరి విధులను వారు సక్రమంగా చేయాల్సిందేనన్నారు. డ్యూటీలకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. బుధవారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సిబ్బంది సమయపాలన, ఆస్పత్రుల్లో పరికరాల నిర్వాహణ, అవయవదానం తదితర అంశాలపై చర్చించారు. ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, కమిషనర్ ఆర్వీ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకాన్ని పెంచేలా వైద్య సిబ్బంది పనిచేయాలన్నారు. గాంధీ ఆస్పత్రిలో సయితం ముందస్తు సమాచారం ఇవ్వకుండా డాక్టర్లు గైర్హాజరవుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్లు బాధ్యతగా ఉంటేనే సిబ్బంది కూడా బాధ్యతగా ఉంటారన్నారు. ఆస్పత్రులలో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని చెప్పారు.

బీఆర్ఎస్ వల్లే గోదావరి బేసిన్‌లో ఇబ్బందులు

» కృష్ణా జలాల్లో జరిగిన అన్యాయాన్ని సవరిస్తున్నాం

» హరీశ్‌రావు తప్పుడు ప్రకటనలు చేస్తున్నారు: ఉత్తమ్



హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గోదావరి బేసిన్‌లో నీటి ఎద్దడికి బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలే కారణమని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. ప్రాణహిత-చేవెళ్ల పథకంలో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఉంటే.. 165 టీఎంసీల నీటి లభ్యత అదనంగా తెలంగాణలో ఉండేదని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ పూర్తి చేస్తే కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తుందన్న ఆక్రోశంతో మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టారని ఆక్షేపించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియాతో చిట్‌చాట్‌గా ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల కృష్ణా జలాల కేటాయింపులు ఉండగా... 2015 జూన్‌లో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని ఒప్పందం చేసుకున్నది బీఆర్ఎస్ పార్టీయేనని మండిపడ్డారు. కృష్ణా బేసిన్‌లో ప్రాజెక్టులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించిందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో కృష్ణా జలాల్లో జరిగిన అన్యాయాన్ని సవరించడానికి ఇప్పుడు తాము కృషి చేస్తున్నామన్నారు.నీటిపారుదల రంగంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన హరీశ్‌రావు.. ఇప్పుడు తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆక్షేపించారు.



నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలో ఓ వృద్ధురాలికి గ్లకోమా పరీక్షలు నిర్వహిస్తుండగా పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యం

» 24 గంటల్లోనే ఎల్‌వోసీలు: మంత్రి కోమటిరెడ్డి

కనగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పేదల వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, గడచిన 15 నెలల్లో ఎల్‌వోసీల కింద రూ.1,600 కోట్లను విడుదల చేసిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. నల్లగొండ జిల్లా కనగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతన భవనంతో పాటు గ్లకోమా పైలెట్ ప్రాజెక్టును ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఇకపై పేదల వైద్య ఖర్చులకు 24 గంటల్లోనే లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ)లను అందిస్తామని వెల్లడించారు. దేవరకొండ నియోజకవర్గంలో త్వరలోనే మరో గ్లకోమా కేంద్రంతో పాటు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్‌ను నెలాఖరుకు ప్రారంభిస్తామని వెల్లడించారు. డిప్యూటేషన్‌పై వెళ్లిన వైద్యులను వెనక్కి తీసుకువస్తామని చెప్పారు.

తగ్గిన తెలంగాణ డిస్కమ్‌ల పరపతి

తెలంగాణ డిస్కమ్‌ల పరపతి తగ్గింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి దక్షిణ డిస్కమ్(టీజీఎస్పీడీసీఎల్- హైదరాబాద్), ఉత్తర డిస్కమ్(టీజీఎన్పీడీసీఎల్)లకు మైనస్ 'సీ' రేటింగ్‌లు లభించాయి. ఈ మేరకు దేశవ్యాప్తంగా 52 డిస్కమ్‌లకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ రేటింగ్‌లు ఇచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రెండు డిస్కమ్‌లకు 'సీ' రేటింగ్‌లు రాగా, అంతకు ముందు సంవత్సరం 'మైనస్ సీ' రేటింగ్‌లు వచ్చాయి. మళ్లీ ఈసారి మైనస్ సీ రేటింగ్‌లు వచ్చాయి.

8న మహిళా సమాఖ్యలకు బస్సుల అందజేత

» మహిళా శక్తి పాలసీని విడుదల చేయనున్న సీఎం: సీఎస్

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న పరేడ్ గ్రౌండులో జరగనున్న మహిళా సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి మహిళా శక్తి పాలసీని విడుదల చేస్తారని, మహిళా సమాఖ్యలకు అందజేయనున్న బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తారని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి తెలిపారు. మహిళా సదస్సు ఏర్పాట్లపై బుధవారం సచివాలయంలో ప్రభుత్వ అధికారులతో శాంతికుమారి సమీక్షించారు. సదస్సులో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సభా వేదికకు వచ్చి వెళ్లే మార్గాలు, ప్రధాన వేదిక వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని పోలీసులకు సూచించారు. జిల్లాల నుంచి వచ్చే బస్సులకు బైసన్‌పోలో మైదానంలో పార్కింగ్ ఏర్పాటు చేయాలని, పార్కింగ్ ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ప్రధానకార్యదర్శి పేర్కొన్నారు.

ఫుట్‌వేర్ టెక్నాలజీలో అపార ఉపాధి అవకాశాలు

» యువతకు అవగాహన కల్పించాలని ఉన్నత విద్యామండలికి ఎఫ్‌డీడీఐ వినతి

హైదరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఫుట్‌వేర్ డిజైన్, డెవలప్‌మెంట్ రంగంలో పెద్దఎత్తున ఉన్న ఉపాధి అవకాశాలపై యువతకు తెలంగాణ ఉన్నత విద్యామండలిని అవగాహన కల్పించాలని ఫుట్‌వేర్ డిజైన్, డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.తేజ్ లోహిత్ రెడ్డి కోరారు. ఈ మేరకు తెలంగాణ ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డిని బుధవారం స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఉన్నత విద్యామండలితో కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమాల నిర్వహణకు ఎఫ్‌డీడీఐ సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా తెలిపారు.

ఎప్‌సెట్‌కు 48,158 దరఖాస్తులు

ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఎప్‌సెట్ ప్రవేశ పరీక్ష కోసం మూడురోజుల్లో 48,158 దరఖాస్తులు అందాయి. ఇంజనీరింగ్ 31,805, అగ్రికల్చర్, ఫార్మసీ కోసం 16,317, ఇంజినీరింగ్, అగ్రికల్చర్-ఫార్మసీకి కలిపి 36 దరఖాస్తులు అందాయని తెలంగాణ ఉన్నత విద్యామండలి బుధవారం ప్రకటించింది. కాగా, దరఖాస్తుల సమర్పణకు ఏప్రిల్ 4 వరకు గడువు ఉంది. అయితే, ఆలస్య రుసుముతో ఏప్రిల్ 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.

హస్తినలో తెలంగాణ శోభ

» 'వివిధ కా అమృత్ మహోత్సవ్'లో రాష్ట్ర స్టాళ్లు

» హాజరైన రాష్ట్రపతి, గవర్నర్, ఉప ముఖ్యమంత్రి

న్యూఢిల్లీ/సిరిసిల్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హస్తినలో తెలంగాణ శోభ వెల్లివిరిసింది. బుధవారం రాష్ట్రపతి భవన్‌లో వివిధ కా అమృత్ మహోత్సవ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అన్ని రాష్ట్రాల స్టాళ్లను సందర్శించారు. తెలంగాణ స్టాళ్లకు విచ్చేసిన రాష్ట్రపతిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సాదరంగా ఆహ్వానించారు. తెలంగాణ చేనేత కళాకారుల పనితనాన్ని, చేతివృత్తుల ప్రాముఖ్యతను వివరించారు. అగ్గిపెట్టెలో పట్టేవిధంగా చేతితో చీర నేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన నేత కళాకారుడు యెల్ది హరిప్రసాద్ పనితీరును రాష్ట్రపతి ప్రముఖంగా ప్రశంసించి, నేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 9 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఇందులో రాష్ట్రానికి చెందిన పద్మశ్రీ పురస్కార గ్రహీతలు గజం అంజయ్య, గజం గోవర్ధన్‌లు సహ 20 మంది వివిధ ప్రాంతాల ప్రముఖ చేనేత కార్మికులు, 20 మంది హస్తకళా నిపుణులు స్టాళ్లు ఏర్పాటు చేశారు.



అమృత్ మహోత్సవ్‌లో స్టాళ్లను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ముర్ము; చిత్రంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి

15 వేల కోట్ల పెట్టుబడులు.. 3 లక్షల ఉద్యోగాలు

నూతన పర్యాటక విధానం 2025-30 సిద్ధం .. నేడు క్యాబినెట్‌లో చర్చ.. ఆమోదం!

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పర్యాటక విధానం సిద్ధమైంది. దేశంలోనే టూరిజానికి రాష్ట్రాన్ని గమ్యస్థానంగా మార్చే లక్ష్యంతో పర్యాటక శాఖ ఈ విధానాన్ని రూపొందించింది. దీంట్లో భాగంగా ప్రకృతి, అధ్యాత్మికం, వైద్య పర్యాటకానికి పెద్ద పీట వేయనున్నారు. ప్రత్యేకంగా ఒక బుద్ధిస్ట్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేయనున్నారు. నూతన పర్యాటక విధానంతో రాబోయే ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులను రాబట్టాలని, 3 లక్షల అదనపు ఉద్యోగాలను కల్పించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుంది. ఈ మేరకు 'రాష్ట్ర టూరిజం పాలసీ 2025 -2030'పై గురువారం క్యాబినెట్‌లో చర్చించి ఆమోదించనున్నట్టు అత్యంత విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

ఇప్పటి వరకూ పర్యాటక విధానమే లేదు

రాష్ట్రం ఏర్పాటైన తర్వాత పర్యాటకానికి సంబంధించి ప్రత్యేకంగా ఒక పాలసీ లేదు. ఈ నేపథ్యంలోనే, ప్రత్యేక విధానం తీసుకురావాలని ప్రభుత్వం సంకల్పించింది. నూతన పర్యాటక విధానంలో భాగంగా, ఆయా ప్రాంతాలకు అనుగుణంగా టూరిజంను అభివృద్ధి చేయనున్నారు. ప్రధానంగా ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్)- రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) మధ్య ప్రాంతాలను ఎంచుకోనున్నట్లు సమాచారం. పర్యాటక పాలసీ అమలు, అంతర్గత సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర పర్యాటక ప్రోత్సాహక మండలిని ఏర్పాటుచేస్తారు. దీనికి సీఎం అధ్యక్షులుగా, మంత్రులు సభ్యులుగా, టూరిజం శాఖ ముఖ్య కార్యదర్శి కన్వీనరుగా ఉంటారు. చట్టపరమైన సమస్యలు తలెత్తితే పరిష్కరించడం కోసం లీగల్ సెల్‌ను ఏర్పాటుచేస్తారు. ప్రధానమైన పర్యాటక



ప్రాంతాల్లో ప్రత్యేక టూరిస్టు పోలీస్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు.

ప్రత్యేక టూరిజం ప్రాంతాల అభివృద్ధి

- పాలసీ కింద రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తారు. ఇప్పటికే 27 స్పెషల్ టూరిజం ఏరియాలను గుర్తించారు. వీటిలో తొలుత కొన్ని రంగాలపై దృష్టిపెట్టి వాటిని అభివృద్ధి చేస్తారు.
- ప్రకృతి, ఆరోగ్యం (ఎకో, వెల్‌నెస్): వికారాబాద్‌లోని అనంతగిరి, కోట్‌పల్లి, పరిగి, దామగూడెం ప్రాంతాలను ప్రకృతి సందర్శన, సాహస క్రీడలు, ఆరోగ్యం పర్యాటక స్థలాలుగా అభివృద్ధి చేస్తారు.
- అభయారణ్యాలు, జలపాతాలు: నల్లమల దగ్గర్లో కృష్ణానది బ్యాక్ వాటర్ ఉన్న ప్రాంతం, అలంపూర్ శక్తిపీఠం, సోమశిల, కొల్లాపూర్, బీచుపల్లితో పాటు దేవాలయాలు, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, జలపాతాలను టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేస్తారు.
- రామప్ప: యునెస్కో గుర్తించిన ప్రఖ్యాత రామప్ప ఆలయంతోపాటు లక్నవరం, మేడారం, బొగత జలపాతం ప్రాంతాల అభివృద్ధి.
- కాళేశ్వరం: ప్రకృతి, వారాంతపు పర్యాటక స్థలంగా అభివృద్ధి.
- నాగార్జున సాగర్: బౌద్ధ వారసత్వం, ప్రకృతి, సాహస క్రీడల టూరిజంగా అభివృద్ధి.
- భద్రాచలం: భద్రాచలం, పర్ణశాల, కిన్నెరసాని వన్య ప్రాణుల అభయారణ్యం, కిన్నెరసాని రిజర్వాయర్‌లను ఆధ్యాత్మిక, ఎకో, ట్రైబల్ టూరిజంగా అభివృద్ధి చేస్తారు.
- ట్రైబల్ టూరిజం: జోడేఘాట్, ఉట్నూర్, ఉషేగావ్, కేస్లాగూడ, వన్యప్రాణుల అభయారణ్యం, జలపాతాలను గిరిజన పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తారు.
- చార్మినార్: లాడ్‌బజార్, చార్మినార్, మక్కా మసీద్, చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం, నిజాం మ్యూజియంల అభివృద్ధి.

కంపెనీలకు 10-25 % వరకూ రాయితీలు

పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధికి పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానాన్ని అవలంబించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. టూరిజం ప్రాజెక్టులతో ముందుకు వచ్చే కంపెనీలకు పన్నులు, తక్కువ రేట్లకు భూములు తదితర రూపాల్లో 10 నుంచి 25% వరకు రాయితీ ఇవ్వనున్నారు. రూ.500 కోట్లకు మించిన పెట్టుబడి లేదా 2000మందికి ఉపాధి కల్పించే ప్రాజెక్టును ఐకానిక్ ప్రాజెక్టుగా, రూ.100 కోట్లకు మించి పెట్టుబడి, లేదా 500 మందికి ఉపాధి కల్పించే దానిని మెగా ప్రాజెక్టుగా పేర్కొంటూ వర్గీకరణ చేపట్టనున్నారు. పర్యాటకానికి సంబంధించి దేశంలోని టాప్-5 రాష్ట్రాల్లో ఒకటిగా తెలంగాణను తీసుకెళ్లాలని, రాష్ట్ర జీడీపీలో 10% కంటే ఎక్కువగా ఆదాయం వచ్చేలా టూరిజంను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

ఎస్సీ వర్గీకరణ.. బీసీ రిజర్వేషన్ల పెంపు!

(మొదటిపేజీ తరువాయి)

చర్చించనున్నారు. రాష్ట్రంలో కొత్త మద్యం బ్రాండ్ల విక్రయానికి ప్రభుత్వం అనుమతినిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దేశీ, విదేశీ కంపెనీల నుంచి వచ్చే కొత్త బ్రాండ్లు, ఇప్పటికే ఉన్న బ్రాండ్ల ధరల పెంపు అంశంపైనా క్యాబినెట్‌లో చర్చించే అవకాశాలున్నట్టు సమాచారం. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు. ఆ విషయాలను కూడా మంత్రివర్గ సమావేశంలో మంత్రులతో సీఎం మాట్లాడే అవకాశం ఉంది. ఇసుక సరఫరాకు సంబంధించి ఇప్పటికే సీఎం రేవంత్.. అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఇసుక సరఫరా, ఇసుక ధరలపై ఒక నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. కృష్ణా, గోదావరి జలాల పంపిణీ, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం తదితర 35 అంశాలపై క్యాబినెట్ చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

యాదగిరిగుట్టకు పాలక మండలి

యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి.. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తరహాలో ప్రత్యేక పాలక మండలి ఏర్పాటు కానున్నట్లు సమాచారం. బోర్డులో చైర్మన్, 13 మంది సభ్యులు ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చించి, ఆమోదించనున్నట్టు తెలిసింది.



ఆవుపాల ధర తగ్గింపు.. గేదె పాల ధర పెంపు!

» పాల సేకరణ ధరను సవరించే యోచనలో విజయ డెయిరీ..

» 50కోట్ల బకాయిలు చెల్లించాకే ప్రకటన

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విజయ తెలంగాణ డెయిరీ పాల సేకరణ ధరను పెంచే యోచనలో ఉంది. ప్రస్తుతం ఉన్న ధరపైన ఆవు పాలకు రూ.2 నుంచి రూ.3 వరకు తగ్గించడం.. గేదె పాలపై రూ.3వరకు పెంచాలనే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. ఇప్పటికే మూడు సార్లు పాల ధరలను పెంచగా.. ఇప్పుడు మరోసారి పెంచబోతోంది. రాష్ట్రంలో పాల ఉత్పత్తి, పాడి రైతుల సంక్షేమం, అభ్యున్నతి కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ డెయిరీ యాజమాన్యం పేర్కొంది. పాడి రైతులతో సమావేశమైన తర్వాత ఈ నిర్ణయాన్ని తీసుకుంది. అయితే ప్రభుత్వం పెండింగ్ బకాయిలు చెల్లించాకే కొత్త ధరల విషయాన్ని ప్రకటించనున్నారు. ఆవు పాల రేటును ఇతర ప్రైవేటు, సహకార డెయిరీలతో పోలిస్తే విజయ తెలంగాణ డెయిరీ ఇప్పుడు దాదాపు రూ.8 నుంచి రూ.9 ఎక్కువగా పాడి రైతులకు చెల్లిస్తోంది. పాల లభ్యత, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఇతర డెయిరీల కంటే ఆవుపాలపై ఒక్కో లీటర్‌కు రూ.2 నుంచి రూ.3 మాత్రమే ఎక్కువ ఉండేలా ప్రస్తుత ధర రూ.42.24ను సవరించనున్నారు. ఆవు పాల ధరను రూ.2 నుంచి రూ.3 వరకు తగ్గిస్తూనే.. అదే సమయంలో గేదె పాల రేటును లీటర్‌కు రూ.48 నుంచి రూ.51 దాకా పెంచనున్నారు. అంటే గేదె పాల ధర లీటర్‌కు రూ.3 చొప్పున పెరగనుంది. పాడి రైతులకు గిట్టుబాటు ధర అందించడం వల్ల పాల ఉత్పత్తి పెరుగుతుందనే అంచనాతో పాల సేకరణ ధరను పెంచాలనే నిర్ణయం తీసుకున్నట్లు డెయిరీ యాజమాన్యం తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

పాడి సమాఖ్యకు ప్రతి నెలా 12 కోట్ల నష్టం

పాడి రైతులకు గిట్టుబాటు ధర అందించాలని విజయ డెయిరీ దేశంలోనే అత్యధిక పాల సేకరణ ధరను చెల్లిస్తోంది. లీటర్ పాలకు రూ 42.24 చెల్లించటంతో పాటు అమ్మకాలు తగ్గడంతో ప్రతి నెలా పాడి సమాఖ్య రూ. 12 కోట్లు నష్టపోతోంది. పాడి రైతులకు సకాలంలో పాల బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో డెయిరీ యాజమాన్యం బుధవారం పాడి రైతులతో సమావేశమైంది. ఈ సందర్భంగా మూడు ప్రతిపాదనలు చర్చకు వచ్చినట్లు తెలిసింది. దాదాపు రూ.50 కోట్ల పాత బకాయిలు చెల్లించేలా ప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయించింది. ప్రతి నెలా 5, 20వ తేదీన పాల బిల్లులు చెల్లించాలని కూడా సమావేశం నిర్ణయించింది. వీటితో పాటు ఆవు, గేదె పాల ధరలను సవరించాలని రైతు ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. అయితే పెండింగ్ బకాయిలు చెల్లించిన తర్వాతే ధరల సవరణ విషయాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

పార్టీలో సీనియర్లు ఎవరు?

మధ్యలో వచ్చిన వారెవరు? వెళ్లి మళ్లీ వచ్చిందెవరు? .. నియోజకవర్గాల వారీగా మీనాక్షి ఆరా

» క్యాటగిరీల వారీగా జాబితాలు కావాలని ఆదేశం

» వీటి ఆధారంగా పదవుల్లో నియామకం

» సమీక్షల తర్వాత క్షేత్రస్థాయి పర్యటన

» సొంత నివేదికలు ఇచ్చే బదులు పార్టీకి సమయం ఇవ్వండి

» క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు: మీనాక్షి



అనుబంధ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్ గౌడ్. చిత్రంలో మీనాక్షి నటరాజన్

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్.. క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు నడుంకట్టారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయి నాయకుల జాబితాలను క్యాటగిరీల వారీగా తెప్పించుకుంటున్నారు. మొత్తం మూడు క్యాటగిరీలుగా విభజించి జాబితాలను సిద్ధం చేయిస్తున్నారు. ఇందులో.. పదేళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని ఉన్న నేతలను ఒక కేటగిరీ కింద, 2023 అసెంబ్లీ ఎన్నికలకు కొద్దికాలం ముందు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేతలను మరో కేటగిరీ కింద చేరుస్తున్నారు. ఇక ఎన్నికల ముందు కాంగ్రెస్‌ని వీడి.. పార్టీ అధికారంలోకి వచ్చాక తిరిగి కాంగ్రెస్‌లో చేరిన వారిని మరో క్యాటగిరీగా నమోదు చేయిస్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నియోజకవర్గ స్థాయిలో మొదటి నుంచీ కాంగ్రెస్‌లో ఉన్నవారికి, ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి మధ్య వివాదాలు నెలకొని ఉన్నాయి. మొదటి నుంచీ పార్టీనే నమ్ముకున్న తమకు.. పార్టీ అధికారంలోకి వచ్చినా న్యాయం జరగడంలేదని లోక్‌సభ నియోజకవర్గాల వారీ సమీక్షల్లో అనేక మంది నాయకులు మీనాక్షికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గాల వారీగా నాయకుల జాబితాలను వివిధ క్యాటగిరీల వారీగా ఆమె తెప్పించుకుంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ నియోజకవర్గాల వారీ సమీక్షలు పూర్తి కాగానే ఆమె క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నామినేటెడ్ పదవులు, పార్టీ పదవుల విషయంలోనూ ఈ క్యాటగిరీల ఆధారంగానే ప్రాధాన్యం ఉంటుందని అంటున్నారు.

'పని చేసేదెవరో.. నటించేదెవరో తెలుసు'

క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పని చేస్తున్న నేతలెవరో, నటిస్తున్న వారెవరో తనకు అంతా తెలుసునని కాంగ్రెస్ నేతలతో మీనాక్షి నటరాజన్ అన్నారు. నేతలెవరూ తమ పనితీరుపై నివేదికలు తెచ్చి తనకు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పార్టీ కోసం సమయం ఇచ్చి పనిచేయాలని సూచించారు. పార్టీలో నేతల పనితీరు నచ్చకపోతే టీపీసీసీ దృష్టికిగానీ, తన దృష్టికిగానీ తీసుకురావచ్చునని అన్నారు. పార్టీ అంతర్గత విషయాలపై బయట చర్చ చేస్తే వేటు తప్పదని మరోమారు స్పష్టం చేశారు. తన పనితీరు నచ్చకపోయినా తనపై సోనియాగాంధీకి, రాహుల్ గాంధీకి ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. గాంధీభవన్‌లో పార్టీ అనుబంధ సంఘాలు, ఆదిలాబాద్, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాల నేతలతో మీనాక్షి వేర్వేరుగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీతక్క, శ్రీధర్‌బాబు, ఆయా లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ మూడు సమావేశాల్లోనూ పార్టీ నేతలు క్రమశిక్షణ దాటొద్దంటూ మీనాక్షి హెచ్చరించారు. పార్టీ కోసం చిత్తశుద్ధి, క్రమశిక్షణతో కష్టపడ్డ వారికి పదవులు వస్తాయని స్పష్టం చేశారు.

విమర్శలను తిప్పికొట్టడం లేదెందుకు?: మహేశ్ గౌడ్

ఏడాది కాలంగా కార్పొరేషన్ పదవులు తీసుకున్నవారు అంత బాధ్యతగా పనిచేయడం లేదని అనుబంధ సంఘాలతో జరిగిన సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే, అప్రతిష్ఠపాలు చేస్తుంటే వెంటనే ఎందుకు స్పందిచడంలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేసినా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వెనుకబడి పోతున్నామన్నారు. వాటిపై గ్రామాల్లో ప్రచారం చేయాలని సూచించారు. కాగా, డీసీసీ అధ్యక్షుల నియామకాన్ని సెలక్ట్ అండ్ ఎలక్ట్ పద్ధతిలో చేపట్టాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. అయితే తుది నిర్ణయం మాత్రం అధిష్ఠానానిదేనని మహేశ్‌గౌడ్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవుల్లో ఒకటి దొమ్మాటి సాంబయ్యకు కేటాయించాలని ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి తదితరులు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కోరారు.

రిజిస్ట్రేషన్ల ఆదాయంలో భారీ లోటు!

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్ ద్వారా కొంత ఆదాయాన్ని రాబట్టుకోవడం ద్వారా గత ఏడాది నమోదైన ఆదాయాన్నైనా చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల శాఖకు రూ.14,588.06 కోట్ల ఆదాయం వచ్చింది. ఆ ఏడాది ఫిబ్రవరి ఆఖరు నాటికి రూ.13,270.24 కోట్లు రాగా.. 2024-25లో ఇదే సమయానికి రూ.12867.13 కోట్ల ఆదాయమే వచ్చింది. అంటే.. ఆదాయంలో వ్యత్యాసం రూ.403.11 కోట్లుగా నమోదైంది. 2023-24 ఫిబ్రవరితో పోలిస్తే.. ఏడాది వచ్చిన ఆదాయం 3.04 శాతం తక్కువ కావడం గమనార్హం. గత ఏడాది ఫిబ్రవరి వరకు 11 నెలల వ్యవధిలో 16.88 లక్షల దస్తావేజులు రిజిస్టర్ అయితే , ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 15.87 లక్షల దస్తావేజులు మాత్రమే రిజిస్టర్ అయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 5.98 శాతం తక్కువ రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ లెక్కన గత ఏడాది నమోదైన ఆదాయాన్ని చేరుకోవాలన్నా..ఈ ఒక్క నెల(మార్చి)లో 1720.93 కోట్ల ఆదాయం రాబట్టుకోవాల్సి ఉంది. ఈ నెల ఆదాయాన్ని పెంచుకునేందుకు ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీని ద్వారా రూ.500 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలన్న లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నారు. వాస్తవానికి ఈ ఏడాది బడ్జెట్ అంచనాల ప్రకారం రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 18,000 కోట్లపైనే రావాలి. క్షేత్రస్థాయిలో ఆ అంచనాల మేరకు ఆదాయం ఎప్పుడూ సమకూరదు. కానీ, గత ఐదేళ్లుగా ఏటా రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం పెరుగుతూనే ఉంది. కానీ, ఈ ఏడాది అందుకు భిన్నమైన పరిస్థితులు ఉండడంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ జోరు తగ్గడమే రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపిందన్న చర్చ జరుగుతోంది.

రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం నెలల వారీగా..

	2023-24	2024-25
ఏప్రిల్	1087.46	1115.22
మే	1317.19	1079.31
జూన్	1179.56	1292.87
జూలై	1187.40	1639.37
ఆగస్టు	1296.73	1306.68
సెప్టెంబరు	1161.54	857.83
అక్టోబరు	1221.82	1119.86
నవంబరు	1127.79	1160.75
డిసెంబరు	1299.83	1104..62
జనవరి	1061.60	987.91
ఫిబ్రవరి	1329.32	1202.71
మార్చి	1317.82	171.47 (మార్చి 4వ తేదీ వరకు)
మొత్తం	14588.06	13038.60

ఖమ్మం కలెక్టరేట్‌లో దివ్యాంగులకు ఉచితభోజనం


దివ్యాంగులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): తమ పనుల నిమిత్తం ఖమ్మం కలెక్టరేట్‌కు వచ్చే దివ్యాంగుల ఆకలిని తీర్చాలనే ఆలోచనతో వారికి ఉచిత భోజనం అందించే కార్యక్రమానికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారం శ్రీకారం చుట్టారు. భోజనంలో అన్నం, ఆకుకూర పప్పు, రోటి, పచ్చడి, రెండు కూరలు, సాంబారు, రసం, పెరుగు వడ్డిస్తున్నారు. కలెక్టరేట్‌లోని అన్ని కార్యాలయాలకు వచ్చే 40శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఉచిత భోజన కూపన్లను అక్కడి సిబ్బంది అందజేస్తారు. బుధవారం తొలుత క్యాంటీన్‌ను ప్రారంభించిన కలెక్టర్ తర్వాత దివ్యాంగులకు భోజనం వడ్డించారు. కలెక్టరేట్‌లో దివ్యాంగులకు ఉచిత భోజన కార్యక్రమాన్ని ప్రారంభించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

బర్డ్‌ఫ్లూతో చనిపోయిన కోళ్లు గోదావరిలో!

» ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ఘటన

ఏటూరునాగారం రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని గోదావరిలో బుధవారం చనిపోయిన బ్రాయిలర్ కోళ్లు దర్శనమిచ్చాయి. భక్తులు స్నానాలు ఆచరించే ప్రదేశంలో ముల్లకట్ట బ్రిడ్జి వద్ద వందల సంఖ్యలో చనిపోయిన కోళ్లు నీటిపై తేలియాడుతూ కనిపించాయి. బర్డ్‌ఫ్లూ కారణంగా రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో కోళ్లు చనిపోతున్నాయనే ప్రచారం జోరుగా సాగుతున్న క్రమంలో ఈ ఘటన జరగడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బర్డ్‌ఫ్లూ కారణంగా కోళ్లు మృతి చెందడంతో మండలంలోని కొందరు వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా వాటిని ఐదు రోజుల క్రితం దగ్గరలోని గోదావరిలో పడేసినట్లు సమాచారం.

ధిక్కరణ కేసులో అధికార్లకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కోర్టు ధిక్కరణ కేసులో ప్రత్యక్షంగా హాజరై వివరణ ఇవ్వాలని నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావులకు బుధవారం హైకోర్టు నోటీసులు జారీచేసింది. వారితోపాటు వనపర్తి జిల్లా కలెక్టర్ సురభి ఆదర్శ్, వనపర్తి భూసేకరణాధికారి డి. సుబ్రమణ్యంలకు సైతం నోటీసులు జారీ అయ్యాయి. జూరాల ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ కోసం 2009లో భూసేకరణ చేశారు. 14 ఏళ్లు గడిచినప్పటికీ పరిహారాన్ని బాధితులకు ఇవ్వలేదు. ఆ మొత్తాన్ని మూడునెలల్లో అందజేయాలని పేర్కొంటూ గతేడాది సెప్టెంబర్‌లో హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వులు అమలుకాకపోవడంతో రైతులు కే జగదీశ్వర్ తదితరులు హైకోరులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ నీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం ఆ అధికారులకు నోటీసులు పంపించింది. ఈనెల 28న తమ ఎదుట ప్రత్యక్షంగా హాజరై వివరణ ఇవ్వాలని పేర్కొంది.

మోసం చేసిన 3 సంస్థలపై ఈడీ చార్జిషీట్లు

బ్యాంకులను, పోస్టల్ శాఖను మోసం చేసిన మూడు వేర్వేరు కేసులకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్(ఈడీ) చార్జిషీట్లు దాఖలు చేసింది. ప్రీషా పెరల్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ..నకిలీ స్టాంపులతో పోస్టల్ శాఖను మోసం చేసిన కేసులోను, హైదరాబాద్‌కు చెందిన ఘన్‌శ్యామ్ దాస్ జ్యూవెలరీ నిర్వాహకులు బ్యాంకుకు తాకట్టు పెట్టిన తమ షాపులోని నగలను మాయం చేసిన కేసులోను, అగ్రవంశీ ఆగ్రో ఫామ్స్ పేరిట గజానంద్ అగర్వాల్ అనే వ్యకి బ్యాంకు రుణం తీసుకుని ఆ డబ్బును సొంత ఖాతాలకు మళ్లించుకున్న కేసులోను ఈడీ అధికారులు నాంపల్లి కోర్టులో చార్జిషీట్లు దాఖలు చేశారు.

విమానంలో ప్రయాణికురాలికి గుండెపోటు

» అత్యవసర ల్యాండింగ్.. ఆస్పత్రికి తరలించేలోపే మృతి

» ఎయిర్‌పోర్టులో ఫిట్స్‌తో ముంబై కానిస్టేబుల్ దుర్మరణం

శంషాబాద్ రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళా ప్రయాణికురాలికి గుండెపోటు రావడంతో విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. అయితే ఆస్పత్రికి తరలించేలోపు ఆమె మృతి చెందింది. బంగ్లాదేశ్‌కు చెందిన ఎం.బేగం రోషోనారా(44) ఖతార్ ఎయిర్‌వేస్ విమానంలో దోహా నుంచి ఢాకాకు వెళ్తుండగా గుండెపోటు వచ్చింది. గమనించిన విమాన సిబ్బంది అత్యవసర ల్యాండింగ్ కోసం శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారుల అనుమతి తీసుకున్నారు. మధ్యాహ్నం 1.49 గంటలకు విమానాన్ని ల్యాండింగ్ చేశారు. మహిళను ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించగా.. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి వెంట కుమారుడు ఉన్నట్లు ఆర్జీఐఏ పోలీసులు తెలిపారు. ఇక విమానాశ్రయంలో చోటుచేసుకున్న మరో ఘటనలో.. ముంబైలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసే మహేశ్ రామ్‌రావు సలేంకే(49) ఫిట్స్‌తో మృతి చెందారు. ఓ కేసు విచారణ భాగంలో కాన్పూర్ వెళ్లాల్సి ఉండగా.. కనెక్టింగ్ ఫ్లైట్ కోసం శంషాబాద్‌లో ఎస్సై అశోక్ శెట్టి, మరో మహిళా కానిస్టేబుల్‌తో కలిసి మహేశ్ దిగారు. విమానాశ్రయంలో ఎదురుచూస్తున్న క్రమంలోనే మహేశ్‌కు ఫిట్స్ రావడంతో అపోలో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు.

నకిరేకల్ ఎమ్మెల్యేకు నగ్న వీడియో కాల్

» రికార్డు చేసి, ఆయన ఫోన్‌కే పంపిన సైబర్ నేరగాళ్లు

» డబ్బులివ్వకపోతే నెట్‌లో పెడతామని బెదిరింపులు

నకిరేకల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వల నుంచి నల్లగొండ జిల్లా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తప్పించుకున్నారు. గుర్తుతెలియని నంబరు నుంచి ఆయనకు ఓ వీడియో కాల్ వస్తే లిఫ్ట్ చేశారు. ఆవలివైపు ఓ యువతి నగ్నంగా కనిపించింది. అప్రమత్తమైన ఎమ్మెల్యే, వెంటనే ఆ కాల్‌ను కట్ చేసినా.. అప్పటికే రికార్డుచేసిన సైబర్ నేరగాళ్లు, దాన్ని ఆయనకు పంపారు. తమకు డబ్బులివ్వకపోతే వీడియోను సామాజిక మాధ్యమాల్లో పెడతామని వేముల వీరేశాన్ని బెదిరించారు. తర్వాత కొద్దిసేపటికే కొందరు కార్యకర్తల ఫోన్లకు ఆ వీడియోను సైబర్ నేరగాళ్లు పంపారు. ఈ ఘటనపై నకిరేకల్ పోలీసులకు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఇది మధ్యప్రదేశ్‌కు చెందిన సైబర్ నేరగాళ్ల పని అని గుర్తించామని.. వారిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని పోలీసులు చెప్పారు.

కూతురిని ఉరేసి చంపి.. పెట్రోలు పోసి నిప్పు!

» వేరే కులం వ్యక్తిని ప్రేమిస్తుందని తండ్రి ఘోరం

» ఏపీలోని గుంతకల్లులో ఘటన

గుంతకల్లు టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కూతురు మరో కులం వ్యక్తిని ప్రేమిస్తుందని తెలిసి ఓ తండ్రి ఉన్మాదిలా మారాడు.. ఏకంగా ఆమెను ఉరేసి చంపి, ఆపై పెట్రోలు పోసి నిప్పంటించాడు.. ఏపీలోని అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన రామాంజినేయులకు భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారు. ముగ్గురు కూతుళ్లకు వివాహం చేయగా.. చిన్న కూతురు భారతి(21) కర్నూలులో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. అయితే హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్న ఓ యువకుడిని ఆమె ప్రేమించింది. అతడిది వేరే కులం కావడంతో తల్లిదండ్రులు భారతిని మందలించారు. కానీ అతడినే పెళ్లి చేసుకుంటానని భారతి తేగేసి చెప్పడంతో రామాంజినేయులు తట్టుకోలేకపోయాడు. ఈ నెల ఒకటో తేదీన తన కూతురిని బైక్‌పై ఎక్కించుకుని గుంతకల్లు మండలం కసాపురానికి తీసుకెళ్లాడు. గ్రామ శివారులోకి వెళ్లాక చివరి ప్రయత్నంగా ఆ యువకుడిని మరచిపోవాలని నచ్చజెప్పాడు. ఆమె మాట వినకపోవడంతో బలవంతంగా పట్టుకుని, చెట్టుకు ఉరి వేసి వెళ్లిపోయాడు. కొంత దూరం వెళ్లాక మళ్లీ తిరిగొచ్చి.. చనిపోయిందని నిర్ధారించుకొని తన బైక్‌లో నుంచి పెట్రోల్ తీసి, భారతి మృతదేహంపై చల్లి నిప్పంటించాడు. మూడు రోజుల తర్వాత, రామాంజినేయులు మంగళవారం సాయంత్రం గుంతకల్లు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కూతురిని హత్య చేసిన విషయం తెలిపాడు.

నా పెళ్లాన్ని చంపేశా సార్..!

అలిగి ఇల్లు వదిలిన భార్యను పోలీసులు కనిపెట్టాలని ఓ మందుబాబు నాటకం

సంగారెడ్డి జిల్లా కల్హేర్ పీఎస్‌లో హల్‌చల్.. ఆమె క్షేమం.. మందుబాబుకు పోలీసుల కౌన్సెలింగ్

కల్హేర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తన మీద అలిగి ఇల్లు వదిలి వెళ్లిన భార్యను వెతుక్కునే ఓపిక లేక.. పోలీసులతోనే త్వరగా కనిపెట్టించాలని ఓ మందుబాబు అతి తెలివి ప్రదర్శించాడు. ఫుల్‌గా మద్యం తాగి పోలీసు స్టేషన్‌కు వెళ్లి.. సార్ నా పెళ్లాన్ని కత్తితో పొడిచి చంపేశా.. అంటూ హల్‌చల్ చేసి పోలీసులందరినీ పరుగెత్తించాడు. హత్య కేసు అని ఆ వ్యక్తి గ్రామానికి హడావుడిగా వెళ్లిన పోలీసులు.. ఆ భార్య క్షేమంగా ఉండడం చూసి కంగుతిన్నారు. సంగారెడ్డి జిల్లా కల్హేర్ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఈ వింత ఘటన జరిగింది. నిజాంపేట మండల పరిధిలోని కల్వోనికుంట తండాకు చెందిన బద్యానాయక్ అనే మందుబాబు పోలీసులను ఇలా బురిడి కొట్టించాడు. అసలేం జరిగిందంటే.. మద్యానికి బానిసైన బద్యానాయక్ తన భార్య చాందిబాయితో నిత్యం గొడవలు పడుతుంటాడు. మంగళవారం రాత్రి కూడా మద్యం తాగి వచ్చి చాందిబాయితో గొడవ పడ్డాడు. అయితే, బుధవారం ఉదయం నిద్ర లేచి చూసేసరికి చాందిబాయి ఇంట్లో లేకపోవడంతో.. భార్య తనని వదిలి ఎక్కడికో వెళ్లిపోయిందని భయపడ్డ బద్యానాయక్ మళ్లీ మద్యం తాగాడు. అదే మత్తులో కల్హేర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సై వెంకటేశం ముందు నిలబడి.. తన భార్యను తానే కత్తితో పొడిచి చంపేశానని చెప్పాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే కల్వోనికుంట తండాకు చేరుకోగా.. తండాలోని అంగన్‌వాడీ కేంద్రం పక్కన చాందిబాయి నిద్రించి ఉంది. ఆమె క్షేమంగా ఉండడంతో వివరాలు తెలుసుకున్న పోలీసులు అసలు విషయం గ్రహించి అక్కడి నుంచి వెనుదిరిగారు. తమను ఆటపట్టించిన బద్యానాయక్‌కు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించి కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరించి పంపేశారు. భార్యను చంపేశానని చెబితే పోలీసులే ఆమెను వెతికి తీసుకువస్తారనే ఆలోచనతో బద్యా ఈ నాటకం ఆడాడని పోలీసులు పోలీసులు భావిస్తున్నారు.

రోజుకు ఎన్ని నీళ్లు తాగాలి?

ఇళ్లు, ఆఫీసుల్లో ఉండేవాళ్లు 2 లీటర్లు




» ఎండలో పని చేసే వాళ్లు 4 లీటర్లు

» బీపీ ఔషధాలు వాడేవాళ్లు 2.5 లీటర్లు

» వైద్యుల సూచనలు

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి రోజుకు ఎన్ని నీళ్లు తాగాలి? ఏం సమయంలో నీళ్లు తాగాలి ? ఈ ప్రశ్నలకు రకరకాల సమాధానాలు వినిపిస్తుంటాయి. పొద్దున నిద్ర లేవగానే ఎక్కువ నీళ్లు తాగాలని కొందరు చెబితే.. ప్రతీ రోజు ఇన్ని లీటర్ల నీళ్లు తప్పనిసరిగా తాగాల్సిందేనని మరికొందరు ఏదో ఓ అంకె చెప్పేస్తుంటారు. ఇందులో ఏది నిజమనే సంగతి పక్కనపెడితే.. వేసవి కాలం మొదలవుతుండడంతో ఈ నీటి లెక్క మరింత చర్చనీయాంశం కాబోతుంది. నిజానికి, ఓ మనిషి రోజుకు ఎన్ని నీళ్లు తాగాలనే దానికి స్పష్టమైన లెక్కలు లేవు. కానీ భౌగోళిక పరిస్థితులు, ఎండల తీవ్రత అంశాల ఆధారంగా ఓ మనిషి ఎన్ని నీళ్లు తాగాలనేది ఆధారపడి ఉంటుందని ఎక్కువ మంది వైద్య నిపుణుల అభిప్రాయం. ఓ మనిషి పని చేసే వాతావరణం ప్రకారం నీళ్లు తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇక, తాగు నీటి పరిమాణం అందరిలోనూ ఒకే విధంగా ఉండదని హార్వర్డ్ మెడికల్ స్కూల్ స్పెషల్ హెల్త్ రిపోర్టు చెబుతోంది. ఓ మనిషి జీవన శైలి, పని ప్రదేశం, ఉష్ణోగ్రతలతోపాటు ఆరోగ్య సమస్యలు, తీసుకునే మందులు ఆధారంగానూ మంచి నీటిని తీసుకోవాలని ఆ నివేదిక పేర్కొంది.



నీళ్లు ఎప్పుడు తాగాలంటే...

నీళ్లు ఎప్పుడు తాగాలి అనే దానిపై వైద్యనిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. రాత్రి నిద్రపోయి ఉదయం నిద్ర లేచే సరికి ఓ మనిషి శరీరంలో నీటి నిల్వలు తగ్గుతాయి. అందువల్ల ఉదయాన్నే కొంచెం ఎక్కువ నీళ్లు తీసుకోవాలి. సాధారణంగా మూత్రం కొద్దిగా లేత పసుపురంగులో ఉంటుంది. నీళ్లు ఎక్కువగా తాగితే మూత్రం కూడా అదే రంగులో వస్తుంది. చాలా సేపు మంచినీళ్లు తాగకుండా ఉంటే మూత్రం ముదురు పసుపు రంగులోకి మారుతుంది. కొన్నిసార్లు మూత్రంలో మంట కూడా వస్తుంది. ఓ మనిషి రోజుకు కనీసం లీటరు నుంచి లీటరన్నర వరకు మూత్రం పోయాలని వైద్యులు చెబుతున్నారు. మూత్రం లేత పసుపు రంగు నుంచి ముదురు పసుపు రంగులోకి మారే వరకు ఆగకుండా నీరు తాగాలి. ఒకవేళ ముదురుపసుపు రంగులోకి మారితే కచ్చితంగా తగినన్ని నీళ్లు తీసుకోవాలని సూచిస్తున్నారు. అయితే, ఎన్ని నీళ్లు తాగాలనేది.. సదరు వ్యక్తి పనిచేసే, ఉంటున్న వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు.. కార్యాలయాల్లో పని చేసే వారైతే రోజుకు 8 గ్లాసులు(అంటే రెండు లీటర్ల వరకు) నీళ్లు తాగాలని వైద్యులు చెబుతున్నారు. అదే తీవ్రమైన ఎండలో బహిరంగ ప్రదేశాల్లో పని చేసే వ్యవసాయ కూలీలు, కార్మికుల శరీరం నుంచి చెమట రూపంలో నీటి నిల్వలు శరీరం నుంచి బయటికి పోతాయి. అందువల్ల అలాంటి వారు రోజుకూ కనీసం 3-4 లీటర్ల నీళ్లు తాగాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

అతిగా తాగినా ప్రమాదమే..

శరీరంలో నీటి నిల్వలు తగ్గకూడదని నీళ్లు అతిగా తాగినా ముప్పేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నీళ్లు ఎక్కువగా తాగితే శరీరంలోని సోడియం మూత్రంతో వెళ్లిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల అతిగా నీళ్లు తీసుకోవడం కూడా ముప్పే. ఇక, రక్తపోటు మందులు శరీరంలో సోడియం లెవెల్స్‌ను తగ్గిస్తాయి. రక్తపోటు మందులు తీసుకునే వారు నీళ్లు ఎక్కువగా తాగితే సోడియం లెవెల్స్ మరింత వేగంగా తగ్గుతాయి. అదే జరిగితే మెదడు దెబ్బతిని మనిషి అపస్మారక స్థితిలోకి వెళ్లే ముప్పు ఉంది. అందువల్ల రక్తపోటు మందులు వాడుతున్న వారు నీటిని తీసుకోవడంలో జాగ్రత్తలు పాటించాల్సిందేనని వైద్యులు సూచిస్తున్నారు.

కనీసం 4 లీటర్లు తాగాలి



ఇళ్లలోనే ఉండేవాళ్లు రోజుకు కనీసం రెండు లీటర్లు, ఎండలో పని చేసే వాళ్లు కనీసం 4 లీటర్ల నీళ్లు తాగాలి. తీవ్రమైన ఎండలో పని చేసే వారైతే మజ్జిగలో ఉప్పు, నిమ్మకాయ పిండుకుని తాగాలి. నీళ్లు మరీ ఎక్కువగా తాగితే సోడియం స్థాయిలు తగ్గి, ఎముకల్లో ధృడత్వం తగ్గిపోతుంది. అటువంటి వారు సిరం ఎలక్ట్రోలైట్ పరీక్షలు చేయించు కోవాలి.

- డాక్టర్ ఎంవీ రావు, సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్, యశోద ఆస్పత్రి, హైదరాబాద్

టీడీఎస్ 300కు తగ్గకూడదు



నీరు శరీరంలో షుగర్, ప్రోటీన్ లెవల్స్ పెరగకుండా నియంత్రిస్తుంది. బోర్ నీళ్లు తాగకుండా ఉంటే మంచిది. ఎక్కువ కాలం బోర్ నీళ్లు తాగితే కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఉంది. తాగేనీటిలో టోటల్ డిజాల్వ్ సాలిడ్ (టీడీఎస్) స్థాయిలు కనీసం 300కు తగ్గకుండా ఉంటే మంచిది.

- డాక్టర్ తాడూరి గంగాధర్, నెఫ్రాలజీ హెచ్‌వోడీ, నిమ్స్ ఆస్పత్రి

మామునూరులో ఎకరా రూ.2కోట్లు!

» మార్కెట్ రేటుతో పాటు భూమికి భూమి ఇవ్వాలంటూ రైతుల పట్టు

» ఎయిర్‌పోర్టుకు భూసేకరణే అడ్డంకి..

వరంగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్ విమానాశ్రయానికి కావాల్సిన భూములను ఇచ్చేందుకు రైతులు ససేమిరా అంటున్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు భూసర్వే చేయవద్దంటూ అధికారులను అడ్డుకోవటంతో ఎయిర్‌పోర్టు పనులకు బ్రేక్ పడింది. భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.205కోట్లను కేటాయించింది. ఎకరాకు ప్రాంతాన్ని బట్టి రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకు చెల్లించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే భూమికి భూమితో పాటు మార్కెట్‌ధర చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, భూములు కోల్పోతున్న రైతుల పిల్లలకు ఎయిర్‌పోర్టులో ఉద్యోగావకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే, మామునూరులో మార్కెట్ ధర ప్రస్తుతం ఎకరా రూ.2కోట్లపైనే ఉంది. 253ఎకరాలకు రూ.2కోట్ల చొప్పున భూసేకరణకే రూ.506 కోట్లు చెల్లించడం సాధ్యం కాదని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. వాస్తవానికి ఇక్కడ ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధీనంలో 696.14 ఎకరాల భూమి ఉంది. ఇంకా 253 ఎకరాల భూమిని ఏఏఐకి అప్పగించాల్సి ఉండటంతో.. 136 మంది రైతుల నుంచి ఆ భూమిని సేకరించేందుకు గత ఏడాది నవంబరులో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఇప్పటికే సుమారు 166 ఎకరాల భూమిని సర్వే నిర్వహించారు. మరో 87ఎకరాల్లో సర్వే నిర్వహించాల్సి ఉండగా, మంగళవారం సర్వే కోసం వెళ్లిన అధికారులు, సిబ్బందిని రైతులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలోనే భూసేకరణలో జాప్యం జరిగితే మళ్లీ విమానాశ్రయం కథ మొదటికి వస్తుందని ఆందోళనలో సర్కారు ఉంది. అయితే రైతులను బీఆర్ఎస్ నేతలే రెచ్చగొడుతున్నారని కాంగ్రెస్ నాయకులు మండిపడుతున్నారు. అయినప్పటికీ భూసేకరణకు రైతులు ఒప్పిస్తామని చెబుతున్నారు.

అమెరికాలో కాల్పులు.. తెలంగాణ విద్యార్థి మృతి


ప్రవీణ్ (ఫైల్)

కేశంపేట, ఫిబ్రవరి 5: (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన రంగారెడ్డి జిల్లా యువకుడు దుండగుల కాల్పులకు బలయ్యాడు. ఓ స్టోర్‌లో పార్ట్ టైమ్ జాబ్ చేస్తున్న అతడు.. అక్కడికి వచ్చిన దుండగులను అడ్డుకోబోగా వారు కాల్పులు జరిపి పారిపోయారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల కేంద్రానికి చెందిన గంప రాఘవులు-రమ దంపతుల కుమారుడు ప్రవీణ్(27) ఎంఎస్ చేయడానికి 2023లో అమెరికా వెళ్లాడు. ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్ మిల్వాకీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఒక స్టోర్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్న ప్రవీణ్.. మంగళవారం విధులు నిర్వర్తిస్తుండగా కొందరు దుండగులు అందులోకి ప్రవేశించారు. వారిని అడ్డగించడానికి ప్రవీణ్ ప్రయత్నించగా తుపాకులతో కాల్పులు జరిపారు. గాయపడిన ప్రవీణ్‌ను మిల్వాకీ పోలీసులు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు ప్రవీణ్ తల్లిదండ్రులకు అక్కడి పోలీసులు సమాచారమిచ్చారు. 3 నెలల్లో ఎంఎస్ పూర్తి చేసుకుని ప్రవీణ్ రావాల్సి ఉందని.. ఇంతలోనే దారుణం జరిగిపోయిందని కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు.

సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్‌లో గంజాయి స్మగ్లింగ్

» సంగారెడ్డిలో 200 కిలోల గంజాయి ప్యాకెట్ల స్వాధీనం

» శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 5.5 కోట్ల విలువైన హైడ్రోపోనిక్ గంజాయి పట్టివేత

పటాన్‌చెరు/ శంషాబాద్ రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్‌లో గంజాయిని తరలిస్తున్న ముఠాను సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లోని ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నెం 2 వద్ద జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్‌ను తనిఖీ చేయగా రూ.కోటి విలువైన200కిలోల గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. ఈ గంజాయిని ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు నిందితులు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డీఆర్ఐ అధికారులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి బుధవారం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న ఓ మహిళా ప్రయాణికురాలి బ్యాగులను కస్టమ్స్, డీఆర్ఐ అధికారులు తనిఖీ చేయగారూ.5.5కోట్ల విలువైన 5.48కిలోల హైడ్రోపోనిక్ గంజాయి దొరికింది. ఆ మహిళను అదుపులోకి తీసుకుని అధికారులు విచారిస్తున్నారు.

నేను ఆత్మహత్యాయత్నం చేయలేదు

పోలీసులతో గాయని కల్పన.. నిద్ర పట్టక ఎక్కువ మాత్రలు వేసుకున్నట్టు వెల్లడి

» 20 నిద్ర మాత్రలు వేసుకున్న గాయని

» ఓవర్ డోస్ వల్లే అమ్మ అపస్మారక స్థితికి

» విలేకరులతో కల్పన కుమార్తె దయ

హైదర్‌నగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అధిక మోతాదులో నిద్ర మాత్రలు తీసుకుని ఆస్పత్రిపాలైన సినీ నేపథ్య గాయని కల్పన ఆరోగ్యం మెరుగుపడింది. అయితే, తాను ఆత్మహత్యకు యత్నించలేదని కల్పన పోలీసులకు వెల్లడించారు. కుమార్తెతో జరిగిన వాగ్వాదం అనంతరం నిద్ర పట్టక అధిక మోతాదులో మందులు తీసుకోవడం వల్లే అపస్మారక స్థితిలోకి వెళ్లానని పోలీసులకు వివరించారు. కల్పనను విచారించిన కేపీహెచ్‌బీ పోలీసులు ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. దాని ప్రకారం.. కల్పన, ప్రసాద్ ప్రభాకర్‌కు ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరిద్దరికీ ఇది ద్వితీయ వివాహం. మొదటి వివాహం ద్వారా కల్పకు ఒకరు, ప్రసాద్‌కు ఇద్దరు సంతానం ఉన్నారు. కల్పన దంపతులు, ముగ్గురు సంతానం కలిసి కేరళలోని ఎర్నాకులంలో నివాసం ఉంటున్నారు. వృత్తిరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్న కల్పన.. కూకట్‌పల్లి నిజాంపేటలోని వెర్టెక్స్ ప్రివిలేజ్ విల్లాలో ఐదేళ్లుగా అద్దెకు ఉంటున్నారు. కల్పన ఈనెల 2న ఎర్నాకులం వెళ్లారు. తనతోపాటు హైదరాబాద్‌కు వచ్చి చదువుకోవాలని కుమార్తె దయ ప్రసాద్‌ను 3వ తేదీన కోరగా ఆమె తిరస్కరించింది. దీంతో మనస్తాపానికి గురైన కల్పన ఈ నెల 4న కొచ్చి నుంచి హైదరాబాద్‌కు విమానంలో బయలుదేరారు. అయితే, నిద్రలేమి సమస్యకు వైద్యులు సూచించిన మందులను అప్పటికే వినియోగిస్తున్న కల్పన.. విమానం ఎక్కే ముందు రెండు మాత్రలు వేసుకున్నారు. నిజాంపేటలోని ఇంటికి ఆ రోజు మధ్యాహ్నం చేరుకున్న తర్వాత కూడా నిద్ర రావడం లేదని ఎనిమిది మాత్రలు వేసుకున్నారు. ఆ తర్వాత కూడా నిద్ర పట్టకపోవడంతో మరో 10 మాత్రలు వేసుకున్నారు. దీంతో మందులు మోతాదు మించడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయారు. భర్త ప్రసాద్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా కల్పన స్పందించకపోవడంతో ఆయన.. కాలనీ సొసైటీ సభ్యుల సాయం కోరారు. వారి ద్వారా విషయం తెలుసుకుని ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఇంటి తలుపులు తెరిచి అపస్మారక స్థితిలో ఉన్న కల్పనను ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకున్న కల్పనను పోలీసులు బుధవారం విచారించారు. తాను ఆత్మహత్య యత్నానికి పాల్పడలేదని, భర్తతో తనకు ఎలాంటి విభేదాలు లేవని, కుమార్తెతో కొచ్చిలో జరిగిన వాగ్వాదం వల్ల నిద్ర పట్టక పోవడంతో ఎక్కువ సంఖ్యలో నిద్ర మాత్రలు తీసుకున్నానని కల్పన పోలీసులకు తెలిపారు. కాగా, మంగళవారం సాయంత్రం తమ ఆస్పత్రిలో చేరిన కల్పన ఆరోగ్యం మెరుగుపడిందని శ్రీశ్రీ హోలిస్టిక్ ఆస్పత్రి వైద్యులు బుధవారం ప్రకటించారు. కల్పన ఆరోగ్యం నిలకడగా ఉండటంతో వెంటిలేటర్ తొలగించి చికిత్స అందిస్తున్నామని, పూర్తిగా కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేస్తామని పేర్కొన్నారు.



అమ్మ ఆత్మహత్యకు ప్రయత్నించలేదు: కుమార్తె దయ

తన తల్లి, గాయని కల్పన ఆత్మహత్యకు యత్నించలేదని కల్పన కుమార్తె దయ ప్రసాద్ స్పష్టం చేశారు. తల్లిని పరామర్శించేందుకు కేరళ నుంచి హైదరాబాద్ వచ్చిన దయ.. విలేకరులతో మాట్లాడారు. నిద్రలేమి సమస్యకు కల్పన మందులు వాడుతున్నారని, అవి అధిక మోతాదులో తీసుకుని అపస్మాకర స్థితిలోకి వెళ్లారని చెప్పారు. తల్లి ఆరోగ్యంపై తప్పుడు వార్తలు ప్రచారం చేయవద్దని దయ కోరారు.

ఆడపడుచే చంపేసింది

తరచూ శిరీష ఉద్యోగం మానేయడంపై సరిత నిలదీత.. ఇద్దరి మధ్య గొడవ



» వివాహేతర బంధాల చిట్టా విప్పుతానని ఆడపడుచు సరితను హెచ్చరించిన శిరీష

» శిరీషకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చి.. ముఖంపై దిండు అదిమి హత్యచేసిన సరిత

చాదర్‌ఘాట్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నర్సు ముగాల శిరీష (34)ను చంపింది ఆమె భర్త వినయ్ కుమార్ కాదు.. ఆమె ఆడపడుచు సరిత అని పోలీసులు తేల్చారు. హత్యను సహజ మరణంగా చిత్రీకరించేందుకు వినయ్, అతడి సోదరి కుమారుడు నిహాల్ సహకరించారని నిర్ధారించారు. ఏసీపీ శ్యామ్ సుందర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. మలక్‌పేటలో శిరీష (34), ఆమె భర్త వినయ్ ఉంటున్నారు. వినయ్ సోదరి సరిత తన భర్త లక్ష్మణ్ ఓమన్‌లో ఉండటంతో వీరి వద్దే ఉంటోంది. వినయ్, సరిత సోదరి గీత కుమారుడు, డిగ్రీ చదువుతున్న నిహాల్ కూడా వీరితోనే ఉంటున్నాడు. నర్సుగా తరచూ ఆస్పత్రులు మారుతుండటంతో శిరీషను ఇంట్లో శనివారం రాత్రి సరిత మందలించింది. ఇద్దరూ వినయ్, నిహాల్ సమక్షంలోనే గొడవపడ్డారు. ఒకదశలో సహనం కోల్పోయిన శిరీష.. 'నీ వివాహేతర సంబంధాల చరిత్రను నీ భర్త లక్ష్మణ్‌కు చెబుతా'నంటూ సరితను బెదిరించింది. కోపంతో ఊగిపోయిన సరిత ఆమెపై దాడికి దిగింది. కొద్దిసేపటికి ఇద్దరూ శాంతించి.. పరస్పరం క్షమాపణలు చెప్పుకున్నారు. కొద్దిసేపటికి శిరీష, సరిత వద్దకొచ్చి.. నిద్రపట్టడం లేదని, ఏదైనా మాత్ర ఉంటే ఇవ్వాలని అడిగింది. ఇదే అదనుగా భావించిన సరిత.. మిడాజోలమ్ అనే మత్తు ఇంజెక్షన్‌ను మోతాదుకు మించి శిరీషకు ఇచ్చింది. కొద్దిసేపటికే గాఢ నిద్రలోకి జారుకున్న శిరీషను ముఖమ్మీద దిండు పెట్టి.. ఊపిరాడకుండా చేసి చంపింది. ఉదయం విషయాన్నంతా వినయ్, నిహాల్‌కు వివరించింది. ముగ్గురూ కలిసి.. శిరీష హత్యను గుండెపోటు మృతిగా చిత్రీకరించాలనుకున్నారు. శిరీషకు గుండెపోటు వచ్చిందని.. తానే సీపీఆర్ చేశానంటూ సరిత ఫోన్ చేసి అంబులెన్స్‌ను పిలిపించింది. అందులో మృతదేహాన్ని ఎక్కించుకొని ముగ్గురూ మలక్‌పేట మెట్రో క్యూర్ ఆస్పత్రికి బయలుదేరారు. అయితే దారిలోనే శిరీష మృతిచెందినట్లు ఆస్పత్రి వారికి ఫోన్ చేశారు. శిరీష గుండెపోటుతో చనిపోయిందని ఆమె మేనమామ మధుకర్‌కు ఫోన్ చేసి చెప్పారు. అనుమానించిన ఆయన వెంటనే మలక్‌పేటలోని మెట్రో క్యూర్ ఆస్పత్రికి వెళ్లగా.. అప్పటికే మృతదేహాన్ని అంబులెన్స్‌లో సొంతూరైన నాగర్‌కర్నూల్ జిల్లా దోమల పెంటకు తీసుకెళ్తున్నట్లుగా తెలుసుకున్నాడు. వెంటనే ఘటనపై ఆయన చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, వారు వినయ్‌కు ఫోన్ చేసి.. అంబులెన్స్‌ను వెనక్కి పిలిపించారు. శిరీష మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. నివేదికలో ఆమె హత్యకు గురైందని తేలింది. సరిత, వినయ్, నిహాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.